ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
10-9-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 222 పేజీలు: 10+4 వెల: 6.50

పండుగల వేళ విమాన ఛార్జీలకు రెక్కలు 3
నాలుగు పార్టీలతో టివికె కూటమి 5



## రైల్వేకు కొత్త ఊపు

తెలంగాణ, ఏపి సహా 8 విస్తరణ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం

7 కారిడార్లలో నాలుగు లేన్ల నిర్మాణం

మొత్తం రూ. 20,804 కోట్ల వ్యయం

ఘట్‌కేసర్ - కాజీపేట 110 కి.మీ మల్టీట్రాకింగ్

వివరాలు వెల్లడించిన రేల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:** కేంద్ర మంత్రవర్గ సమావేశంలో దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల్లో రైలు మార్గాల అనుసంధాన ప్రాజెక్ట్‌లపై కీలక నిర్ణయం తీసుకున్నారు. మొత్తం రూ.20,804 కోట్ల విలువైన 8 ప్రాజెక్టుల్లో ఐదు దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలోనే ఉన్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం దేశ వ్యాప్తంగా రైలు మార్గాల అనుసంధాన ప్రాజెక్టులపై కీలక నిర్ణయం >>2

# దాడిపై సమగ్ర విచారణ

ఫాంహౌస్ కుట్ర, అసెంబ్లీ ఎదుట ఘటనలపై విచారణ జరపనున్న జాయింట్ సిపి విజయ్‌కుమార్

కోర్టు బెయిల్ ఇచ్చినా సమాజం ఇవ్వదు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్ట కింద ఎంతటి వారినైనా శిక్షిస్తాం

అసెంబ్లీలో ప్రకటించిన సిఎం రేవంత్



బుధవారం సభలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు9:** బీఆర్ఎస్‌పై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫాంహౌస్‌లో కుట్రకు ప్రణాళికలు రూపొందించారని ఆరోపించారు. సభను అడ్డుకోవాలని బీఆర్ఎస్ సభ్యులు కుట్ర చేశారని ధ్వజమెత్తారు. బుధవారం సాయంత్రం అసెంబ్లీలో ముఖ్యమంత్రి పలు అంశాలపై మాట్లాడారు. మూడు రోజుల ఘటనలకు ఫాంహౌస్ సాక్షిగా కుట్ర జరిగిందని ఆరోపించారు. అసెంబ్లీ ఘనటలపై విచారణకు ఆదేశించామని అన్నారు. దళితులను ఉద్దేశపూర్వకంగా అవమానించడం.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం.. విద్వేషాలు, అల్లర్లు రెచ్చగొట్టడం నేరమని హెచ్చరించారు. దళితులపై అణచివేత, దురాగతాలకు పాల్పడిన వారిని.. చట్టపరంగా శిక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కుట్ర చేసిన వారితో పాటు అమలు చేసిన వారిని.. కోర్టులో నిలబెట్టి శిక్షించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ ఘటనలపై సమగ్ర విచారణ చేపట్టాలని నిర్ణయించామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. విచారణ అధికారిగా ఐపీఎస్ విజయ్ కుమార్(హైదరాబాద్ జాయింట్ సీపీ-ఎస్‌బీ)ను నియమించామని వెల్లడించారు. ఈనెల 6వ తేదీన ఫాంహౌస్‌లో కుట్ర జరిగిందని ఆరోపించారు. 7వ తేదీన స్పీకర్‌పై మాటల దాడి జరిగిందని అన్నారు. 8వ తేదీన శుద్ధి కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ప్రత్యక్షంగా పాల్గొన్న వారితో పాటు.. కుట్ర చేసిన అందరిపైనా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కోర్టు బెయిల్ ఇవ్వొచ్చేమో గానీ.. సమాజం మాత్రం బెయిల్ ఇవ్వదని >>2

అసెంబ్లీ నుంచి కెటిఆర్ సహా బిఆర్ఎస్ సభ్యుల

## సస్పెన్షన్

3వ రోజునా సభలో తీవ్ర గందరగోళం

వెల్‌లోకి దూసుకొచ్చిన బిఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్, సెప్టెంబరు 9,ప్రభాతవార్త:** తెలంగాణ శాసనసభ మూడోరోజు బుధవారం కూడా గందరగోళంగా మారింది. కెసిఆర్ చావు కోరిన సభ్యుడిపై వేటువేయాలని బిఆర్ఎస్ డిప్యూటి లీడర్ హరీశ్‌రావు సభ >>2



బుధవారం శాసన సభలో ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు



3

ప్రజాజీవితంలో
### మోడీ @ 25
దేశప్రగతిలో కీలకపాత్ర: బిజెపి చీఫ్ నితిన్ నబిన్



5

విద్యార్థులకు నోటీసులు ఇస్తారా?
నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌పై సుప్రీం ఆగ్రహం



5

సింగపూర్ ప్రధానికి ప్రపంచంలోనే
### అత్యధిక వేతనం
యేడాదికి రూ.27 కోట్లు

## వాకౌట్



అసెంబ్లీలో మాట్లాడుతున్న బిజెపి పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

22 ఎ పై చర్చ జరపలేదని అసెంబ్లీ నుంచి
### వాకౌట్ చేసిన బిజెపి

**హైదరాబాద్, సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** కరెంట్ కోతలు, ఫీ రీయింబర్స్‌మెంట్, 22 ఎ తదితర సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని నిరసిస్తూ బిజెపి సభ్యులు శాసనసభ నుండి వాకౌట్ చేశారు. శాసనసభలో బుధవారం మధ్యాహ్నం బిజెపి శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వరెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమై మూడు రోజులు అవుతున్నా ప్రజా సమస్యలపై ఇప్పటి వరకూ చర్చించలేదని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని, >>2





### మాట్లాడే అవకాశం కావాలంటూ కౌన్సిల్ నుంచి బిఆర్ఎస్ వాకౌట్

**హైదరాబాద్, సెప్టెంబరు 9,ప్రభాతవార్త:** శాసనమండలి నుంచి బిఆర్ సభ్యులు వాకౌట్ చేశారు. శాసనమండలి బుధవారం సమావేశం కాగానే ఇద్దరు బిఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేయడం పట్ల నిరసన తెలిపారు. సభ్యులను సస్పెండ్ చేసే ముందు కనీసం మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, కారణం కూడా సరిగ్గా చెప్పలేదని వారు అన్నారు. పలువురు బిఆర్ సభ్యులు వెల్ వచ్చి బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అయినా చైర్మన్ తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడంలేదని బిఆర్ఎస్ పక్ష నాయకులు ఎస్.మధుసూదనాచారి నిరసన వ్యక్తం చేస్తూ బిఆర్ సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి సభ నుంచి నిష్క్రమించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దళితులు మంగళవారం కెసిఆర్ ఫామ్ వద్ద డప్పు చప్పుళ్లతో నిరసన వ్యక్తం చేస్తే, ఆ ప్రాంతాన్ని బిఆర్ నాయకులు పసుపు నీళ్లతో శుద్ధి చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్యంలో చీకటి రోజు అని అన్నారు. ఇందుకు ఇది ముమ్మాటికీ దళితులను >>2



గవర్నర్ శుక్లాకు వినతి పత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ తదితరులు

అది గౌరవ సభ కాదు..
# కౌరవ సభ

పోలీసుల దౌష్ట్యాన్ని గవర్నర్ శుక్లాకు వివరించాం: కెటిఆర్

మానవహక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌కూ వెళ్తామని వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** అసెంబ్లీ ముందు మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేసిన దాడి చేసిన తీరును బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆధ్వర్యంలో ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు ఫిర్యాదు చేశారు. అనంతరం రాజ్‌భవన్ బయట కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ లాంటి పరిస్థితిని వివరించడానికి వారిని సమయం అడిగాం.. మాకు సమయం ఇచ్చారు. వారికి మా పార్టీ పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. వారికి చిన్న ఆరోగ్యసమస్య వచ్చింది, వారు సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా మా పార్టీ తరపున ఆకాంక్షను తెలియజేశామన్నారు. ఈ రాష్ట్రంలో నెలకొన్ని అన్ని పరిస్థితులను గవర్నర్‌కు కూలంకషంగా మా పార్టీ శాసనసభ్యులు, శాసన మండలిలో ప్రతిపక్ష నాయకులు, ఉప నాయకులు, సీనియర్ నాయకులు అంతా కలిసి చాలా వివరంగా గవర్నర్‌కు చెప్పామన్నారు.

కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనలో ప్రజలకు అన్యాయమే జరిగిందని నల్ల టీషర్టులు ధరించి నిరసన తెలుపుతుంటే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని కేటీఆర్ పేర్కొన్నారు. అసెంబ్లీకి రానివ్వకుండా పోలీసులు దాడి చేసిన తీరును, తెలంగాణలో పరిస్థితులను గవర్నర్‌కు వివరించామన్నారు. శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డిపై పురుష పోలీసుల దాడి వీడియోలను చూపించాం. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను తెలిపామన్నారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను లాగి దుశ్శాసనపర్వం ఎలా సృష్టించారో చెప్పామన్నారు. కేసీఆర్ చావు కోరుతూ ఎలా మాట్లాడారో గవర్నర్‌కు చెప్పామన్నారు. ంరూల్స్‌కు విరుద్ధంగా తమ ఎమ్మెల్సీలను ఎలా సస్పెండ్ చేశారో గవర్నర్ శుక్లాకు చెప్పామన్నారు. గౌరవ సభ కాదది, కౌరవ సభ, శాసన సభ కాదు.. దుశ్శాసన సభ, అదే విషయాన్ని గవర్నర్‌కు వీడియోలతో సహా వివరించామన్నారు. సభ బయట అంశాలపై డీజీపీ, సీపీతో గవర్నర్ మాట్లాడతానన్నారని వెల్లడించారు. ఫామ్ హౌస్‌కు కాంగ్రెస్ గూండాలు ఎలా వెళ్లారో గవర్నర్‌కు చెప్పామన్నారు. రాహుల్ గాంధీ తరహాలోనే బ్లాక్ టీషర్ట్ వేసుకున్నాం. మేం చేసిన తప్పేంటి.. తెలంగాణలో పరిస్థితులను గవర్నర్ శుక్లాకు వివరించాం. రాష్ట్రంలో ప్రజలకే కాదు.. ప్రజా ప్రతినిధులకూ >>2



కానిస్టేబుల్ పోస్టులకు
### వయోపరిమితి పెంపు

**హైదరాబాద్, సెప్టెంబరు9, ప్రభాతవార్త:** నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పోలీస్ నియామకాల్లో వయోపరిమితి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఎస్ఐ, కానిస్టేబుల్, తత్సమాన పోస్టులకు మరో మూడేళ్ల వయో పరిమితిని పెంచింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే పెంచిన ఏజ్ లిమిట్‌కు అదనంగా ఇది వర్తిస్తుంది. ఇంతకు ముందు ఎస్సై ఉద్యోగాలకు వయోపరిమితి 32,కానిస్టేబుళ్లకు 29గా ఉండేది. దీంతో రెండు పోసుల మధ్య వయసు తేడాపై అభ్యంతరాలు రావడంతో ప్రభుత్వం ఎస్ఐ అభ్యర్థులతో సమానంగా కానిస్టేబుల్ అభ్యర్థుల వయోపరి మితిని పెంచింది. కానిస్టేబుల్(డ్రైవర్ పోస్టులకు) మాత్రం ప్రభుత్వం సడలింపు ఇవ్వలేదు.





కోకాపేటలో ఎకరం
### 120 కోట్లు

హెచ్‌ఎండిఎ నియోపోలిస్, గోల్డెన్ మైల్ ఇ-వేలం రేట్లు

**హైదరాబాద్, సెప్టెంబరు9, ప్రభాతవార్త:** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) బుధవారం గండిపేట్ మండలం, >>2

# శుద్ధి.. బుద్ధికి చేయాలి

ఫ్యూడల్ భావజాలానికి తెలంగాణలో స్థానం లేదు

ప్రతిపక్షనేతగా కెసిఆర్ పూర్ణాయుర్దాయంతో ఉండాలి: డి.సిఎం భట్టి



బుధవారం అసెంబ్లీలో ప్రసంగిస్తున్న డి.సిఎం భట్టి

**హైదరాబాద్,సెప్టెంబరు 9,ప్రభాతవార్త:** తెలంగాణ సమాజం ఫ్యూడల్, వివక్షపూరిత భావజాలాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనసభలో సభాపతిని కించపరిచేలా బిఆర్ఎస్ నాయకత్వం వ్యవహరించడాన్ని తీవ్రంగాఖండించారు. మాజీ ముఖ్య మంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ నిండు నూరేళ్లఆయురారోగ్యాలతో జీవించాలని, రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడిగా ప్రజలకు సేవలు అందించాలని తాము మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సభాపతి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన 24 గంటలు గడవకముందే అదే పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు దళితులు నడిచిన రహదారులను శుద్ధి చేసిన ఘటనకు సంబంధించిన పోస్టులు వెలువడటం మరింత బాధ కలిగించిందని చెప్పారు. ఇది కేవలం దళితులను అవమానించడం కాదని, మొత్తం తెలంగాణ సమాజం ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్య అని పేర్కొన్నారు. >>2

ఎథిక్స్ కమిటీకి తాతా మధు, నవీన్
### వివాదం

**హైదరాబాద్, సెప్టెంబరు9, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, నవీన్ రెడ్డిల అంశాన్ని ఎథిక్స్ కమిటీకి సిఫారసు చేస్తున్నట్లు శాసన మండలి స్పీకర్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఎథిక్స్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కాగా, సభ్యులుగా ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, దేశపతి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. బుధవారం శాసన మండలి ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలను ప్రారంభించగా బిఆర్ఎస్ సభ్యులు అడ్డుకున్నారు. సభ్యులపై ప్రవేశ పెట్టిన తీర్మానానికి వివరణ ఇచ్చుకునే అవకాశం లేకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకోడవం అప్రజాస్వామిక >>2



పశ్చిమ బెంగాల్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు నీట మునిగిన మాల్దా జిల్లా మాణిక్‌చక్ బ్లాక్ పరిధిలోని భుత్ని గ్రామం

## అది గౌరవ సభ కాదు.. కౌరవ సభ

>> అవమానాలే ఎదురవుతున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డి సర్కారు ప్రతిపక్ష బీఆర్ఎస్ పట్ల వ్యవహరించిన తీరుపై తాము గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. తమకు ఇక్కడ న్యాయం జరగకపోతే ఢిల్లీలోని మానవ హక్కుల కమిషన్‌కు, జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రేవంత్ రెడ్డి 1000 రోజుల అసమర్థ పాలనపై తాము ప్రజల తరఫున ప్రశ్నిస్తే తమపై అరాచకానికి పాల్పడ్డారని విమర్శించారు. తాము ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ద్వారా తప్పు చేశామా..? అని ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, 1000 రోజులు గడిచినా అమలు చేయని హామీల గురించి ప్రభుత్వాన్ని నిలదీయడం తప్పా..? అని కేటీఆర్ క్వశ్చన్ చేశారు. కాంగ్రెస్ అసమర్థతపై చర్చించేందుకు తాము అసెంబ్లీకి వెళ్లినప్పుడు, పోలీసులు తమను గేటు వద్ద అడ్డుకుని దాడి చేయడమే కాకుండా, తమ మహిళా ఎమ్మెల్యేలపట్ల అసభ్యంగా ప్రవర్తించారని మండిపడ్డారు. ఇందుకు సంబంధించిన ఆధారాలన్నింటితో తాము గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. తమ ఫిర్యాదుపై చీఫ్ సెక్రెటరీ, డీజీపీతో విచారణ చేయిస్తానని గవర్నర్ చెప్పారని కేటీఆర్ తెలిపారు. ఒకవేళ ఇక్కడ న్యాయం జరగకపోతే, తాము ఢిల్లీలోని మానవ హక్కుల కమిషన్‌కు, మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అదేవిధంగా కేసీఆర్ ఇంటిపై దాడి చేయడానికి వెళ్లిన కాంగ్రెస్ గుండాలకు పోలీసులు ఎర్ర తివాచీ పరిచినట్లుగా వ్యవహరించి, వారిని దగ్గరుండి తీసుకెళ్లిన ఘటనపై కూడా తాము గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు.

## శుద్ధి.. బుద్ధికి చేయాలి

>> దేశంలో జరుగుతున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ప్రకారం హక్కుల విషయంలో ప్రతి ఒక్కరూ సమానమేనని భట్టి విక్రమార్క అన్నారు. నెల రోజుల క్రితం ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభలో పాల్గొన్న అనంతరం, అదే మైదానాన్నిబిజెపి నాయకులు శుద్ధి చేశారని ఆయన చెప్పారు. దేశానికి స్వాతంత్రం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడైన ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని శుద్ధి చేసిన ఘటనను బిజెపి ఇప్పటివరకు ఖండించలేదని విమర్శించారు.తెలంగాణలోనూ ఇలాంటి ఘటనలు కొనసాగుతున్నాయని, ఆత్మగౌరవం కోసం ఏర్పడిన తెలంగాణలో ఈ పరిస్థితులు నెలకొనడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర పునాదులే ఆత్మగౌరవంపై ఏర్పడ్డాయని, అలాంటి సభకు స్పీకర్‌గా ఉన్న వ్యక్తిని అవమానిస్తే సభ మొత్తంతో పాటు రాష్ట్రం మొత్తం బాధపడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఫామ్‌హౌస్ ఫ్యూడల్ భావజాలంతో మళ్లీ అదే తరహా చర్యలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. ఇలాంటి పార్టీనే తెలంగాణను పదేళ్లపాటు పాలించిందా అని ప్రశ్నించారు. దేశం తిరిగి మధ్యయుగాల నాటి పరిస్థితుల వైపు వెళ్తుందా అన్న ఆందోళన కలుగుతోందని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు.ఆత్మగౌరవం కోసం పోరాడి సాధించుకున్న రాష్ట్రం : తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఆత్మగౌరవం, వివక్ష నుంచి విముక్తి కోసం సాగిందని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర పునాదులే ఆత్మగౌరవంపై నిర్మితమయ్యాయని చెప్పారు. అలాంటి రాష్ట్రంలో వివక్షను ప్రోత్సహించే చర్యలకు చోటు ఉండకూడదని అన్నారు. తెలంగాణ సమాజం ప్రగతిశీల భావాలతో, సమసమాజ నిర్మాణం కోసం ఎన్నో ఉద్యమాలు చేసినట్లు తెలిపారు. వివక్షను చూసీచూడనట్లు వదిలేసే పరిస్థితి తెలంగాణలో లేదన్నారు.సామాజిక ప్రజాస్వామ్యమే నిజమైన ప్రజాస్వామ్యం:స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం విడదీయరాని విలువలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బోధించారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఫ్యూడల్ భావజాలానికి తెలంగాణలో స్థానం లేదు :గతంలో తెలంగాణను ఫ్యూడల్ భావజాలంతో పాలించిన వారు అధికారం కోల్పోయిన తర్వాత ఆ ఫ్రస్ట్రేషన్‌తో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. కనీసం పశ్చాత్తాపం వ్యక్తం చేస్తారని భావించినా, సభలో అలాంటి వైఖరి కనిపించలేదన్నారు. శుద్ధి చేయాల్సింది నేలలను కాదు.. శుద్ధి చేయాల్సింది వాళ్ల బుద్ధిని, వాళ్ల ఆలోచనలని భట్టి విక్రమార్క ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలతో బలపడదని, సమాజంలో సమానత్వం పెరిగినప్పుడు, వివక్ష తగ్గినప్పుడు, ఆత్మగౌరవం పెరిగినప్పుడు, చివరి వ్యక్తికి న్యాయం అందినప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని అన్నారు. సమసమాజ నిర్మాణానికి అందరూ కలిసిరావాలి:తెలంగాణలోని మేధావులు, ప్రగతిశీల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు ఇలాంటి ఘటనలను ముక్తకంఠంతో ఖండించాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. అవమానాలు, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం అందరూ కలసి పనిచేయాలని కోరారు. ఇది కేవలం సభకు సంబంధించిన అంశం కాదని, ఇదే ప్రజా సమస్య అని పేర్కొంటూ.. ప్రజా సమస్యలపై సభలో చర్చ జరగలేదన్న బిజెపి సభ్యుడు మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలపైనా భట్టి విక్రమార్క స్పందించారు. తెలంగాణ సమాజం సాధించుకున్న ఆత్మగౌరవాన్ని, సమానత్వ విలువలను కాపాడేందుకు అందరూ ఏకకంఠంతో నిలబడాలని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

## అసెంబ్లీలో పంచాయతీరాజ్ 4వ సవరణ చట్టం

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** తెలంగాణ శాసనసభలో పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు మరియు ఆర్థిక లావాదేవీలను సులభతరం చేసేందుకు పంచాయితీరాజ్ చట్టం-2018కి సవరణ చట్టాన్ని ఆ శాఖ మంత్రి ధనసరి అనసూయ శాసనసభలో బుధవారం ప్రవేశపెట్టారు. తెలంగాణలో పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని, పాలనా సౌలభ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టం సవరణలను తీసుకువస్తోంది. తాజా సవరణల ద్వారా గ్రామ పంచాయతీలకు సంబంధించి కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పంచాయతీలు సమకూర్చుకున్న సొంత ఆదాయాన్ని తక్షణ అవసరాల కోసం సమీపంలోని బ్యాంకుల్లో జమ చేసుకునేలా మరియు వెంటనే వాడుకునేలా ఈ సవరణ ద్వారా వెసులుబాటు కల్పించారు. పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని పెంచడానికి, నిధుల నిర్వహణను మరింత పారదర్శకంగా మార్చడానికి ఈ చట్ట సవరణ దోహదపడుతుంది.

### 22 ఎ పై చర్చ జరపలేదని

## అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన బిజెపి

>> ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం కళాశాలలు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయని, అలాగే భూములకు సంబంధించి 22 ఎ తదితర ప్రజా సమస్యలను చర్చించాలని పట్టుపడితే అందుకు అంగీకరించినా, ఎప్పుడు చర్చకు పెడతారనేదానిపై స్పష్టత ఇవ్వకపోవడం సరికాదన్నారు. వీటిపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా తమ పార్టీ వాకౌట్ చేస్తోందని చెబుతూ శాసనసభ నుండి బయటకు వెళ్లిపోయారు. అంతకు ముందు వివిధ అంశాలపై మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సిఎం రేవంతరెడ్డి రూల్ బుక్ ప్రకారం నడుస్తోందా అని ప్రశ్నించారు. ఏ రూల్ ప్రకారం సభలో లేని సభ్యులను సస్పెండ్ చేస్తారని నిలదీశారు. స్పీకర్పై జరిగిన దాడి మీద రెస్యూకు వచ్చామని, సభలో ఉల్లంఘన జరిగినప్పుడు ప్రతిపక్ష పార్టీగా, బీజేపీఎల్పీ ఫ్లోర్ లీడర్‌గా వాస్తవాలు మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నడూ లేని విధంగా సభలో లేని వారిని ఇష్టానుసారంగా సస్పెండ్ చేయడం బాధాకరమన్నారు. చర్చకు అనేక అంశాలు ఉన్నాయని, బీఏసీలో చెప్పినట్టు 22ఎ, ఫీజు రీయింబర్స్మెంట్, కరెంట్ కోతలపై చర్చించాలని పట్టుపట్టారు. శాసనసభ నిర్వహణకు సంబంధించి అర్ధరాత్రి ఎజెండాలు వస్తున్నాయని చెప్పారు. దేనిమీద బిజినెస్ పెడుతారో తెలియడం లేదన్నారు. కరెంట్ కోతలు, రైతు సమస్యలు ఉన్నాయి. 22ఎ, ఫీజు రీయింబర్స్మెంట్పై మాట్లాడుతామని బీఏసీలో హామీ ఇచ్చారని, అయితే అవేమీ పట్టించుకోకుండా మూడు రోజులు గడిపారని అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఏసీలో మాట్లాడిన ప్రకారం సభను నడుపుతారా, లేదా అనేది చెప్పాలని పోడియం వద్ద ఆందోళన చేశారు. 22ఏపై చర్చ రేపు తీసుకుంటారా, లేదా అనేదానిపై స్పష్టత ఇచ్చేంతవరకూ నిరసన తెలియజేస్తామ్మని స్పష్టం చేశారు. నిరసనల మధ్య స్పీకర్‌ను దూషించిన సంఘటనపై చర్చ జరుగుతుండగా ప్రభుత్వ వైఖరికి నిరసనగా తమ పార్టీ సభ్యులు శాసనసభ నుండి వాకౌట్ చేస్తున్నట్లు వమహేశ్వర్‌రెడ్డి ప్రకటించి వెళ్లిపోయారు.

### వారం - వర్జ్యం

10-09-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, పుబ్బ కార్తె,
తి.చతుర్దశి ఉ.10.35
న. మఖ మ.2.07
వ.రా.9.51 - రా.11.24
దు.ఉ.10.01 - ఉ10.50
2) మ.2.57 - మ.3.46
రాహు. మ.1.30-3.00. శుభ స. లేదు.

### వార్తాఫలం

**మేషం** : సోదరులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. నూతన విద్యావకాశాలు. ఆర్థిక మార్గాలు మెరుగ్గా ఉంటాయి.

**వృషభం** : ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. సంతానం నుండి శుభవార్తలు అందుతాయి. వస్తు, వస్త్ర, కొనుగోలు.

**మిథునం** : కోపతాపాలకు దూరంగా వుండండి. సోదరుల నుండి శుభవార్తలు. ఉద్యోగులకు అనుకూల మార్పులు.

**కర్కాటకం** : వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైనా సన్నిహితుల సహాయం అందుతుంది.

**సింహం** : సంతానానికి నూతన విద్యావకాశాలు పొందుతారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**కన్య** :ఉద్యోగులకు పని ఒత్తిడులు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు. ఆహ్వానాలు.

**తుల** : బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు.

**వృశ్చికం** : గృహనిర్మాణ ఆలోచనలు ముందుకు సాగవు. దీర్ఘకాలిక ఋణాలు తీరుస్తారు. శుభవార్తలు వింటారు.

**ధనుస్సు** : ప్రముఖులతో పరిచయాలు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా వుండును. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి.

**మకరం** : మిత్రుల నుండి విలువైన సమాచారం అందుతుంది. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి. రాయబారాలు సాగిస్తారు.

**కుంభం** : వివాదాలకు దూరంగా వుండటం అన్ని విధాలా మంచిది. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**మీనం** : మిత్రులసహాయసహకారాలు అందుకుంటారు. ఉద్యోగ, వివాహ యత్నాలు అనుకూలిస్తాయి. శ్రమకు తగిన ఫలితం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రైల్వేకు కొత్త ఊపు

>>తీసుకున్నారు. 7 రైల్వే కారి డార్లలో నాలుగు లేన్ల నిర్మాణం చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.20,804 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్ట్‌లకు ఆమోదం తెలిపింది. వీటిలో ఐదు దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలోనే ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యటక కేంద్రాలకు రైలు సౌకర్యం అందుబాటులోకి రానుంది. ప్రయాణికులతో పాటు సరకు రవాణా సులభ తరం చేయడానికి ఇవి సహాయపడతాయి. వీటి ద్వారా దాదాపు కోటి మందికిపైగా ప్రయోజనం కలుగుతుంది. దాదాపు 1,196 కిలోమీటర్ల మేర విస్తరించే ఈ ప్రాజెక్టుల ద్వారా రైలు అనుసంధానం (కనెక్టివిటీ) మెరుగుపడటంతో పాటు, ప్రస్తుత మార్గాల్లో రద్దీ తగ్గి ప్రయాణికులు, సరుకుల రవాణా వేగవంతం కానుంది. ఈ ప్రాజెక్టులను 2029-30 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టులు కనెక్టివిటీని పెంచడంతో పాటు ప్రయాణాన్ని సులభతరం చేస్తాయని, సరుకులు, ప్రయాణికుల రవాణాను వేగవంతం చేస్తాయని ప్రభుత్వం తెలిపింది.

**దక్షిణాది రైల్వే నెట్‌వర్క్‌కు భారీ ప్రయోజనం**

కేంద్ర మంత్రివర్గం తీసుకున్న తాజా నిర్ణయంతో దక్షిణ భారత రైల్వే నెట్‌వర్క్‌కు భారీ ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా హౌరా- చెన్నై రైల్వే కారిడార్‌లో భాగంగా విశాఖపట్నం, విజయవాడ మీదుగా నాలుగు లేన్ల రైల్వే నెట్‌వర్క్ అభివృద్ధి చేయనున్నారు. ఈ విస్తరణతో ఈ మార్గంలో రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరగడంతో పాటు ప్రయాణికులు, సరుకు రవాణాకు మరింత సౌకర్యం కలిగే అవకాశం ఉంది. అదేవిధంగా ముంబై-చెన్నై రైల్వే కారిడార్‌లో భాగంగా గుంతకల్లు, రేణిగుంట మీదుగా నాలుగు లేన్ల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ మార్గం దేశంలోని పశ్చిమ, దక్షిణ ప్రాంతాలను అనుసంధానించే కీలక రైల్వే మార్గాల్లో ఒకటిగా ఉంది. నాలుగు లేన్ల విస్తరణ పూర్తయితే రైళ్ల వేగం, మార్గ సామర్థం, సరుకు రవాణా సామర్థం మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం అనేక ప్రధాన రైల్వే మార్గాల్లో ట్రాఫిక్ పెరుగుతున్న నేపథ్యంలో అదనపు లైన్ల నిర్మాణం ద్వారా రైళ్ల రాకపోకలకు ఎదురయ్యే సమస్యలను తగ్గించడమే కేంద్రం లక్ష్యంగా కనిపిస్తోంది. ముఖ్యంగా పారిశ్రామిక, వాణిజ్య ప్రాంతాలను ప్రధాన పోర్టులు, నగరాలతో అనుసంధానించడంలో ఈ కారిడార్లు కీలకంగా మారనున్నాయి. కేంద్ర కేబినెట్ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళ్లే కీలక రైల్వే మార్గాలకు మరింత ప్రాధాన్యం లభించనుంది. విశాఖపట్నం, విజయవాడ, గుంతకల్లు, రేణిగుంట వంటి ప్రధాన రైల్వే జంక్షన్ల మీదుగా నాలుగు లేన్ల నెట్‌వర్క్ అభివృద్ధి చెందితే భవిష్యత్‌లో పెరగనున్న ప్రయాణికుల, సరుకు రవాణా అవసరాలను తీర్చేందుకు ఇది ఉపయోగపడనుంది.

**ప్రాజెక్టుల వివరాలు**

ఈ ప్రాజెక్టులలో రూ.10,021 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో 540 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. అరక్కోణం- రేణిగుంట మూడు, నాలుగో లైన్లు (77 కి.మీ), వైట్‌ఫీల్డ్ - బంగారపేట మూడు, నాలుగో లైన్లు (47 కి.మీ), హోసూర్ - ఓమలూర్ డబ్లింగ్ (147 కి.మీ), సేలం - కరూర్ - దిండిగల్ డబ్లింగ్ (159 కి.మీ), సికింద్రాబాద్ (ఘట్‌కేసర్) - కాజీపేట మల్టీట్రాకింగ్ (110 కి.మీ). మిగిలిన రూ.10,783 కోట్ల విలువైన మూడు ప్రాజెక్టులు పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో 656 కిలోమీటర్ల మేర విస్తరిస్తాయి. ఖరగ్‌పూర్ - ఝార్సుగూడ (బాగ్దేహి) నాలుగో లైన్, కట్నీ- పెండ్రా రోడ్ నాలుగో లైన్, బిలాస్‌పూర్ (ఉస్లాపూర్) - పెండ్రా రోడ్ మూడో లైన్. దక్షిణాది రాష్ట్రాల్లోని ఐదు ప్రాజెక్టులు 17 జిల్లాల గుండా వెళ్తూ, 2,121 గ్రామాలకు రైలు సౌకర్యాన్ని కల్పిస్తాయి. దీని ద్వారా దాదాపు 52 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. తూర్పు, మధ్య భారతదేశంలోని మూడు ప్రాజెక్టులు 14 జిల్లాలను కవర్ చేస్తూ, దాదాపు 56 లక్షల జనాభా ఉన్న 4,790 గ్రామా లను అనుసంధానిస్తాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా ఏటా దాదాపు 74 మిలియన్ టన్నుల మేర సరుకుల రవాణా సామర్థం పెరుగుతుందని అంచనా. నవీకరించిన ఈ మార్గాలు బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు, కంటైనర్లు, ఆటోమొబైల్స్, ఆహార ధాన్యాలు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎరువుల రవాణాకు ఎంతగానో తోడ్పడతాయి. పిఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ కింద చేపట్టే ఈ ప్రాజెక్టుల ద్వారా తిరుపతితో పాటు తమిళనాడు, కర్ణాటకలోని పలు ప్రధాన ఆలయాలు, ముఖ్యమైన పర్యాటక, పుణ్యక్షేత్రాలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని ప్రభుత్వం తెలిపింది.

ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గ సమావేశంలో రైల్వే రంగానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. దేశంలో అధిక రద్దీ ఉన్న ఏడు కీలక రైల్వే కారిడార్లను నాలుగు లేన్లు, నాలుగు ట్రాక్‌లకు విస్తరించే ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. ముఖ్యంగా కోల్‌కతా - ఢిల్లీ, చెన్నై-కోల్‌కతా, ఢిల్లీ-ముంబై, ముంబై-చెన్నై, బిలాస్‌పూర్-కట్నీ వంటి కీలక మార్గాల్లో రైల్వే సామర్థ్యాన్ని పెంచనున్నారు. ముంబై-హౌరా హై డెన్సిటీ నెట్‌వర్క్‌లో భాగంగా ఖరగ్‌పూర్-ఝార్సుగూడ మధ్య 367 కిలోమీటర్ల నాలుగో లైన్‌కు రూ.6,528 కోట్లతో ఆమోదం తెలిపినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే అరకున్నం-రేణిగుంట మధ్య మూడో, నాలుగో లైన్ల నిర్మాణానికి కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఒక్కో లైన్ 77 కిలోమీటర్ల పొడవుతో ఉండగా, ఈ ప్రాజెక్టుకు రూ.1,936 కోట్లు ఖర్చు కానుంది. దేశంలోని సుమారు 11,000 కిలోమీటర్ల హై డెన్సిటీ రైల్వే కారిడార్లు దాదాపు 40 శాతం రైల్వే ట్రాఫిక్‌ను నిర్వహిస్తున్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. ఇప్పటికే 2,000 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, మరో5,000 కిలోమీటర్ల పనులు పురోగతిలో లేదా ఆమోదదశలో ఉన్నాయని చెప్పారు.

## అసెంబ్లీ నుంచి కెటిఆర్ సహా బిఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్

>> ప్రారంభంకాగానే డిమాండ్ చేశారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ఇచ్చిన వాయిదా తీర్మానంపై వెంటనే చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ వియ్‌వాంట్ జస్టిస్ అంటూ ఎమ్మెల్యేలు సభ జరపకుండా అడ్డుపడ్డారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బిఆర్ఎస్ సభ్యులు వెల్‌లోకి వచ్చి స్పీకర్ పోడియం చుట్టు చేరి నిరసనకు దిగారు. శాసనసభ నుంచి బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను సెషన్ మొత్తం సస్పెండ్ చేస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటన చేశారు. సభను అడ్డుకుంటున్న సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్ ఆమోదించారు. స్పీకర్ అనేక పర్యాయాలు వారించినా ససేమిరా వెనక్కి తగ్గడంతో హారీశ్‌రావు,కెటిఆర్, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్ , కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్తప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజయుడు, వివేకానంద, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, అనిల్ జాదవ్ ఉన్నారు. అనంతరం స్పీకర్ టీబ్రేక్ ఉదయం పదిముప్పై అయిదుకు ప్రకటించి సభను వాయిదావేశారు. అంతకు ముందు పోడియం వద్ద కెటిఆర్,స్పీకర్ ఇద్దరు వాదించుకొన్నారు. కెసిఆర్ ప్రాణాలకు ప్రమాదం ఉంటే రాతపూర్వకంగా ఇవ్వండి చర్చిస్తామని తెలిపారు. స్పీకర్ ముందు నిలబడి నిరసన తెలిపడం కాదు సభకు కొన్ని నియమాలు రూల్‌ఉన్నాయని నేను అనుమతి ఇస్తానని తెలిపారు. ఎర్రవెల్లి వ్యవసాయక్షేత్రంలో శుద్ధిపై వాయిదా తీర్మానం అడ్లూరి లక్ష్మన్ కుమార్ ప్రవేశపెడుతు ప్రకటన చేస్తుండగా అంతా గందరగోళం నెలకొంది. కెటిఆర్ మీ ఆర్గ్యుమెంట్‌కు నేను సమాధానం ఇవ్వను స్పీకర్ ప్రసాద్ అన్నారు. తెలంగాణ శాసనసభలో గైర్హాజరైన ఇరువురు బిఆర్ఎస్ సభ్యులను కూడాసస్పెండ్ చేయడంతో సస్పెండ్ అయిన సభ్యులు విస్మయం వ్యక్తంచేశారు. మాజీ మంత్రి మల్లారెడ్డి తిరుమల తిరుపతిలో దైవదర్శనంకు వెళ్ళి గైర్హాజరైనారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కూడా బుధవారం సభకు రాలేదు .స్పీకర్ చదివిన జాబితాలో శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ప్రతిపాదించిన సస్పెన్షన్ జాబితాలో మాత్రం వీరి పేరు ప్రకటించారు.



యుపిలోని రాయ్‌బరేలీలో బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశంలో రాహుల్

## దాడిపై సమగ్ర విచారణ

>> చెప్పారు. అసెంబ్లీ ఘటనలపై విచారణకు ఆదేశించామని పేర్కొన్నారు. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బంది పెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నామని, డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తామని స్పష్టం చేశారు. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షి ంచేలా విచారణ చేస్తామని, క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షి ంచేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీ అంటే దేశంలో కోట్లాది ప్రజలకు ఒక నమ్మకం, ఒక భరోసా అని చెప్పారు. 'కాంగ్రెస్ దూరదృష్టితో ఏ రకంగా ఈ దేశం అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుందో అర్థమవుతుంది.ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో రిజర్వేషన్లను కల్పించింది కాంగ్రెస్ పార్టీ ఇది కాంగ్రెస్ పార్టీ విధానం' అని చెప్పారు. కర్ణాటకలో ఒక చిన్న గ్రామంలో పుట్టి,రాజాకార్ల దాడులలో తండ్రిని కోల్పోయి కార్మిక నాయకుడిగా రాణించి.. జాతీయ స్థాయికి ఎదిగిన నేత మల్లికార్జున ఖర్గే, 60 ఏళ్లుగా ఒకరోజు కూడా విరామం లేకుండా ఆయన ప్రజలకోసం పనిచేస్తున్నారని చెప్పారు.ఉత్తరాఖండ్‌లో ఒక మైదానంలో జరిగిన సభలో మల్లికార్జున ఖర్గే పాల్గొంటే, ఆగస్టు 10న బీజేపీ అనుబంధ సంస్థ ఆ మైదానంలో శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టడం హేయమైన చర్య,దీన్ని ఈ సభ ముక్తకంఠంతో ఖండిస్తోంది' అని ప్రకటించారు.ఈ ఘటనపై ఖర్గే రాజ్యసభలో భావోద్వేగంతో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రధానిని కోరారు,పార్లమెంట్ సభ్యులు రాష్ట్రపతిని కలిసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు అని తెలిపారు.ఇదిలా ఉంటే, విద్యా రంగంలో అక్రమాలు, ధరణి అక్రమాలు, 22 ఏ రాద్ధాంతంపై సభలో చర్చించాలని అనుకున్నాం, కానీ ఫామ్ హౌస్‌లో కుట్ర చేసి బిఆర్ఎస్ సభ్యులను సభను అడ్డుకునేందుకు ఉసిగొల్పారు,సమస్యలపై చర్చ జరిగితే వారి పదేళ్ల దురాగతాలు, అప్పులపై ప్రజలకు అవగాహన కలుగుతుందని భయపడ్డారు.అదే జరిగితే తెలంగాణ ప్రజలు ఇక శాశ్వతంగా వారి పార్టీని బొందపెడతారని చర్చ జరగకుండా కుట్ర చేశారు అని చెప్పారు. పార్లమెంట్ పై దాడి చేసిన వాళ్లకు, ముంబై దాడులకు పాల్పడిన కసబ్‌కు, పుల్వామాలో సైనికులపై దాడిచేసిన తీవ్రవాదులకు, ఉన్మాదంతో సభాపతిని అవమానించిన వారికి పెద్ద తేడా లేదు అని విమర్శించారు. ఉన్మాదానికి లోనై ఉసిగొల్పబడిన కొంతమంది ముష్కరులు అధికారులపై దాడులు చేయడమే కాకుండా సభాపతి కుర్చీని అవమానించేలా వ్యవహరించారు, వ్యక్తినే కాకుండా తల్లిని కూడా అవమానించారు అని చెప్పారు. మనది మాతృస్వామ్య వ్యవస్థ, మహిళలను శక్తిగా కొలిచే సమాజం మనది, భారత దేశాన్ని భారత మాత అని, తెలంగాణ రాష్ట్రాన్ని తెలంగాణ తల్లిగా భావిస్తున్నాం, సభాపతిగా ఉన్న మీ మనసుకు గాయం చేయాలని ఉన్మాదంతో మాట్లాడారు, ప్రతిపక్ష నాయకుడు కెసీఆర్ సభాపతికి క్షమాపణ చెప్పి వారి సభ్యులతో క్షమాపణ చెప్పించి సభ సజావుగా జరిగేలా చూస్తారని అంతా భావించారు.కానీ అలా జరగకపోగా మరింత ఉన్మాదంతో వ్యవహరించారు' అని దుయ్యబట్టారు. అందుకే.. ఏ ఫామ్ హౌస్‌లో కుట్ర జరిగిందో ఆ ఫామ్ హౌస్ ముందు దండోరా వేయాలని ప్రజాస్వామ్యవాదులు నిరసనకు దిగారు,వాళ్లలా ఉన్మాదానికి తెగబడలేదు, కేవలం డప్పు దరువులతో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపారని చెప్పారు. దళితులు తిరిగిన నేలను శుద్ధి చేయాలని ఆదేశించి తీవ్రంగా అవమానించారు అని పేర్కొన్నారు. అసలు మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. రాతి యుగంలో ఉన్న రాక్షసుల్లా వ్యవహరిస్తారా?అని ప్రశ్నించారు. సమాజంలో అశాంతిని ప్రోత్సహించి రెండు జాతుల మధ్య వైరంగా మార్చాలని అనుకుంటున్నారు, పదేళ్లు అధికారంలో ఉండి, ధనబలంతో వ్యవస్థలను లొంగదీసుకోవాలనుకుంటున్నారు అని చెప్పారు. వాళ్లు దళితులు నడిచిన నేలను శుద్ధిచేస్తే.. వారి మనసుల్లో పేరుకున్న అంటరాని తనాన్ని ఎలా శుద్ధి చేయాలి, నీళ్లతో కడగాలా? యాసిడ్ తో కడగాలా? అని ప్రశ్నించారు. ఒకవైపు మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానమైనా, గడ్డం ప్రసాద్ కుమార్‌కు జరిగిన అవమానమైనా ఈ సమాజానికి జరిగినట్లే, ఇంకా కొంతమంది మనసుల్లో పేరుకున్న మనువాద భావాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం ఎంతటివారినైనా ప్రభుత్వం విచారణ చేపట్టి శిక్షి ంచాలని నిర్ణయించిందన్నారు. కుట్రలు పన్నినవారితో పాటు కుట్రలో భాగస్వాములైన వారిని చట్టపరిధిలో శిక్షి ంచాలని నిర్ణయించాం, సెప్టెంబర్ 6 న జరిగిన కుట్ర నుంచి జరిగిన అన్ని సంఘటనలను క్రోడీకరించి అందరిపై సంపూర్ణ విచారణ చేసి, క్రిమినల్ కేసులు పెట్టి శిక్షి ంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని ప్రకటించారు.

## కోకాపేటలో ఎకరం 120 కోట్లు

>> రంగారెడ్డి జిల్లాలోని కోకాపేట్ గ్రామ పరిధిలో ఉన్న నియోపోలిస్ లేఅవుట్, గోల్డెన్ మైల్ సైట్1లోని విలువైన ప్లాట్లకు ఈ వేలాలను నిర్వహించింది. ఈ వేలాలకు బిడ్డర్ల నుంచి విశేష స్పందన లభించింది. గోల్డెన్ మైల్ సైట్1లోని 0.70 ఎకరాల ప్లాట్ కు అత్యంత భారీ స్పందన లభించింది. ఎకరాకు రూ.70 కోట్లుగా నిర్ణయించిన ప్రతిపాదిత అప్‌సెట్ ధరకు గాను, అత్యధిక బిడ్ ధర ఎకరాకు రూ.115 కోట్లుగా నమోదైంది. హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలోని వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాల్లో ఉన్న ప్లాట్లకు కొనసాగుతున్న డిమాండ్‌కు ఇది నిదర్శనంగా నిలిచింది. నియోపోలిస్ లేఅవుట్‌లోని ప్లాట్ నంబర్ 17... 4.59 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దీనికి ఒకే ఒక్క బిడ్ దాఖలైంది. ఈ బిడ్ ధర ఎకరాకు రూ.120 కోట్లుగా నమోదైంది. ఈ రెండు ప్లాట్లు కోకాపేట్‌లో వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాల్లో ఉన్నాయి. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్), ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి,హైటెక్ సిటీ వంటి ప్రధాన ప్రాంతాలకు అద్భుతమైన రవాణా అనుసంధానం కలిగి ఉన్నాయి. హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలోని అభివృద్ధి చెందిన గ్రోత్ కారిడార్‌లో వీటి స్థానం కారణంగా రియల్ ఎస్టేట్ అభివృద్ధి మరియు పెట్టుబడులకు వీటి ఆకర్షణ మరింత పెరుగుతోంది.

## ఎథిక్స్ కమిటీకి తాతా మధు, నవీన్ వివాదం

>> మన్నారు. సభ్యుల హక్కులు, గౌరవానికి భంగం కలిగితే కాపాడాల్సిన స్పీకర్ కూడా పట్టించుకోవడంలేదని వాపోయారు. తీర్మానంపై ఓటింగ్ పెట్టాలని బిఆర్ఎస్ శ్రేణులు స్పీకర్ పోడియం ఎదుట నినాదాలు చేశారు. ఈ దశలో ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ శ్రేణులు స్పీకర్‌పై జరిగిన మాటలదాడి గురించి స్పందిస్తే బాగుంటుందన్నారు. దళితులు నిరసనచేసిన చోట సంప్రోక్షణ చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ దళితుల విషయంలో ఎవరు చులకనగా చూసినా అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కొద్ది సేపు బిఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేయగా, వెళ్లి తమ సీట్లలో కూర్చోవాలని మండలి విపక్ష నాయకుడికి మాట్లాడే అవకాశం ఇస్తామని చెప్పడంతో బిఆర్ఎస్ శ్రేణులు నిరసన ముగించారు.

దీనిపై ఎమ్మెల్సీ మధుసూధనాచారి మాట్లాడుతూ సభ్యుల హక్కులను కాపాడాల్సిన చైర్మన్ తమను పట్టించుకోవడంలేదన్నారు. మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ఇద్దరు సభ్యుల సస్పెండ్ అప్రజాస్వామికమని, మళ్లీ ఎప్పుడూ ఇలా జరగకూడదని ఆకాంక్షించారు. మంగళవారం ఉదయం ఆరు గంటలు సభ వాయిదా వాసి తరువాత ఆరు నిమిషాలు మాత్రమే జరిపి సభ్యులను సస్పెన్షన్ చేశారన్నారు. ప్రతిపక్షాలను చైర్మన్ పట్టించుకోనందుకు నిరసనగా బిఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ ఇద్దరు సభ్యుల సస్పెన్షన్ ఆమోదం సభా సాంప్రదాయం ప్రకారమే జరిగిందని తెలిపారు.

## మాట్లాడే అవకాశం కావాలంటూ కౌన్సిల్ నుంచి బిఆర్ఎస్ వాకౌట్

>> అవమానపరిచే విధంగా భావించాల్సి వస్తోందన్నారు. గత మూడు రోజులుగా అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు తీవ్ర కలవరపెడుతున్నాయని చెప్పారు. ఇటీవల కాలంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పాల్గొన్న ర్యాలీ ప్రాంగణాన్ని బిజెపి నాయకులు పసుపు నీళ్లతో శుద్ధి చేసిన ఘటన మరవకముందే, తెలంగాణ రాష్ట్రంలోనూ అదే రీతిలో జరగడం బాధాకరమన్నారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టావల్సిందిగా కోరారు. మంత్రి వాఖ్యలపై ప్రతిపక్ష నేత మధుసూదనచారి స్పందిస్తూ ఒక మనిషి బతికి ఉన్నప్పుడు ఆ వ్యక్తి ఇంటి ముందు చావు డప్పు కొట్టడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహానీయుడు, పదేళ్ల రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిపై ఇలాంటి చర్యలకు పాల్పడడం అమనూషమన్నారు. ప్రభుత్వం తన తప్పును తెలుసుకుని కెసిఆర్ పాటు యావత్ తెలంగాణ ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ శుద్దీకరణ చేయడాన్ని ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే కెసిఆర్ చావు డప్పు అనే దానిని కూడా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని సభ్యులను ఆదేశించారు.

# ట్రాన్స్‌జెండర్లు హంగామా చేస్తే అరెస్టు

## కమీషన్ తీసుకొనే వారిపైనా చర్యలు

### ముందుగా సమాచారం ఇచ్చిన వారికి రూ.5వేలు కమీషన్

### వసూళ్లలో పూజారులు, టెంట్‌హౌస్, కేటరింగ్ నిర్వాహకుల పాత్ర

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** శుభకార్యాలతో పాటు పెళ్లి వేడుకలు, ఇతరత్రా ముఖ్యమైన కార్యక్రమాల సమయంలో ట్రాన్స్‌జెండర్లు హాజరై హంగామా సృష్టించి బలవంతంగా 50వేల రూపాయల నుంచి రెండు లక్షల రూపాయల వరకు వసూలు చేస్తున్న ఉదంతంలో కొత్త కోణం వెలుగు తచూసింది. ట్రాన్స్‌జెండర్ల వసూళ్ల పర్వంలో ఆయా ప్రాంతాల పూజారులతో పాటు టెంట్ హౌస్, క్యాటరింగ్ నిర్వాహకులకు వాటా వుందని పోలీసుల విచారణలో తేలింది. ఎక్కడైనా వేడుకలు, శుభకార్యాలు జరిగితే వాటి గురించి ట్రాన్స్‌జెండర్లకు సమాచారం ఇచ్చి లొ కేషన్ పంపేది పూజారులు, టెంట్ హౌస్, క్యాటరింగ్ నిర్వాహకులేనని పోలీసులు తేల్చారు. ఇందుకుగానూ ముందుగా సమాచారం ఇచ్చిన వారికి ట్రాన్స్‌జెండర్లు మూడు వేల రూపాయల నుంచి ఐదు వేల రూపాయలు కమీషన్ ముట్టచెబుతున్నట్లు పోలీసుల విచారణలో వెలుగు చూసింది.

నగర శివార్లలోని చింతల్‌లో ఒక వ్యక్తి గృహ ప్రవేశం చేస్తున్న సమయంలో తెల్లవారుజామున ట్రాన్స్‌జెండర్లు హంగామా చేసి 50 వేల రూపాయలు ఇచ్చేవరకు వదలకపోవడం, ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్లలో కొందరు బట్టలు విప్పేసి, అశ్లీలంగా కనిపించడం దుమారం రేపడం తెలిసిందే. ఈ వ్యవహారాన్ని స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం మరింత హాల్‌చల్ అయ్యింది. దీనిపై నెటిజన్లు నేరుగా డిజిపి ఆనంద్‌ను ప్రశ్నిస్తూ ట్రాన్స్‌జెండర్లపై చర్యలు తీసుకోవాలని, వారి ఆగడాలను అరికట్టాలని కోరారు. దీనికి డిజిపి ఆనంద్ కూడా స్పందించి ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేబడతామని తెలిపారు. కాగా ట్రాన్స్‌జెండర్ల హంగామాపై సైబరాబాద్ పోలీసులు లోతుగా ఆరా తీయగా సంచలన విషయాలు వెలుగు చూశాయి. ఈ విషయంలో నిజా నిజాలను రట్టు చేసేందుకు కొందరు ట్రాన్స్‌జెండర్లను పిలిపించి విచారించగా దీని వెనుక ఆయా ప్రాంతాల పూజారులు, టెంట్ హౌస్, క్యాటరింగ్ నిర్వాహకుల పాత్ర వుందని తెలిపారు. ఎక్క డైనా శుభకార్యాలు, వేడుకలు, పెళ్లిలు జరిగితే దీని గురించి వీరికి కచ్చితంగా ముందుగానే సమాచారం వుంటుందని ట్రాన్స్‌జెండర్లు పోలీసుల కు తెలిపారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాలలో వుండే ట్రాన్స్‌జెండర్లకు వీరిలో ఎవరో ఒకరు చేరవేస్తారని పోలీసుల విచారణకు వచ్చిన ట్రా న్స్‌జెండర్లు తెలిపారు. ఎవరు ముందుగా సమాచారం చెప్పి సరైన లొకేషన్ ఇచ్చిన వారికి వసూళ్లకోసం వెళ్లే ట్రాన్స్‌జెండర్లు మూడు వేల రూ పాయల నుంచి ఐదు వేల రూపాయలు కమీషన్‌గా ముందుగానే ఇచ్చేస్తారని వారు తెలిపారు. ఇక శుభకార్యాలు, వేడుకలకు వచ్చే ట్రాన్స్‌జెండ ర్లలో అనేక గ్రూపులు వుంటాయని, కొన్నిసార్లు వారిలో వారికి పడవని పోలీసుల విచారణకు వచ్చిన ట్రాన్స్‌జెండర్లు తెలిపారు. కొన్నిసార్లు ట్రాన్స్‌జెండర్లు పరస్పరం గొడవలుపడి కొట్టుకున్న ఉదంతాలు కూడా వున్నట్లు పోలీసుల దృష్టికివచ్చింది. చాలాచోట్ల వీరు బస్తీలను పంచేసుకుని, ఒకరికి కేటాయించిన చోట వేరొకరు రాకుండా కట్టుబాట్లు నిర్ణయిస్తారని కూడా పోలీసుల విచారణలో వెలుగు చూసింది.

**ఈసారి ట్రాన్స్‌జెండర్లు వసూళ్లకోసం వస్తే కమీషన్లు పొందే వారిని కూడా అరెస్టు చేస్తాం:** ఇదిలావుండగా ఈసారి ఎక్కడైనా ట్రాన్స్‌జెండర్లు హంగామా చేస్తే వారితో పాటు కమీషన్లు పొందే పూజారులు, టెంట్ హౌస్, క్యాటరింగ్ నిర్వాహకులను అరెస్టుచేస్తామని పోలీసులు హెచ్చరించారు. ఇదే సమయంలో ట్రాన్స్‌జెండర్లు నిజాయితీతో బతకాలని ఉంటే వారికి సహాయం చేస్తామని తెలిపారు.

## ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి హైకోర్టులో ఊరట

### పొటెన్సీ టెస్ట్‌పై నాంపల్లి కోర్టు ఉత్తర్వులపై స్టే

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** సహచర మహిళాట్రైనీ అధికారిణిపై లైంగిక వేధింపులతోపాటు ఆమెపై దాడిచేసి, వ్యక్తిగత ఫోటోలను, భర్తకు ఇతరులకు పంపిన కేసులో అరెస్టయి నెలరోజులకు పైగా జైల్లోవున్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి హైకోర్టులో ఊరట దక్కింది. గత జూలై నెల 18వ తేదీన ఉదయ్ కృష్ణారెడ్డిపై జాతీయ పోలీసు అకాడమిలో శిక్షణ పొందుతున్న బాధితురాలు అత్తాపూర్ పో లీసు స్టేషన్‌లో చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు కాగా అదే నెల 29వ తేదీన అతన్ని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అప్పటి నుంచి ఉదయ్ కృష్ణారెడ్డి చంచల్‌గూడ జైల్లో వున్న ఉదయ్ కృష్ణారెడ్డి తనకు బెయిల్ మంజూరు చేయాలని దాఖలు చేసిన పిటిషన్లు డిస్మిస్ అయ్యాయి. ఇదే సమయంలో నిందితుడిని రెండుసార్లు పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలోనే ఉదయ్ కృష్ణారెడ్డి మరికొందరు అమ్మాయిలను వేధించిన ఉదంతాలు వెలుగు చూ శాయి. ఈ నేపథ్యంలో అతనికి లైంగిక పట్టుత్వ పరీక్షలు నిర్వహించేందుకు అనుమతించాలని నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా అందుకు న్యాయస్థానం అనుమతించింది. అయితే దీనిపై ఉదయ్ కృష్ణారెడ్డి హైకోర్టులో అప్పీల్ చేశాడు. ఇలాంటి పరీక్షలు జరపడం అన్యాయమని, తన వ్యక్తిత్వాన్ని హరిస్తున్నట్లు అతను పేర్కొన్నాడు. ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం ఉదయ్ కృష్ణారెడ్డికి లైంగిక పట్టుత్వం పరీక్షలు నిర్వహించేందుకు నాంపల్లి కోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టేవిధించింది. దీంతో ఉదయ్ కృష్ణారెడ్డికి ఊరట లభించినట్లయ్యింది. అయితే ఈ కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిపై వున్న ఇతర అభియోగాలపై విచారణ చేబట్టవచ్చని హైకోర్టు వెల్లడించిందని పోలీసులు తెలిపారు.

## గుజరాత్‌లో పరువు హత్య!

### బాయ్‌నఫ్రెండ్‌తో తిరుగుతోందని యువతని హత్య చేసిన తండ్రి, సోదరుడు



**అహ్మదాబాద్, సెప్టెంబరు 9:** దేశంలో మరో పరువు హత్య జరిగింది. ఒక యువతి బాయ్‌ఫ్రెండ్‌తో ఉన్న వీడియోలు వైరల్ కావడంతో పరువు పోయిందని భావించిన ఆమె తండ్రి, సోదరుడు యువతిని హత్య చేశారు. అంతేకాదు ఈ హత్యను రోడ్డు ప్రమాదంగా నమ్మించే ప్రయత్నం చేశారు. విచారణలో అన్ని వివరాలు బయటపడ్డాయి. తండ్రి, సోదరుడు చేసిన ఘా తుకానికి పోలీసులు వారిద్దరిని అరెస్టు చేశారు. ఈ ఘటన గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గత నెలలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు. అహ్మదాబాద్‌లోని సర్ఖేజ్ ప్రాంతానికి చెందిన 22 ఏళ్ల సోఫియా అనే యువతికి చెందిన ఒక వీడియో మూడు నెలల క్రితం వైరల్ అయింది. తన బాయ్ ఫ్రెండ్‌తో ఉన్న వీడియో అది. ఈ వీడియో వైరల్ కావడంతో సోఫియా తండ్రి మొహమ్మద్ ఫరూక్ నవాబ్‌ఖాన్ (56), అతడి కొడుకు, యువతి సోదరుడు హబిల్ ఫరూక్ (38) తమ కమ్యూనిటీలో పరువు పోయిందని భావించారు. ఇదే సమయంలో ఇకపై బాయ్స్‌కు దూరంగా ఉండాలని ఆ యువతిని బెదిరించారు. వారి ఆగ్రహం చల్లారలేదు. ఆ యువతిని చంపైనా సరే తమ పరువు నిలబెట్టుకోవాలని వారిద్దరూ భావించారు. ఇందుకోసం గత ఆగష్టు 12న రాత్రి ఆమెను హత్య చేసేందుకు తండ్రి ఫరూక్, సోదరుడు హబిల్ ప్రయత్నించారు. ఆ రోజు రాత్రి ఆమెను అన్న హబిల్ బైకుపై ఒక నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. ఇదే సమయంలో తండ్రి కూడా అక్కడే ఉన్నాడు. వారిద్దరూ కలిసి ఒక సుత్తితో సోఫియా తలపై కొట్టి చంపేశారు. తండ్రి, అన్న ఇద్దరూ కలిసి తీవ్రంగా దాడి చేశారు. అనంతరం ఈ కేసు తమపై రాకూడదని భావించి, ఈ ఘటనను రోడ్డు ప్రమాదంగా నమ్మించే ప్రయత్నం చేశారు. తీవ్ర గాయాలపాలైన సోఫియాను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతూ మరణించింది.

## గురుకుల పాఠశాలలో విషాదం

### ఆటలాడుతూ కుప్పకూలిన విద్యార్థి

## ఆసుపత్రికి తరలించేలోపే మృతి



**రఘునాథపాలెం,సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** రఘునాథపాలెం మండలంలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో విషాదం చోటుచేసుకుంది. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న సాత్విక్ (14) బుధవారం ఉదయం తోటి విద్యార్థులతో కలిసి ఆటలాడుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు వెంటనే పాఠశాల సిబ్బంది అతడిని ఆసుపత్రికి తరలిం చేందుకు ప్రయత్నించినప్పటికీ, ఆసుపత్రికి చేరుకునేలోపే మృతి చెందినట్లు సమాచారం. సాత్విక్‌కు ఆకస్మికంగా గుండెపోటు రావడం వల్లే మృతి సంభవించి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే మృతికి ఖచ్చితమైన కారణాలు వైద్య పరీక్షలు, అధికారిక నివేదిక అనంతరం వెల్ల డయ్యే అవకాశం ఉంది. మృతుడు తిరుమలాయపాలెం మండలం కాకర వాయి గ్రామానికి చెందిన హరీష్, ప్రియాంక దంపతుల కుమారుడు. బాలుడి ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, తోటి విద్యా ర్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఘటనపై పాఠశాల సిబ్బంది, అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

## గడీల పాలనపై గర్జించిన ధీరవనిత చాకలి ఐలమ్మ: సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** గడీల పాలనకు, దొరల అహంకారానికి వ్యతిరేకంగా పోరాడిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అణచివేత, దమనకాండకు వ్యతిరేకంగా ఆ మహనీయురాలు ఎగరేసిన ధిక్కార పతాకం తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన నివాళి తెలిపారు. దాదాపు 80 ఏళ్ల క్రితమే తెలంగాణ గడ్డపై దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటానికి జంగ్ సైరన్ మోగించారని సీఎం గుర్తు చేశారు. సమ్మక్కసారక్క, చాకలి ఐలమ్మ వంటి వీర మహిళల స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని ముఖ్యమంత్రి తెలిపారు. వారి ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరాలకు కూడా ఆదర్శమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

# ఐదు పంచాయతీలు తిరిగి భద్రాద్రిలో కలపాలి

### రామయ్య క్షేత్ర అభివృద్ధికి సరిహద్దుల సమస్యే అడ్డంకి

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి వినతులు

### దేవస్థానానికి చెందిన 900 ఎకరాల భూముల వినియోగానికి ఇబ్బందులు

### పొదెం వీరయ్య ఆధ్వర్యంలో కేంద్ర మంత్రికి వినతిపత్రం

**భద్రాచలం, సెప్టెంబరు 9ప్రభాతవార్త:** దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధితో పాటు పట్టణంలోని దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన ఐదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణ లోని భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లో కలపాలని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కోరారు. రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలం సరిహద్దులోని ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామపంచాయతీలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనమయ్యాయి. దీంతో భద్రాచలం పట్టణానికి భౌగోళిక, పరిపాలనా పరమైన సమస్యలు తలెత్తాయని నాయకులు వివరించారు. ముఖ్యంగా శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి సంబంధించిన సుమారు 900 ఎకరాల భూమి మరో రాష్ట్ర పరిధిలోకి వెళ్లడంతో వాటిని అభివృద్ధి కార్యక్రమాలకు సమర్థవంతంగా వినియోగించుకోవడం కష్టంగా మారిందన్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, భక్తులు, స్థానిక ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఐదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలోని భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. శ్రీ సీతా రామచంద్రస్వామి దర్శనం, ఎటపాకలో కుటుంబ రిసెప్షన్‌లో పాల్గొనేందుకు వచ్చిన బండి సంజయ్ కుమార్‌ను తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య బీపీఎల్ గెస్ట్‌హౌస్‌లో కలిసి వినతిపత్రం అం దజేశారు. భద్రాచలం ప్రజల దీర్ఘకాలిక సమస్యకు కేంద్ర హోంశాఖ ప్రత్యేకంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భద్రాచలం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరిమి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ముల్ల వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వాసిరెడ్డి శంభశివరావు, కొలపూడి వరుణ్, కాపుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణను పకడ్బందీగా పూర్తి చేయాలి

### ఆదిలాబాద్, నిర్మల్‌లో పర్యటించిన సిఇఒ సుదర్శన్‌రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను నిర్దేశిత గడువు లోగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, మృతులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను నిబంధనల మేరకు గుర్తించి తొలగించాలని సూచించారు. బుధవారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో సీఈవో పర్యటించారు. తాంసీ మండలం ఘోట్కూరి, భీం పూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే, దరఖాస్తుల పరిశీలన తదితర ప్రక్రియలను తనిఖీ చేశారు. బీఎల్‌ఓల వద్ద ఉన్న దరఖాస్తులు, ఓటర్ల జాబితాలను పరిశీలించిన సీఈవో, కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉంటే నిబంధనల ప్రకారం సరిచేయాలని సూచించారు. ఇంటింటి సర్వేలో ప్రతి కుటుంబంలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ధ్రువీకరించిన సమాచారం ఆధారంగానే మార్పులు, చేర్పులు చేపట్టాలని స్పష్టం చేశారు. 18సంవత్సరాలు నిండిన అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటర్లజాబితాలో ఉందో లేదో పరి శీలించుకునేలా ప్రజలకుఅవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనర్హుల పేర్లు కొనసాగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

# ఆయుష్ విద్యార్థుల స్టైపెండ్‌ను భారీగా పెంచిన ప్రభుత్వం

### అల్లోపతి వైద్య విద్యార్థులతో సమానంగా పెంపు

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** తెలంగాణలో ఆయుష్ వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. వారి స్టైఫండ్‌లను భారీగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆయుర్వేద, హోమి యో పతి, యునాని, నాచురోపతి విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైఫండ్‌లను అల్లోపతి వైద్య విద్యార్థులతో సమాన స్థాయికి పెంచుతూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో హౌస్ సర్జన్ల నెలవారీ స్టైఫండ్ రూ.13,754 నుంచి రూ. 29,792కు పెరిగింది. అదేవిధంగా, పీజీ విద్యార్థుల స్టైఫండ్ రూ.34,385 నుంచి ఏకంగా రూ. 74,482కు పెరిగింది. తమ చిరకాల డిమాండ్‌ను నెరవేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఆయుష్ విద్యార్థులు, వైద్యులు బుధవారం సచివాలయంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గత పదేళ్లలో గత ప్రభుత్వం తమ స్టైఫండ్‌లను ఒక్కసారి కూడా పెంచలేదని, దీనివల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఈ సందర్భంగా విద్యార్థులు మంత్రి దృష్టికి తెచ్చారు. తమ సమస్యను అర్థం చేసుకుని, అల్లోపతి విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఆరోగ్య మంత్రికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజ నర్సింహ విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మంచి వైద్యులుగా రాణించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రంలో ఆయుష్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని వివరిం చారు. సుమారు 700 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించామని, 138 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం చేపట్టామని తెలిపారు. సిద్దిపేట, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్‌లలో 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రులను ఏర్పాటు చేశామని, కరీంనగర్‌లో రూ. 15 కోట్లతో మరో ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు.

## వర్షాభావంతో ఎండిన పంటలు: వేర్వేరు జిల్లాల్లో ఇరువురు రైతుల ఆత్మహత్య

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** వర్షాభావ పరిస్థితులు క్రమంగా పెరుగుతూ సాగు నీరందక ఎండిపోతున్న పంటను చూసి తట్టుకోలేని రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇరువురు రైతులు చేనుల్లోనే బలన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేటకు చెందిన రైతు పనస రాములుగౌడ్(55)కు రెండెకరాల భూమి ఉండగా, దానికి అదనంగా మరో 8 ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. సుమారు రూ.2 లక్షల పెట్టుబడితో పత్తి పంట సాగుచేశారు. ప్రారంభంలో కురిసిన వర్షాలకు పత్తి విత్తనాలు విత్తగా, చేను ఓ మాదిరిగా పెరిగింది. అయితే కాత దశకు వచ్చేసరికి తీవ్ర వర్షాభావ పరిస్థితులు తలెత్తడంతో పదెకరాల పత్తి చేను వాడిపోవడం మొదలుపెట్టింది. పత్తి చేనులోకి వెళ్లిన రాములు గౌడ్ కండ్లముందే పంట ఎండిపోవడం చూసి తట్టుకోలేక, అప్పు తీర్చే మార్గంలేక అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. అలాగే హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్లకు చెందిన వెన్నపురెడ్డి లక్ష్మారెడ్డి(55) తనకున్న మూడు ఎకరాల వ్యవసాయ భూమితో పాటు, మరో మూడు ఎకరాలు తీసుకుని పంటలు సాగుచేశారు. పంటల పెట్టుబడికి రూ.6 లక్షల వరకు అప్పుచేశారు. అయితే వర్షాభావంతో పాటు పంటల దిగుబడి లేక ఆర్థికంగా నష్టపోయారు. అప్పులు ఎలా తీర్చాలని ఆవేదన చెంది తన పంట పొలాల్లో పురుగులమందు తాగి ప్రాణాలు తీసుకునే యత్నం చేశారు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

# రైతులను వేధిస్తోన్న కరెంటు కోతలు

### పురుగుల మందు డబ్బాలతో అన్నదాతల ఆందోళన

### రాష్ట్రంలోని కామారెడ్డి, నల్లగొండల్లో ధర్నా చేసిన రైతులు

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** కరెంటు కోతల కారణంగా వరి పంటలకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రైతాంగం ఆందళన చెందుతోంది. పూర్తి స్థాయిలో, నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలనే డిమాండ్‌తో పలు జిల్లాల్లో రైతులు రోడ్డెక్కుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని నారాయణ్‌పేట్, సూర్యాపేట్, ఖమ్మం, సంగారెడ్డి తదితర జిల్లాల్లో రైతులు విద్యుత్ కోతలపై తీవ్ర నిరసనలు వ్యక్తం చేయగా, తాజాగా కామారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో రాస్తారోకో తదితర ఆందోళనలు చేశారు. తాజాగా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై బుధవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. పురుగుల మందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేయడం కలకలం రేపింది. లింగంపేట మండలం నల్లమడుగు గ్రామానికి చెందిన రైతులు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఈ ఆందోళన చేపట్టారు. గత వారం రోజులుగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండటం లేదని, వరి పంటకీలక దశలో ఉన్న సమయంలో కరెంటు కోతలతో పొలాలు ఎండిపోతున్నాయని రైతులు తెలిపారు. నల్లమడుగు గ్రామంలో కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాపై ట్రాన్స్కో సిబ్బందిని ప్రశ్నిస్తే ఏం చేసుకుంటావో చేసుకో అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆరోపించారు. అలాగే తమ పంటలకు నాణ్యమైన విద్యుత్‌నిరంతరాయంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు బుధవారం రాజాపేట గాంధీ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. వ్యవసాయ బావుల వద్ద లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని, దీంతో విద్యుత్ మోటార్లు సక్రమంగా పనిచేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ విద్యుత్ సరఫరాలో అం తరాయాలు, వోల్టేజీ హెచ్చుతగ్గులు చోటుచేసు కోవడంతో మోటార్లు కాలిపోతున్నాయని తెలిపారు. మోటార్ల మరమ్మతులు, కొత్త మోటార్ల కొనుగోలుతో అదనపు ఆర్థిక భారం పడుతోందని వాపోయారు. సాగు చేసిన పంటలకు సమయానికి నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. రోజుకు 7 గంటలు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా కావడం లేదని రైతులు ఆరోపించారు. సమస్యపై సంబంధిత విద్యుత్ అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదని వాపోయారు.



# ప్రజాజీ వితంలో మోడీ@25

### 17 నుంచి నెల రోజులు సేవా సంకల్ప్ అభియాన్

### దేశపురోగతిలో కీలకపాత్ర: పార్టీ చీఫ్ నితిన్ నబీన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా బీజేపీ నెల రోజుల పాటు సేవా సంకల్ప్ అభియాన్‌నిర్వహించనుంది. ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమాలు అక్టోబర్ 17 వరకు కొనసాగనున్నాయి. న్యూఢిల్లీలో బుధవారం విలేకరుల సమావేశంలో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఈ విషయాన్ని వెల్లడించారు. 2001 అక్టోబర్ 7న నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారని, ఈ ఏడాది అక్టోబర్ 7తో ఆయన ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకుంటారని తెలిపారు. ప్రజా సేవ నుంచి దేశ సేవ దిశగా సాగిన ఈ ప్రయాణాన్ని మోడీ నిరంతరం కొనసాగిస్తున్నారని నితిన్ నబిన్ పేర్కొన్నారు. ఆయన సేవా భావంతోనే ఈ ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో దేశ పురోగతి కేవలం అభివృద్ధికే పరిమితం కాలేదని, భారతదేశ సాంస్కృతిక గుర్తింపు, వారసత్వం కూడా మరింత బలోపేతమయ్యాయని నితిన్ నబిన్ అన్నారు. మోడీ దేశ నాయకత్వ బాధ్యతలు చేపట్టిన సమయంలో భారత్ పాలసీల అస్తవ్యస్థ పరిస్థితిని ఎదుర్కొందని, ప్రపంచంలో ఫ్రాగైల్ ఫైవ్ ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా పేర్కొనబడేదని గుర్తుచేశారు. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని తెలిపారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా తొలుత రక్తదాన శిబిరాలను నిర్వహించనున్నారు. అలాగే అక్టోబర్ 7న సేవా జ్యోతి కలశ్ యాత్ర నిర్వహించనున్నట్లు నితిన్ నబిన్ తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలను అనుసంధానిస్తూ ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలిపేలా ఈ యాత్రను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 17 వరకు ప్రజల భాగస్వామ్యంతో సేవా మేరా యోగదాన్‌కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం కింద వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు నితిన్ నబిన్ వెల్లడించారు.




## పండుగల వేళ దేశీయ విమాన ఛార్జీలకు రెక్కలు

**ముంబయి, సెప్టెంబరు 9:** దుర్గాపూజ, దసరా, దీపావళి నేపథ్యంలో భారీగా పెరుగుతున్న టికెట్ ధరలుదుర్గాపూజ, దసరా, దీపావళి పండుగలు సమీపిస్తున్న వేళ దేశీయ విమాన ప్రయాణ ఛార్జీలు భారీగా పెరుగుతున్నాయి. అధిక డిమాండ్ ఉన్న పలు మార్గాల్లో వన్‌వే టికెట్ల ధరలు కొన్ని స్వల్ప దూర అంతర్జాతీయ విమానాల కంటే కూడా ఎక్కువగా ఉంటున్నాయి. సాధారణంగా రూ.6,500-7,000 మధ్య ఉండే టికెట్ ధరలు ప్రస్తుతం కొన్ని మార్గాల్లో సుమారు రూ.15,000కు చేరాయి. అంటే సాధారణ ధరతో పోలిస్తే సుమారు 115-131 శాతం వరకు పెరుగుదల నమోదైంది. సాధారణ ధరల మధ్యస్థ విలువ రూ.6,750తో పోలిస్తే పెరుగుదల దాదాపు 122 శాతంగా ఉంది. అక్టోబర్ 17న ముంబై నుంచి కోల్‌కతాకు నేరుగా వెళ్లే విమాన టికెట్ కనీస ధర ప్రస్తుతం రూ.15,568గా ఉంది. ఈ మార్గంలో సాధారణంగా టికెట్ ధర సుమారు రూ.7,000గా ఉంటుంది. బెంగళూరు-కోల్‌కతా మార్గంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ కనీస విమాన ఛార్జీ రూ.16,340కు చేరింది. దీపావళికి ఇంకా సుమారు రెండు నెలల సమయం ఉన్నప్పటికీ ఢిల్లీ-ముంబై విమాన ఛార్జీలు కూడా ఇప్పటికే పెరిగాయి. ప్రస్తుతం వన్‌వే టికెట్ ధర రూ.9,878గా ఉంది. సాధారణంగా ఈ మార్గంలో ధర సుమారు రూ.6,500 ఉంటుంది. దుర్గాపూజ, దసరా పండుగలకు ఇంకా నెల రోజుల సమయం ఉండగానే కోల్‌కతాకు నేరుగా వెళ్లే విమానాల టికెట్లు రూ.14,163 నుంచి అందుబాటులో ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో గరిష్ఠ ధర రూ.25,000 వరకు చేరుతోంది. దుర్గాపూజ సందర్భంగా అక్టోబర్ 12 నుంచి 18 మధ్య ముంబై-కోల్‌కతా వన్‌వే టికెట్ల ధరలు ఒక్కొక్కరికి రూ.12,000-14,000 వరకు ఉన్నట్లు సమాచారం. దీపావళి సమయంలో పుణే, ఢిల్లీ మార్గాల్లో వన్‌వే టికెట్ల ధరలు ఒక్కొక్కరికి సుమారు రూ.8,000 వరకు ఉండే అవకాశం ఉంది. ఆరుగురు సభ్యులున్న కుటుంబానికి రానూ-పోనూ విమాన ప్రయాణ ఖర్చు దాదాపు రూ.90,000కు చేరే అవకాశం ఉంది. విమాన ఇంధనం ఏటీఎఫ్ ధరలు కూడా విమానయాన సంస్థల నిర్వహణ వ్యయాలపై ప్రభావం చూపుతున్నాయి. ఈనెల 1న ఎటిఎఫ్ ధరలీటరుకు రూ.6.28, అంటే 5.46 శాతం పెరిగి రూ.121.28కు చేరింది. అంతకుముందు ఆగస్టులోనూ లీటరుకు రూ.5 పెరిగింది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయాల్లో ఏటీఎఫ్ వాటా సుమారు 35-40 శాతం ఉంటుంది. అదే సమయంలో దసరా, దీపావళి, దుర్గాపూజల సందర్భంగా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరుగుతుందని విమానయాన సంస్థలు అంచనా వేస్తున్నాయి. డిమాండ్ పెరిగిన కొద్దీ టికెట్ ధరలను పెంచే డైనమిక్ ప్రైసింగ్ విధానం కూడా ఛార్జీల పెరుగుదలకు కారణమవుతోంది. ముంబై-కోల్‌కతా, ఢిల్లీ-తూర్పు భారతదేశ మార్గాల్లో రైళ్లు ఇప్పటికే పూర్తిగా నిండిపోవడం లేదా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటంతో ఎక్కువ మంది ప్రయాణికులు విమానాల వైపు మళ్లుతున్నారు. జెట్ ఎయిర్‌వేస్, గో ఫస్ట్ కార్యకలాపాలు నిలిచిపోవడంతో దేశీయ విమానయాన మార్కెట్‌లో పోటీ తగ్గింది. విమాన ఛార్జీల పెరుగుదల కారణంగా కొన్ని దేశీయ విమాన ప్రయాణాలు స్వల్ప దూర అంతర్జాతీయ ప్రయాణాల కంటే ఖరీదుగా మారుతున్నాయి. భారత్-నేపాల్, భారత్-థాయ్‌లాండ్, భారత్-బంగ్లాదేశ్, భారత్-శ్రీలంక వంటి మార్గాల్లో నాన్‌పీక్ రోజుల్లో బడ్జెట్ విమానయాన సంస్థలు, ప్రమోషనల్ ఆఫర్ల ద్వారా వన్‌వే టికెట్లు రూ.5,000-9,000 మధ్య అందుబాటులో ఉండవచ్చు. దీంతో పండుగల సమయంలో కొన్ని దేశీయ విమాన టికెట్ల ధరలు సమాన దూరంలోని అంతర్జాతీయ విమానాల కంటే కూడా ఎక్కువగా ఉంటున్నాయి.

# కొండా సురేఖ మాజీ ఓఎస్‌డి సుమంత్‌కు ముందస్తు బెయిల్

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** మాజీ మంత్రి కొండా సురేఖ వద్ద ఓఎస్‌డిగా పనిచేసిన సుమంత్‌కు న్యాయస్థానంలో ఊరట లభిం చింది. కాంట్రాక్టర్ కిడ్నాప్, దాడి, బలవంతపు వసూళ్లకు సంబంధించి జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో సుమంత్‌కు బుధవా రం నాంపల్లి కోర్టులో ముందస్తు బెయిల్ లభించింది. ఈ కేసులో సుమంత్ అనుచరులు నలుగురు ఇప్పటికే అరెస్టవగా ఇతన్ని పట్టుకునేందు కు పోలీసులు నెల రోజులుగా గాలిస్తుండడం తెలిసిందే. ఈ కేసు విచారణలో నిర్లక్ష్యం వహించినందుకు ఇన్‌స్పెక్టర్ ముత్తు యాదవ్‌ను ఉన్న తాధికారులు సస్పెండ్ చేయడం విదితమే. మరోవైపు ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని సుమంత్ దాఖలు చేసిన పి టిషన్‌పై విచారించిన నాంపల్లి కోర్టు పలుమార్లు వాయిదాలు వేసింది. చివరగా బుధవారం నాడు సుమంత్‌కు ముందస్తు బెయిల్‌ను మంజూరు చేసింది. 25 వేల రూపాయలతో కూడిన రెండు ష్యూరిటీలను సమర్పించాలని, పోలీసుల విచారణకు సహకరించాలని, అనుమతి లేనిదే దేశం విడిచి వెళ్లరాదని న్యాయస్థానం ఆదేశించింది.

మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం, సిద్దిపేట
(సిద్దిపేట జిల్లా)
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

ఇ-ప్రొక్యూర్‌మెంట్ నిట్ నెం: E1/90/1/2026, E1/2156/2026, E1/801/2026, E1/2046/2026, E1/2047/2026, E1/989/2026, E1/1205/1/2026, E1/2158/2026, E1/1731/1/2026. బిడ్ దాఖలుకు ప్రారంభ తేది మరియు సమయం : 10.09.2026 ఉ.11.00గం. బిడ్ దాఖలుకు ముగింపు తేది మరియు సమయం : 19.09.2026 మ.03.00గం. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నిట్ నెం: E1/2106/1/2026, E1/2106/2026 బిడ్ దాఖలుకు ప్రారంభ తేది మరియు సమయం : 10.09.2026 ఉ.11.00గం. బిడ్ దాఖలుకు ముగింపు తేది మరియు సమయం : 15.09.2026 మ.03.00గం. మొత్తం పనుల సంఖ్య: సాధారణ నిధి-10 పనులు. MP LADS-01 పని. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.in/నందు చూడవచ్చును. ఫోన్ మరియు ఫ్యాక్స్ నం. 08457-222440, 9505507242, 9505507243 siddipetmunicipality@gmail.com, engineering.mcs@gmail.com.
సం/-. కమీషనర్, సిద్దిపేట్ మునిసిపాలిటీ.
DIPR.NO. 9619-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 09.09.2026

వార్త

రచయితతో అరగంటసేపు మాట్లాడే అవకాశం గనుక దొరికితే ఆయన రాసిన గ్రంథాన్ని చదవను.

- ఉడ్రోవిల్సన్

# వంటబట్టని ఇంటి భోజనం!

ఏం కొనేటట్టు లేదు. ఏం తినేటట్టు లేదు. అక్షరాలా నిజం. ఎవరి పుణ్యమైనా ప్రస్తుతం ఉద్యోగ ఉపాధుల సంపాదన పరిమితి పెరగలేదు. కానీ నిత్యావసరాల ధరలు పెరిగిపోయి సామాన్యునికి వేదన మిగిలింది. పప్పో, ఉప్పో కలిసి తిందామన్నా వాటి ధరలు ఊహించనంత పెరిగిపోయాయి. మార్కెట్‌లో వాటి ధరలు పెరిగినప్పుడల్లా ఆ ఇంటి ఇల్లాలు వినియోగ వస్తువుల వాడకాన్ని పొదుపు చేసే మార్గం గురించి ఆలోచిస్తుంది. కానీ బజార్‌కు వెళ్తే ఏ వస్తువునూ కొనేందుకు వినియోగదారుని జేబులో ఉన్న డబ్బులు చాలవు. సరిపడనంతగా లేవు. ప్రభుత్వమైనా, ప్రైవేట్ వారైనా ఉద్యోగులకు ఇటీవల కాలంలో ఏమాత్రం జీతాలు పెరగలేదు. దాంతో ఒక్కసారిగా మీదపడిన ధరల భారంతో సామాన్యుడు సతమతమవుతున్నాడు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో తొలుత వంటింటి గ్యాస్ మీద దెబ్బ పడింది. కొరత ఏర్పడింది. ఒక్కో గ్యాస్ సిలిండర్ ధర పెరిగింది. ఇప్పుడు ఇల్లు ఇరకటం అయికూర్చుంది. అంతకుముందే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధర బాగా పెరిగిపోయి 'బజారు భోజనం రేటు పెంచేశారు. ఇప్పుడా కమర్షియల్ గ్యాస్ ధర తగ్గినా బయట హోటళ్లలో టిఫిన్, లంచ్ తదితర అల్పాహార ధరలు తగ్గుముఖం పట్టలేదు. పైగా ఇంటికి సరఫరా చేసే గ్యాస్ సిలిండర్ల సరఫరా బుకింగ్‌లో గడువు తేదీని, మార్కెట్ పొదుపు రీత్యా గతంలో 45 రోజులకు పెంచారు. తాజాగా గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేనందున ఆ వ్యవధిని 25 రోజులకే పరిమితిని తగ్గించారు. దీనివలన కూడా ఇంటి భోజనానికి ఎలాంటిఊరట కలుగలేదు. సామాన్యుడు మార్కెట్‌కు వెళ్లి సంచి కూరగాయలు కూడా కొని తెచ్చుకోలేకపోతున్నాడు. అందుకే గత 5 నెలల్లో బయటి భోజనం నషాళానికెక్కి వండిన పదార్థాలు వంటబట్టడం లేదు. ఎక్కడి భోజనమైనా ధర పోసి సమకూర్చుకునే పరిస్థితుల్లేవు. ఈ అంశాలపై తాజాగా రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ ఆగస్టు నెల నివేదికను విడుదల చేసింది. శాకాహార భోజనం ధరలు బాగా పెరిగాయి. ప్లేటు వంద రూపాయలపైమాటే. మాంసాహారం పైన 5 శాతం ఖర్చు పెరిగింది. ఇది అతిసాధారణమైన సర్వేగా చెప్పుకోవాలి. క్షేత్రీయంగా బజార్లలోకి వెళ్లి పరకాయిస్తే అంతకన్నా ఎక్కువే ధర పలుకుతుంది. గట్టిగా సాధారణ గృహస్థుడు సకుటుంబసపరివార సమేతంగా ఏ పంచభక్ష్య పరమాన్నాలు తినే పరిస్థితి కనిపించడం లేదు. ధరాభారంతో వంట ఆ ధరువులను తగ్గించుకోవాల్సి వస్తోంది. ఉల్లిపాయలు, వంటనూనెలు, బియ్యం, ఎల్‌పిజి గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. గత యేడాదితో పోల్చిచూస్తే ఖర్చు అధికమైంది. బంగాళాదుంపలు, టమోటా ధరలు తగ్గినా వాటి ప్రభావం వంటింటి భోజనంపై పడలేదు. కూరగాయల ధరలు 5శాతానికి పెరిగాయి. క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదికను 'రోటీ రైస్ రేట్' పేరిట విడుదల చేసింది. ఇంటిభోజనం ఖరీదైతే కుటుంబ ఆరోగ్యంపై శ్రద్ధ తగ్గిపోతుందన్న విషయం తెలుసుకుని నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో కేంద్రం జోక్యం చేసుకోవాల్సిన అవసరముంది. ఆమధ్య ఖాద్యతైలాల ధరలు వంట గ్యాస్ ధరలు పెరగడం ఇతరత్రా రవాణా చార్జీలపై ప్రభావం పడి దాదాపు అన్ని ముడిసరుకుల మీద ధరల భారం పడింది. ఈసారి బియ్యం ధరలు అనూహ్యంగా పెరిగాయి. భారతదేశానికి బియ్యం వంటి ఉత్పత్తులకు ఆహార భద్రత, మిగులు ఉన్నందున బియ్యం రేట్లు తగ్గినా ఆశ్చర్యపోనక్కర్లేదనే విశ్లేషణలు ప్రసారమయ్యాయి. కానీ ఎందుకో బియ్యం రేట్లు కూడా ఆకాశానికెక్కాయి. తాజాగా చిన్న చిన్న దుకాణాలు వద్ద టీ ఉత్పత్తులు, పంచదార ధరలు పెరిగాయని అరకప్పుటీ ధర 12 రూపాయలు పెంచేసి అమ్ముతున్నారు. ధరవరలు పెరిగితే సామాన్యుడు విలవిల్లాడిపోతాడు. తాజాగా మధ్యతరగతి కుటుంబాలను ఈ భారం మోయలేనంతస్థాయికి చేరుకుంది. భారతీయ కుటుంబాలు తమ బడ్జెట్‌లో 40 శాతానికిపైగా ఆహార పదార్థాల కోసమే ఖర్చు చేస్తుంటాయి. జులై 2026లో వినియోగదారుల ద్రవ్యోల్బణం 4.5 శాతంకు చేరగా అది రిజర్వుబ్యాంకు పరిమితి 4 శాతం కన్నా ఎక్కువైంది. ఈ మధ్యనే విడుదలైన క్రిసిల్ నివేదిక ప్రకారం ఉల్లి, వంట నూనెలు, ఎల్‌పిజి గ్యాస్ ధరల పెరుగుదల కారణంగా 'సొంత ఇంటి భోజనం' కూడా భారమైంది. ఆగస్టులో ఉల్లి ధర 43శాతానికి పెరగ్గా, వంట నూనెల ధరలు 11శాతం, అల్లం ధర 50.41 శాతానికి, ఎల్‌పిజి ధర 10 శాతానికి పెరిగాయి. టమోటో ధరలు 28శాతం పడి పోయినట్లు తేలింది. టమాటో ధరలు కూడా తగ్గాయి. టమాటో రేటు కూడా పెరిగి ఉంటే సామాన్యుడి ఇంట ఆహార ఆవేదన మరీ దారుణంగా ఉండేది. ఇప్పుడు కూరగాయలే కాదు పప్పులు, గుడ్లు, మాంసం ధరలు కూడా పెరిగాయి. గల్ఫ్ దేశాల సంక్షోభం వల్ల ఎరువుల సరఫరాకు అంతరాయం ఏర్పడి ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ధరలు 7శాతం పెరిగితే వేతనాలు ఆ మేరకు పెరగలేదు. అసలు పెరగనే లేదని చెప్పాలి. మరో విషయం ఏమిటంటే పప్పు, నూనె కూరగాయలు తగ్గించి పచ్చడి మెతుకుల వైపు ఆశగా చూస్తున్నారు. రోజురోజుకు వంటగది ఖర్చు పెరుగుతోంది. నిత్యావసర కూరగాయల ధరలు ఆటుపోట్లు కారణంగా మొత్తం తాలికి అవసరమైన దినుసుల వినియోగంలో ధరల పెరుగుదల ఎక్కువ తక్కువల కారణంగానే ఇంటి భోజనం ఖర్చు కాస్త పరిమితంగానే ఉందని, లేకుంటే అసాధారణ స్థాయికి ఖర్చులు చేరిపోయి ఉండేవి. రబీ సరఫరా, ఖరీఫ్ పంటదాకా ఆలసనయం చేత రాబోయే కొద్ది కాలంలో ఉల్లిపాయల ధరలు స్థిరంగా ఉండే అవకాశం ఉంది. ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ధరల స్థిరీకరణ చర్యలు మరింత సమర్థంగా అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వంపై ఉంది.

యుద్ధకాలంలోనైనా, శాంతి సమయంలోనైనా ప్రభుత్వ ఆశయం ఒక్కటే కావాలి. పాలకుల కీర్తి కన్నా సామాన్యుల సంతోషం మిన్న.



విలియం హెన్రీ బ్యారన్

యాచన వల్ల మానవుడు అల్పుడౌతాడు. బలి చక్రవర్తిని యాచించడానికి విష్ణుమూర్తి వామనుడు కావలసి వచ్చింది.



రామకృష్ణ పరమహంస

## ప్రజావాక్కు



### రేబిస్ విషయంలో నిర్లక్ష్యం తగదు

రేబిస్ విషయంలో నిర్లక్ష్యానికి ఏమాత్రం తావులేదు. వ్యాధిలక్షణాలు కనిపించిన తర్వాత రేబిస్‌దాదాపు వంద శాతంప్రాణాంతకమైనవ్యాధి. అందువల్ల జంతువు కాటుకు గురైన వెంటనే వైద్యుల సూచన మేరకు సమర్థమైన టీకాలు, అవసరమైన చికిత్స తీసుకోవడం అత్యంత కీలకం. ఇటీవల నకిలీ రేబిస్ టీకాలు గుర్తించబడిన ఘటన వైద్య భద్రతలో ఔషధాల సరఫరా వ్యవస్థను కట్టుదిట్టంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది. నకిలీ టీకా తీసుకున్న వ్యక్తికి తాను రక్షణ పొందుతున్నాననే తప్పుడు భద్రతాభావం కలుగుతుంది. అదే ప్రాణాంతక ప్రమాదంగా మారవచ్చు. ప్రపంచ రేబిస్ భారంలో భారత దేశం వాటా సుమారు 40శాతం. దేశంలో ఏటా దాదాపు 20,000 మంది రేబిస్‌తో మరణిస్తున్నట్లు అంచనాలు సూచిస్తున్నాయి. కాబట్టి ప్రతి టీకా మోతాదు నాణ్యతపై రాజీకి అవకాశం ఉండకూడదు. తయారీదారు నుంచి వైద్య కేంద్రం వరకు ప్రతి టీకాను గుర్తించగలిగే సమగ్ర డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రతి సీసాకు ప్రత్యేక గుర్తింపు, బ్యాచ్‌సంఖ్య, గడువు తేదీ వంటి వివరాలను సులభంగా ధృవీకరించే అవకాశం ఉండాలి.

- సి.సాయిరుత్విక్, శ్రీకాకుళం

### నైతిక విలువలను నేర్పించాలి

ప్రభుత్వ, ప్రైవేటువిద్యాసంస్థలలోఎల్కేజీ, యూకేజీ నుండి డిగ్రీస్థాయి వరకు విద్యార్థులకు తెలంగాణ రాష్ట్రంలో వారంలో ఒకరోజు మధ్యాహ్నం విద్యార్థులకు నైతిక విలువల గురించి ఒక ప్రత్యేకమైన క్లాస్ బోధించాలి. విద్యార్థులకుక్రమశిక్షణ నేర్పడం చాలాఅవసరం. ఇది లేకపోవడం వలన సమాజంలో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గురువులను గౌరవించడం, పూజించడం, సీనియర్లను గౌరవించడం, జూనియర్లను ప్రేమించడం, వంటి నైతిక విలువలను విద్యార్థులకు విద్యాసంస్థలలో తప్పని సరిగా నేర్పించాలి.

- కె. శ్రీనివాస్, వరంగల్

### సాంకేతిక లోపం

మీసేవ మొబైల్ యాప్‌లోని టెంపుల్ ఆన్‌లైన్ సర్వీసెస్ విభాగంలో ఆన్‌లైన్ సేవలు ఓపెన్ కావడం లేదు. తరుచూ సాంకేతిక లోపాలు ఎదురవుతున్నాయి. ఈ ట్యాబ్ ద్వారా దేవాలయాలకు సంబంధించిన పూజా వివరాలు, సేవల సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాలి.

- పి. రాజశేఖర్, నల్గొండ జిల్లా

### రీల్స్‌కు బానిసలు కావద్దు

స్మార్ట్‌ఫోన్ చేతిలోకి వచ్చినప్పటి నుంచి ఈ మధ్య చాలా మంది రీల్స్ చేయడం, చూడటం ఒక వ్యసనంలా మార్చుకుంటున్నారు. కొద్దిసేపు వినోదం కోసం మొదలుపెట్టి గంటల తరబడి వాటిలోనే గడుపుతున్నారు. దీనివల్ల విలువైన సమయాన్ని కోల్పోవడమే కాకుండా ఆరోగ్య సమస్యలను కూడా కొని తెచ్చుకుంటున్నారు. మరికొందరు రీల్స్ మోజులో పడి ప్రమాదకరమైన పనులు చేస్తూ ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. రీల్స్ కోసం మన ప్రాణాలను, సమయాన్ని పణంగా పెట్టడం ఏమాత్రం మంచిదికాదు. స్మార్ట్‌ఫోన్‌నుసమాచారం, విజ్ఞానం, విద్య వంటి మంచి విషయాల కోసం ఉపయోగించాలి. వినోదానికి కొంత సమయం కేటాయించి, మిగిలిన సమయాన్ని మన అభివృద్ధికి ఉపయోగించాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలు ఫోన్‌లో ఏంచూస్తున్నారో, ఎంత సమయం గడుపుతున్నారో గమనిస్తూ వారికి మంచి అలవాట్లు నేర్పాలి. రీల్స్ మోజుకు దూరంగా ఉండి, అవసరానికి మాత్రమే ఉపయోగిద్దాం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### రైతుల ఆదాయం పెంచాలి

ఉపాధిహామీ రూపాంతరం చెందిన పిమ్మట కేంద్ర ప్రభుత్వం ఉపాధికి హామీ పడుతూ ఆస్తుల సృష్టి, బహుళ రకాల ఆదాయమార్గాలపైన దృష్టిపెట్టినట్టు అర్థంఅవుతున్నది. ఇవ్వాలా ఎవరు అవునన్నాకాదన్న నీటివసతి పెరిగింది. అలాగే నీటిని ఒడిసిపట్టడం పైన ప్రజలలో అవగాహనా కూడా పెరిగింది. అయితే నీటి వసతి పెరగడం మూలంగా గాలిలో తేమ పెరిగి వివిధ రకాల పండ్లమొక్కల సాగుకి వీలుఅవుతున్నది. కాబట్టి ఉపాధిహామీ ద్వారామునుగా నేరేడు మామిడి, నిమ్మ దానిమ్మ బత్తాయి వంటి మొక్కల పెంపకం పైన దృష్టి పెట్టాలి అంత మాత్రమేకాదు దీనివల్ల స్థిరమైన ఆదాయం సాధ్యం అవుతుంది. ఏపథకం సాఫల్యత ఆ పథకం అందించే ఆదాయం పైన ఆధారపడి ఉంటుంది. ఆకోణంలో చూసినప్పుడుఉపాధి హామీ రైతుల ఆదాయం సృష్టికి గొప్ప ఆదెరువు కాగలదు.

- భారత అవినాష్, జనగామ

### పత్రాలలో వివరాలు సరిగ్గా ఉండాలి

మన సామాజిక జీవితంలో ఏదైనా దరఖాస్తు చేయాలన్నా తగిన గుర్తింపుకార్డు ఇవ్వాలన్నా మనదగ్గర ఉన్నవివిధ ప్రభుత్వంచే గుర్తింపబడిన పత్రాల వివరాలు సరిగ్గా ఉండాలి. లేదంటే ఎక్కడైనా అవసరంవస్తే తిరస్కరించే అవకాశాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ముందుగానే వివరాలు తెలుసుకుని సక్రమంగా ఉంచుకుంటే భవిష్యత్‌లో ఇబ్బందులుండవు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా


# బిసి రిజర్వేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వాలదే అధికారం!

*తెలుగు దేశంపార్టీ అంటే బిసిల పార్టీ అనే ప్రచారంలోకి వచ్చింది. స్థానికసంస్థల పదవుల బిసిల రిజర్వేషన్ విషయంలో ప్రభుత్వం మారినప్పుడల్లా విధానాలు మారకుండా వుండటానికి వీలుగా శాశ్వతంగా 34 శాతం రిజర్వేషన్ల అమలు చేయడానికి, ఈ విషయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోకుండా రాజ్యాంగంలో 9వ షెడ్యూల్లో పొందుపర్చాల్సిన అవసరం వుంది. తమిళనాడు రాష్ట్రంలో 69 శాతం బిసి రిజర్వేషన్ అమలు చేయడానికి ఇదే విధానాన్ని అవలంభించింది. అందువల్ల బీసీల పార్టీగా గుర్తింపు పొందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో తిరుగులేని మెజారిటీ (4/3 పై చిలుకు) వుండటమే కాకుండా కేంద్రంలో కూడా భాగస్వామ్యం కలిగి ఉన్నందున శాశ్వతంగా 34 శాతం రిజర్వేషన్ అమలయ్యే విధంగా ఈ మేరకు కృషిచేస్తే బిసిల హృదయాలలో తెలుగు దేశం పార్టీ చిరస్థాయిగా నిలిచిపోతుంది అనడంలో అతిశయోక్తి కాదు.*



అన్నవరపు బ్రహ్మయ్య

రాష్ట్రంలోని తెలుగుదేశం ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో పట్టణ ప్రాంతాలలో 33.3 శాతం, గ్రామీణ ప్రాంతాలలో 34 శాతం వంతున బిసిలకు రిజర్వేషన్ కల్పించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో దాఖలు చేసిన పిటీషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ పిటీషన్ దాఖలు అభినందనీయం. కౌంటర్ పిటీషన్ దాఖలు చేయడం ద్వారా తెలుగు దేశం ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లను ఏదో మొక్కుబడిగా కాకుండా ప్రకటించిన రిజర్వేషన్ల శాతాన్ని అమలు చేయడానికి కట్టుబడి వున్నట్టు స్పష్టమవుతోంది. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో తొలిగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ నిర్వహించిన స్థానిక ఎన్నికల్లో కూడా బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలు నిర్వహించింది. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే సమయంలో కోర్టు ఉత్తర్వులంటూ బిసిలకు 24 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలు చేసింది. నిజానికి ఆనాడే 34 శాతం రిజర్వేషన్లపై కోర్టులో కౌంటరు దాఖలు చేయాలని బిసి సంఘాలు కోరినప్పటికీ నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. దాంతో గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 24 శాతానికి పరిమితమై ఎన్నికలు నిర్వహించగా బిసిలు 10 శాతం మేరకు రాజకీయ అవకాశాలను కోల్పోయారు. ప్రస్తుతం అధికారంలోవున్న తెలుగుదేశం ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే మరల బిసి 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించింది. మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టుగానే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయితే సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం రిజర్వేషన్లు 50శాతం మించకూడదనే విషయాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 34 శాతం ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టు ఒక ప్రజా ప్రయోజన పిటీషన్ దాఖలైంది. రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తున్నట్టుగా రాష్ట్ర పరిధిలో స్థానిక అవసరాలను బట్టి రిజర్వేషన్లు అమలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు వుంది. దేశవ్యాప్తంగా బిసిలు 52 శాతం వున్నట్టుగా మండల కమీషన్ ప్రకటించడంతోపాటు ఇటీవల బీహార్, తెలంగాణ వంటి వివిధ రాష్ట్రాలలో నిర్వహించిన బిసి జనాభా గణన నేపథ్యంలో బిసిలు 50 నుంచి 56 శాతం వున్నట్టు నివేదికలు వచ్చాయి. ఈ స్థితిలో బిసి జనాభా నిష్పత్తి ప్రకారం కాకపోయినా కనీసం 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం సమంజసమే అవుతుంది. మండల కమీషన్ నివేదిక అమల్లోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న 27 శాతం రిజర్వేషన్లు విద్య, ఉద్యోగ అవకాశాలకు మాత్రమే పరిమితమై ఉండేకానీ, రాజకీయ పదవులకు సంబంధించినది కాదు. అంతేకాకుండా రాజ్యాంగ పరంగా స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి బిసి రిజర్వేషన్ల అమలు బాధ్యత రాష్ట్రాల పరిధిలోనే వుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 330, 332ల ప్రకారం చట్టసభలలో ఎస్సి, ఎస్టీలకు రిజర్వేషన్




ఏర్పడింది. ఇదే సమయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4), 16(4), 243డి/243టిల ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసే అధికారం రాష్ట్రప్రభుత్వాలకు దఖలు చేశారు. స్థానిక అవసరాలను బట్టి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు బిసిలకు రిజర్వేషన్లు అమలు చేసే అధికారం వుంది. ఆ నేపథ్యంలోనే కేంద్రప్రభుత్వ అమలుతో సంబంధం లేకుండా 1986లో ఎన్.టి. రామారావు, 1995లో చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల పదవులలో రిజర్వేషన్లు అమలు చేశారు. అయితే దక్షిణాది రాష్ట్రాలలో స్వాతంత్ర్యం లభించిన నాటి నుంచి కూడా బీసీలకు ఎంతో కొంత శాతంతో రిజర్వేషన్లు అమలు అవుతూనే వున్నాయి. కానీ ఉత్తరప్రదేశ్‌తో సహా అనేక ఉత్తరాది రాష్ట్రాలలో (బీహార్ మినహా) 1975 వరకు ఎటువంటి రిజర్వేషన్లు అమలు కాలేదు. స్థానిక సంస్థల పదవులలో బిసి రిజర్వేషన్ల చరిత్రక విషయానికి వస్తే తెలుగుదేశంపార్టీ ఆవిర్భావానికి ముందు వరకు స్థానిక సంస్థల పదవులలో బిసిలకు ఎటువంటి రిజర్వేన్లు లేవు. నాటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు తొలిగా 1986వ సంవత్సరంలో స్థానిక సంస్థలలో బిసిలకు 20 శాతం రిజర్వేషన్లను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత 1995వ సంవత్సరం నుంచి స్థానిక సంస్థల పదవులలో రిజర్వేషన్‌ను 20 నుంచి 34 శాతానికి పెంచారు. దాంతో గ్రామ, తాలూకా, జిల్లా, స్థాయిలో బిసిలలో రాజకీయ చైతన్యం ప్రారంభమైంది. అంతేకాకుండా తెలుగుదేశం పార్టీ ప్రారంభానికి ముందు వరకు రాజకీయం అంటే అగ్రకులాలవారికే పరిమితంగా వుండేది. గ్రామాలలో భూస్వాములు, ఉన్నత కులాలకు చెందినవారు మాత్రమే సర్పంచులు, మండల/సమితి అధ్యక్షులుగా, జిల్లా పరిషత్ అధ్యక్షులుగా వుండేవారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల పుణ్యమా అని బీసీలు సమితి/మండల అధ్యక్షులు, జిల్లాపరిషత్ అధ్యక్షులుగా ఎన్నికావడం ప్రారంభమయ్యాయి. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోవున్న 295 అసెంబ్లీ స్థానాలలో కనీసం 10శాతం స్థానాలు కూడా బిసిలకు దక్కేవి కావు. నాటి ఆంధ్రప్రదేశ్‌లో వున్న 26 జిల్లాలో జిల్లాకి ఒకరిద్దరు బిసిలకు శాసనసభ స్థానాలు లభించడం గగనంగా వుండేది. గౌతు లచ్చన్న, ప్రగడ జోటయ్య, బాలా గౌడ్, కొండ లక్ష్మణ బాపూజీ, పెదసింగు లక్ష్మణ రావు వంటి నేతలు మాత్రమే కనిపించేవారు. ఇక లోక్‌సభ స్థానాల విషయానికి వస్తే రాష్ట్రంలో వున్న 42 స్థానాలలో అడపాదడప బాలాగౌడ్, గౌతు లచ్చన్నలు కనిపించడం మినహా బిసిలెవ్వరూ వుండేవారు కాదు. ఆనాడు రాజకీయ చైతన్యానికి మారుపేరుగా వుండే కృష్ణాజిల్లాలో వున్న 17 అసెంబ్లీ స్థానాలలో బిసిలకు కేవలం ఒకస్థానం (బందరు నుంచి పెదశంగు లక్షణరావు)లో గెలుపొందేవారు. అటువంటి స్థితిలో ఎన్.టి.రామారావు బిసి నాయకులకు పార్టీ సీట్లు కేటాయించడం ద్వారా నూతన ఒరవడి సృష్టించారు. ప్రస్తుతం కృష్ణాజిల్లా నుంచి రెండు లేక మూడు స్థానాలలో బిసి అభ్యర్థులు శాసన సభ్యులుగా విజయం సాధిస్తున్నారు. నిన్న నేడు తెలుగురాష్ట్రాలో రాజకీయాలలో కీలకంగా కనిపిస్తున్న కె.వి. కృష్ణమూర్తి, దేవేంద్రగౌడ్, శ్రీనివాస యాదవ్, అచ్చెం నాయుడు వంటి నాయకులు తెలుగుదేశంపార్టీ ప్రోత్సాహంతో ఉన్నత స్థాయికి చేరుకొన్నారు. ఈ కారణంగానే తెలుగు దేశంపార్టీ అంటే బిసిల పార్టీ అనే ప్రచారంలోకి వచ్చింది. స్థానికసంస్థల పదవుల బిసిల రిజర్వేషన్ విషయంలో ప్రభుత్వం మారినప్పుడల్లా విధానాలు మారకుండా వుండటానికి వీలుగా శాశ్వతంగా 34శాతం రిజర్వేషన్ల అమలు చేయడా నికి, ఈ విషయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోకుండా రాజ్యాంగంలో 9వ షెడ్యూల్లో పొందుపర్చాల్సిన అవసరం వుంది. తమిళనాడు రాష్ట్రంలో 69 శాతం బిసి రిజర్వేషన్ అమలు చేయడానికి ఇదే విధానాన్ని అవలంభించింది. అందువల్ల బీసీల పార్టీగా గుర్తింపు పొందిన తెలుగుదేశంపార్టీ రాష్ట్రంలో తిరుగులేని మెజారిటీ(4/3 పై చిలుకు) వుండటమే కాకుండా కేంద్రంలో కూడా భాగస్వామ్యం కలిగి ఉన్నందున శాశ్వతంగా 34 శాతం రిజర్వేషన్ అమలయ్యే విధంగా ఈ మేరకు కృషిచేస్తే బిసిల హృదయాలలోతెలుగు దేశం పార్టీ చిరస్థాయిగా నిలిచిపోతుంది అనడంలో అతిశయోక్తి కాదు. •

# విద్యాప్రగతికి నాణ్యమైన గురువులే మూలం

సి. హెచ్. ప్రతాప్


దేశంలో ఉన్నత విద్య విస్తరిస్తోంది. కొత్త విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, కొత్త కోర్సులు, పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య ఇవన్నీ విద్యా విస్తరణకు సంకేతాలే. కానీ తరగతి గదిలో బోధించే అధ్యాపకులు లేకపోతే ఈ విస్తరణ ఎంతవరకు ప్రయోజనకరం? విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న వేగానికి అనుగుణంగా అధ్యాపక నియామకాలు జరగకపోవడం ఉన్నత విద్య నాణ్యతకు మోన ముప్పుగా మారుతోంది. విశ్వవిద్యాలయానికి భవనాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు అవసరమే. అయితే వాటికి ప్రాణం పోసేది నాణ్యమైన అధ్యాపక బృందమే. దేశంలోని 23 ఐఐటీల్లో 12,498 మంజూరైన బోధనా పోస్టులకు గాను 4,804 ఖాళీగా ఉన్నట్లు 2026 జనవరి 30 నాటి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే 38.4 శాతం పోస్టులు భర్తీ కాలేదు. ఐఐటీ పట్నాలో 54.6 శాతం, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 51.3శాతం పోస్టులు ఖాళీగా ఉండగా, మరో 12 ఐఐటీల్లో మూడో వంతుకు పైగా ఖాళీలున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్నతవిద్యలో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఎఐఎస్‌హెచ్‌ఇ గణాంకాల ప్రకారం 2014-15లో 3.42 కోట్లుగా ఉన్న ఉన్నతవిద్యలో విద్యార్థుల నమోదు 2022-23 నాటికి 4.46కోట్లకు చేరింది. విద్యార్థుల సంఖ్య ఈ స్థాయిలో పెరుగుతున్నప్పుడు వారికి తగిన అధ్యాపక బలం కూడా ఉండాలి. లేకుంటే విస్తరించిన తరగతి గదులు తగ్గినబోధనానాణ్యత అనే విరుద్ధ పరిస్థితి ఏర్పడుతుంది. అధ్యాపకుల కొరత ప్రభావం ఒక్క తరగతి గదితో ఆగదు. అందుబాటులో ఉన్న సిబ్బందిపై అదనపు బోధనా భారం పడుతుంది. విద్యార్థుల సందేహ నివృత్తి, వ్యక్తిగత మార్గదర్శకత్వం, ప్రాజెక్టుల పర్యవేక్షణకు సమయం తగ్గుతుంది. ప్రయోగశాల బోధన, పరిశోధన, పీహెచ్‌డీ విద్యార్థుల పర్యవేక్షణ కూడా దెబ్బతినవచ్చు. అధ్యాపకుల సంఖ్య తక్కువగా ఉంటే విశ్వవిద్యాలయం జ్ఞానాన్ని సృష్టించే కేంద్రం నుంచి కేవలం పాఠ్యాంశాలను పూర్తి చేసే సంస్థగా మారే ప్రమాదం ఉంది. ఈ విషయంలో ప్రైవేటు విద్యాసంస్థల నుంచి నేర్చుకోవాల్సిన అంశాలున్నాయి. విద్యార్థులను ఆకర్షించడంలో పరస్పర పోటీ పెరగడంతో పలు ప్రైవేటు సంస్థలు అనుభవజ్ఞులైన అధ్యాపకులను నియమించేందుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాయి. మెరుగైన వేతనాలు, పరిశోధనా అవకాశాలు, పరిశ్రమ అనుసంధానం, ఆధునిక బోధనా విధానాలు, ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రతిభను నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నాయి. విద్యార్థులుకూడా ఇప్పుడు సంస్థ భవనాల కంటే అక్కడి అధ్యాపకుల నాణ్యత, పరిశోధన, బోధనా ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఐఐటీల్లో ఖాళీలకు ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులకు ఉన్న డిమాండ్, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు, బహుళజాతి పరిశోధనా సంస్థలు, డీప్‌టెక్ కంపెనీలతో పోటీ, కఠినమైన ఎంపిక ప్రమాణాలు కారణమవుతున్నాయని ఆయా సంస్థలు చెబుతున్నాయి. కాబట్టి ఖాళీలను భర్తీ చేయడం కోసం ప్రమాణాలను తగ్గించడం పరిష్కారం కాదు. ప్రతిభావంతులైన అధ్యాపకులను ఆకర్షించే, నిలుపుకునే విద్యావాతావరణం కల్పించడమేఅసలుమార్గం. రాష్ట్ర విశ్వవిద్యాలయాల పరిస్థితిపైనా ప్రత్యేక దృష్టి అవసరం. దేశంలోని ఉన్నత విద్యార్థుల్లో అత్యధికులు రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, కళాశాలల ద్వారానే ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. అక్కడ అధ్యాపక ఖాళీలు దీర్ఘకాలం కొనసాగితే దాని ప్రభావం లక్షలాది మంది విద్యార్థులపై పడుతుంది. అందువల్ల ఖాళీలను ఎప్పటికప్పుడుగుర్తించి, కాలపరిమితితో కూడిన నియామక ప్రక్రియను అమలు చేయాలి. నియామకాలు వేగంగా జరగాలి. అయితే వేగంతో పాటు మెరిట్, పారదర్శకత, అనుభవం, పరిశోధనా సామర్థ్యం కూడా కీలకం. అధ్యాపక నియామకం ఒక ఉద్యోగ భర్తీప్రక్రియ కాదు. దేశ భవిష్యత్తుకు మేధో పునాది నిర్మించే కార్యక్రమం. విద్యార్థుల సంఖ్య పెరగడం విద్యా విస్తరణ, వారికి నాణ్యమైన గురువులు అందడం విద్యాప్రగతి. భారత ఉన్నత విద్య రెండో అడుగును మరచిపోకూడదు. •

# వినియోగదారునిపై బ్యాంకు చార్జీల భారం!



ప్రొఫెసర్ చెన్నప్ప దాసరి

దేశ ఆర్థిక వ్యవస్థకు బ్యాంకింగ్ రంగం వెన్నెముక. ప్రజల పొదుపులను సమీకరించి ఉత్పాదక రంగాలకు మూలధనంగా మళ్లించడం, నగదు లావాదేవీలను సురక్షితంగా నిర్వహించడం, పెట్టుబడులకు ఊతమివ్వడం, ప్రభుత్వ సంక్షేమపథకాల అమలులో భాగస్వామ్యం కావడం వంటి అనేక కీలక బాధ్యతలను బ్యాంకులు నిర్వహిస్తున్నాయి. ఒకప్పుడు బ్యాంకు సేవలు ప్రధానంగా నగరాలకే పరిమితమైతే, నేడు గ్రామీణ ప్రాంతాల వరకు వీటి సేవలు విస్తరించాయి. దేశంలో ప్రతీ పదిమందిలో సగటున 8 మంది బ్యాంకింగ్ సేవలు పొందుతున్నవారే. సాంకేతిక పరిజ్ఞానం విస్తరించిన తర్వాత బ్యాంకింగ్ సేవలు తప్పని సరిగా, మరింత వేగవంతంగా మారాయి. డిజిటల్ సాంకేతికతతో బ్యాంకింగ్ సేవలు మొబైల్ ఫోన్లోకి వచ్చాయి. అయితే ఈ సౌలభ్యాల వెనుక వినియోగదారులపై రోజురోజుకూ పెరుగుతున్న వివిధ రకాల రుసుములు (చార్జీలు) తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఇటీవల రాజ్యసభలో ప్రవేశ పెట్టిన బ్యాంకు చార్జీల గణాంకాలు చూసి దేశంలో సగటు మనిషి ఒకింత అసహనానికి గురిఅయ్యారు. ప్రజల డబ్బును భద్రపరచే బ్యాంకులే అదే ప్రజలపై అనవసరపు చార్జీల భారం మోపడం సమంజసమేనా అనే ప్రశ్న నేడు మరింత బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం బ్యాంకులు వివిధ పేర్లతో వినియోగదారుల నుంచి చార్జీలు వసూలు చేస్తున్నాయి. కనీస నిల్వ నిర్వహించలేదని జరిమానా, నిర్ణీత పరిమితికి మించి ఏటీఎం లావాదేవీలకు చార్జీలు, డెబిట్‌కార్డుల వార్షిక రుసుములు, చెక్బుక్ ఫీజులు, ఎస్ఎంఎస్ అలర్ట్ చార్జీలు, నగదు జమ లేదా ఉపసంహరణ పరిమితిని దాటితే అదనపు రుసుములు, ఖాతా నిర్వహణ చార్జీలు ఇలా వివిధ రకాల చార్జీలతో బ్యాంకులు ఖాతాదారుడి జేబుకు కన్నం వేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో వెల్లడించిన తాజా వివరాల ప్రకారం, గత 4 ఆర్థిక సంవత్సరాలలో దేశంలోని బ్యాంకులు వినియోగదారుని బ్యాంకు ఖాతాల్లో కనీస నిల్వ (మినిమం బ్యాలెన్స్) ఉంచనందుకు పెనాల్టీ ద్వారా సుమారు రూ. 26,190 కోట్లు వసూలు చేశాయి. కేవలం ఒక్క 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే బ్యాంకులు సుమారు రూ.7,086 కోట్లు వరకు పెనాల్టీలను వినియోగదారుల నుండి వసూలు చేశాయి. ఇందులో మొత్తం 19 ప్రైవేట్ బ్యాంకులు తమ ఖాతాదారుల నుండి రూ. 4,948.71 కోట్లు వసూలు చేయగా దేశంలోని 12ప్రభుత్వ బ్యాంకులు 2,137.92 కోట్లవరకు వసూలు చేసాయి. వీటిలో కొన్ని బ్యాంకులు కేవలం కరెంటు ఖాతాలమీద పెనాల్టీలు వసూలు చేస్తే. మరికొన్ని సేవింగ్ కరెంటు ఖాతాలమీద కలిపి పెనాల్టీలు వసూలు చేశాయి. ఇక ప్రైవేట్ రంగబ్యాంకులలో అత్యధికంగా ఒక ప్రముఖ బ్యాంకు 1,798.14 కోట్లు వసూలు చేయగా మరో బ్యాంకు 1,081.33 కోట్లు వసూలు చేసింది.




మొత్తం 19 ప్రైవేట్ బ్యాంకులు వసూలు చేసిన పెనాల్టీలలో కేవలం ఈ రెండు బ్యాంకులు వసూలు చేసిన పెనాల్టీలు విలువ సుమారు 58 శాతం. 2022-2026 ఆర్థిక సవత్సరం వరకుఅంటే మొత్తం నాలుగు ఆర్థిక సంవత్సరాలలో 'కనీస సగటు బ్యాంకు బాలెన్స్' నిర్వహించని కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు కస్టమర్స్‌నుండి వసూలు చేసిన పెనాల్టీలు సుమారు 10,230.75 కోట్లు. ఇక ప్రైవేట్‌రంగ బ్యాంకులు గత నాలుగేళ్లలో సుమారు15,939 కోట్ల పెనాల్టీలు వసూలు చేశాయి. అయితే, బేసిక్ సేవింగ్ ఖాతాలు, ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన ఖాతాలకు కనీస సగటు బాలన్స్ నిల్వవర్తించదు. ఈ ఖాతాల ద్వారా లావాదేవీలు ఆంక్షలతో కూడుకుని ఉండటం చేత, ప్రజలు ఇతర సేవింగ్ అకౌంట్‌ను ఓపెన్ చేస్తున్నారు. బ్యాంకులు కూడా కనీస నిల్వ ఉండే అకౌంట్స్ మాత్రమే కస్టమర్స్ ఓపెన్ చేసేలా వ్యవహరిస్తున్నాయి. అలాగే, ఎస్ఎంఎస్ చార్జీల రూపంలో బ్యాంకులు వేలకోట్ల రూపాయలు వినియోగదారుల నుండి వసూలు చేస్తున్నాయి. గత మూడు ఆర్థిక సంవత్సరాలలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సుమారు 1188.14 కోట్ల రూపాయలు ఎస్ఎంఎస్‌ల రూపంలో వసూలుచేసింది. ఈ విషయం ప్రభుత్వానికి ఆర్‌బిఐకి తెలియనిదికాదు కానీ బ్యాంకులపై ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. టెక్నాలజీ వలన బ్యాంకులు డిజిటల్ సేవలు అందిస్తున్నాయి. దీనివలన బ్యాంకులకు 'మాన్ పవర్' ఉపయోగం తగ్గింది. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం బ్యాంకుల నిర్వహణ వ్యయం భారీగా తగ్గింది. ఒక వైపు బ్యాంకులకు రావద్దు. ఆన్లైన్ సేవలు వినియోగించుకోండి అని చెప్పే బ్యాంకులు, ఆయా ఆన్లైన్ సేవల పై కూడా అనవసరపు చార్జీలు వసూలు చేయడం విడ్డురంగా ఉంది. ఇక ఏ.టి.ఎం లావాదేవీలపై కూడా బ్యాంకులు అనవసరపు చార్జీలు వసూలు చేస్తున్నాయి. మొదట బ్యాంకుని బట్టి ఎ.టి.ఎం రూల్స్ ఉండగా, ఇప్పుడు కార్డుని బట్టి ఎ.టి.ఎం రూల్స్ ఉంటున్నాయి. ఫైనాన్సియల్ నాన్ ఫైనాన్సియల్ ఏ.టి.ఎం వ్యవహారాలపై ఆంక్షలు పెట్టి పరిమితి దాటిన వారినుండి చార్జీలు వసూలు చేస్తున్నాయి. వినియోగదారులు ఎటిఎంల వినియోగ పరిమితి దాటితే సుమారు 23రూపాయల పైననే ప్రతీ వ్యవహారానికి ఛార్జ్ చేస్తున్నాయి. మొదట్లో ఏటిఎంల ద్వారా ఎటుంటి చార్జీలు ఉండవని తెలిపిన బ్యాంకులు రాను రాను ఏటీఎం వ్యవహారాలపై చార్జీలు విధించాయి. ఈ ఏ.టి.ఎం చార్జీల వలెనే ప్రజలు యూ.పి.ఏ ప్రెమెంట్స్‌ను ఉపయోగిస్తున్నారు. ఇటీవల కాలంలో యూపిఏ ప్రెమెంట్స్ దేశంలో విపరీతంగా పెరిగాయి. అందుకే బ్యాంకులు యూపిఏ వ్యవహారాల మీద కూడా చార్జీలు వసూలు వసూలు చేయాలని భావిస్తున్నాయి. ఇటీవల యూపీఐ లావాదేవీలపై 'మర్చంట్ డిస్కౌంట్ రేట్'ను విధిస్తూ రూపొందించిన యూపీఐ ట్రాన్సాక్షన్ చార్జీల బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంతో దేశ ప్రజలు ఆందోళనకు గురి అయ్యారు. ఎంత మేరకు ఎండీఆర్ చార్జీలు విధిస్తారన్న దానిపై ఇప్పుడే స్పష్టత లేకపోయినప్పటికీ, రూ.2 వేలకు మించిన లావాదేవీలపై 0.3శాతం నుంచి 0.5 శాతం వరకు ఎండీఆర్ను విధించే అవకాశం ఉన్నది. అయితే ఈచార్జీల భారం వ్యాపారులపైనే ఉండనున్నట్టు ప్రభుత్వవర్గాలు చెప్తున్నప్పటికీ, అంతిమంగా కొనుగోలుదారుల పైనే భారం పడిపోతుంది. సేవలను వినియోగించినందుకు తగిన రుసుము వసూలు చేయడాన్ని ఎవరూ వ్యతిరేకించరు. కానీ ప్రతి చిన్న సేవకూ వేర్వేరు పేర్లతో రుసుములు విధించడం ప్రజలకు ఆర్థిక భారంగా మారుతోంది. వినియోగ దారులపై అధిక చార్జీల భారం తగ్గించినప్పుడే బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల నమ్మకం మరింత బలపడుతుంది. అదే ఆర్థికసమ్మిళిత అభివృద్ధికి, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిజమైన పునాది అవుతుంది. •

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# వేడెక్కిన 'మ్యాప్' వివాదం

## యుఎన్ రూపొందించిన మ్యాప్‌పై భారత్ తీవ్ర అభ్యంతరం

## తక్షణమే మార్పులు చేయాలంటూ అల్టిమేటం

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 9:** ఐక్యరాజ్యసమితి (ఐరాస) విడుదల చేసిన కొత్త ప్రపంచ మ్యాప్‌పై తీవ్ర వివాదం చెలరేగింది. ఈ మ్యాప్‌లో భారత భూభాగాలైన అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్‌లను భారత్, చైనాల మధ్య ఉన్న ప్రత్యేక ప్రాంతాలుగా చూపడంపై భారత ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశాన్ని ఐరాసలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, దీనిపై ఆందోళన వ్యక్తం చేశామని స్పష్టం చేసింది. జులై 1న ఐరాస ఈ కొత్త మ్యాప్‌ను తొలిసారిగా ప్రచురించింది. సెప్టెంబరు 4న సర్వసభ్య సమావేశంలో ఒక తీర్మానంపై చర్చ సందర్భంగా కూడా దీనిని ఉపయోగించారు. ఈ మ్యాప్‌లో అరుణాచల్ ప్రదేశ్‌ను అసోం, చైనాలకు మధ్య ఉన్న ఒక స్వతంత్ర ప్రాంతంగా చూపారు. నాగాలాండ్‌తో ఉన్న సరిహద్దును కూడా ఇందులో గుర్తించలేదు. అదేవిధంగా అక్సాయ్ చిన్‌ను కూడా ఒక ప్రత్యేక భూభాగంగా చిత్రీకరించారు. దీనికి పశ్చిమాన భారత్, తూర్పున చైనా ఉన్నట్లుగా చూపారు. ఈ విధంగా సరిహద్దులను వక్రీకరించి చూపడంపై ఐక్యరాజ్యసమితి ఇప్పటివరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ఈ వివాదంపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పందించారు. మ్యాప్‌లోని ఈ వైరుధ్యాలను తాము గుర్తించామని, సంబంధిత అధికారులతో ఈ విషయాన్ని ప్రస్తావించామని తెలిపారు. ఆఫ్రికన్ యూనియన్ మద్దతుతో ప్రవేశపెట్టిన కరెక్ట్ ది మ్యాప్ అనే తీర్మానానికి భారత్ మద్దతుగా ఓటు వేసిన మాట వాస్తవమేనని, అయితే ఆ మద్దతు కేవలం ఒక సూత్రానికి మాత్రమే పరిమితమని ఆయన స్పష్టం చేశారు.

"ప్రపంచ పటంలో ఖండాల పరిమాణాన్ని సరిగ్గా, వాస్తవిక నిష్పత్తిలో చూపించే ఈక్వల్ ఏరియా ప్రొజెక్షన్ అనే సూత్రానికి మాత్రమే మా మద్దతు. సంప్రదాయ మెర్కేటర్ మ్యాప్‌లలో ధ్రువాలకు దగ్గరగా ఉన్న ప్రాంతాలు వాస్తవం కంటే పెద్దవిగా కనిపిస్తాయి. ఈ వక్రీకరణను సరిదిద్దాలనేదే తీర్మానం ఉద్దేశం. అంతేకానీ, ఐరాస ప్రచురించిన ఈ ప్రత్యేక మ్యాప్‌ను మేము ఆమోదించడం లేదు" అని జైస్వాల్ వివరించారు. జమ్మూకశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు (అక్సాయ్‌చిన్ సహా), అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం మొత్తం భారత్‌లో విడదీయరాని అంతర్భాగాలని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కొత్త మ్యాప్‌లో జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖను చుక్కల గీతతో చూపిస్తూ, దీనిపై ఇరు పక్షాల మధ్య తుది ఒప్పందం కుదరలేదని ఒక ఫుట్‌నోట్ కూడా జోడించడం గమనార్హం.



## సింగపూర్ ప్రధానికి ప్రపంచంలోనే అత్యధిక వేతనం

### వార్షిక వేతనం రూ.27 కోట్లు అని వెల్లడి

**సింగపూర్‌సిటీ, సెప్టెంబరు 9:** ప్రపంచంలోని వివిధ దేశాల ప్రధానుల వేతనాలను పరిశీలిస్తే వారి మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. వారిలో సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ వేతనం అత్యధికంగా ఉంది. రాజకీయ నేతల వేతనాలను పెంచుతున్నట్లు ఆయన మంగళవారం పార్లమెంటులో ప్రకటించారు. దాంతో ఇప్పటికే ప్రపంచంలోనే అత్యధికంగా ఉన్న సింగపూర్ రాజకీయ నేతల జీతాలు మరో 60 శాతానికిపైగా పెరగనున్నాయి. ప్రస్తుతం ప్రధాని వార్షిక బెంచ్‌మార్క్ వేతనం 2.2 మిలియన్ సింగపూర్ డాలర్లు. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.16.5 కోట్లు. తాజా పెంపుతో ఈ మొత్తం 3.6 మిలియన్ సింగపూర్ డాలర్లకు చేరుతుంది. అంటే సుమారు రూ.27 కోట్లు. మొత్తంగా జీతం దాదాపు రూ.10.5 కోట్లు పెరగనుంది. డిప్యూటీ ప్రధాని వేతనం 1.87 మిలియన్ సింగపూర్ డాలర్లనుంచి 3.06 మిలియన్ డాలర్లకు పెరుగుతుంది. అంటే ప్రస్తుతం సుమారు రూ.14 కోట్లుగా ఉన్న జీతం రూ.23 కోట్లకు చేరనుంది. క్యాబినెట్ మంత్రులకు 1.80 మిలియన్ నుంచి 2.88 మిలియన్ సింగపూర్ డాలర్ల వరకు చెల్లిస్తారు. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.13.5 కోట్ల నుంచి రూ.21.6 కోట్ల వరకు ఉంటుంది. తనకు పెరిగే మొత్తాన్ని పదవీకాలంలో వివిధ కార్యక్రమాలకు విరాళంగా ఇస్తానని వాంగ్ తెలిపారు. రాజకీయ నేతల జీతాల పెంపు ప్రజల్లో భావోద్వేగపూరిత అంశమని ఆయన అన్నారు. సామాన్యుల ఆదాయంతో పోలిస్తే ఈజీతాలు చాలా ఎక్కువగా ఉండటంతో ప్రజలు వాటిని నిశితంగా పరిశీలించడం సహజమేనని చెప్పారు. మంచి పాలనకు సమర్థ నాయకత్వం అవసరమని వాంగ్ తెలిపారు.

భవిష్యత్తులో దేశాన్ని ముందుకు తీసు కెళ్లేందుకు నాణ్యమైన నాయకత్వాన్ని కొనసాగించడమే లక్ష్యమని వివరించారు. వేతనాల పెంపు స్వతంత్ర కమిటీ సిఫార్సుల మేరకు జరి గింది. అయితే కొత్త వేతనాలను ప్రస్తుత పదవుల్లో ఉన్నవారికి వెంటనే వర్తింపజేయరు. అక్టోబరు 15 నుంచి వ్యక్తిగత పరిస్థితులు, పనితీరును బట్టి గరిష్ఠంగా 9 శాతం వరకు ఒకేసారి సర్దుబాటు చేస్తారు.



## మానవాళికి ప్రాణాంతకంగా మారే ఎఐ

### ఎఐ పరిశోధకుడు జాకబ్ కాక్సన్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:** ఎఐ ప్రపంచంలో పనిచేస్తున్న 27 ఏళ్ల పరిశోధకుడు జాకబ్ కాక్సన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంత్రోపిక్‌లో మూడేళ్ల పనిచేసిన తర్వాత ఆయన రాజీనామా చేశారు. అనంతరం సోషల్‌మీడియా వేదికగా ఎఐ భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎఐ సంస్థలు ప్రమాదాలను గుర్తిస్తున్నా పోటీలో వెనుకబడి పోతామనే భయంతో ముందుకు వెళ్తున్నాయని ఆరోపించారు. కాక్సన్ గతంలో ఓపెన్‌ఎఐ, ఆంత్రోపిక్‌లో ప్రీట్రైనింగ్ పరిశోధనలు చేశారు. ఏఐ రంగంలో పనిచేస్తున్న పలువురు నిపుణులు ఈ సాంకేతికత ఈ దశాబ్దం ముగిసేలోపే మానవాళికి ప్రాణాంతకంగా మారొచ్చని నిజంగానే నమ్ముతున్నారని చెప్పారు. ఈ విషయం బయట మాట్లాడేటప్పుడు మాత్రం కొందరు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలో మనుషుల కంటే ఎంతో శక్తిమంతమైన ఎఐ వ్యవస్థలు రావచ్చని కాక్సన్ హెచ్చరించారు. అవి సైబర్ దాడులు చేయగలవని, ఎన్నో రంగాలను ఒక్కసారిగా మార్చగలవని అన్నారు. వాస్తవ ప్రపంచంలో ప్రభావం పెంచుకునే స్థాయికి చేరవచ్చని తెలిపారు. ఆంత్రోపిక్ అలైన్‌మెంట్ సైన్స్ లీడ్ ఇవాన్ హ్యూబింగర్ కూడా కాక్సన్ వ్యాఖ్యలను సమర్థించారు. భవిష్యత్తులో ఎఐ మానవాళిని అంతం చేసే అవకాశం ఉందని తాము నిజంగానే భావిస్తున్నామని చెప్పారు. వచ్చే పదేళ్లలో ఆ ప్రమాదం 10 శాతానికి మించి ఉంటుందని తన వ్యక్తిగత అంచనా అని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఎఐ మోడళ్లతో ప్రమాదం తక్కువేనని హ్యూబింగర్ స్పష్టం చేశారు. అయితే ఎఐ తనసామర్థ్యాలను తానే పెంచుకునే స్థాయికిచేరితే పరిస్థితి చాలా ప్రమాదకరంగా మారొచ్చని హెచ్చరించారు. సూపర్ ఇంటెలిజెన్స్ కోసం అలైన్‌మెంట్ సమస్యకు పరిష్కారం చూపే స్పష్టమైన ప్రణాళిక తమ వద్ద ఇంకా లేదని అంగీకరించారు. ఎఐ సంస్థలు ప్రపంచవ్యాప్తంగా పోటీకి దిగే పరిస్థితిని అడ్డుకోవడం కష్టమని కాక్సన్ అన్నారు. అవసరమైతే ఎఐ మోడళ్ల సామర్థ్యాలను పెంచే పనిపై తాత్కాలిక నిషేధం విధించాల్సి రావచ్చని సూచించారు

## వందేమాతరం పూర్తి గేయాలాపనను గౌరవించిన ఫరూక్, ఒమర్ అబ్దుల్లా



### తీవ్ర అభ్యంతరం చెప్పిన కాంగ్రెస్

**శ్రీనగర్, సెప్టెంబరు 9:** శ్రీనగర్‌లోని షేర్‌ఎకశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన జమ్మూకశ్మీర్ తొలి అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో వందేమాతరం పూర్తి గేయం ఆలపించడం, ఆ సమయంలో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లాలు గౌరవ సూచకంగా పూర్తి సమయం నిలబడటం పొత్తు రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ రెండూ ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్నప్పటికీ, ఈ వ్యవహారంలో కాంగ్రెస్ తన మిత్రపక్ష వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ అంశంపై కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ స్వాతంత్ర్య సమరయోధుల ఆలోచనలు, 1937 నాటి కాంగ్రెస్ తీర్మానం ప్రకారం వందేమాతరం మొదటి రెండు చరణాలను మాత్రమే పాడాలని సూచించారు. జాతీయ గేయాన్ని పూర్తిగా ఆలపించడం భారత్ లౌకిక, సమగ్ర భావనకు విఘాతం కలిగిస్తుందని ఆయన అన్నారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మహనీయుల నిర్ణయాలను గౌరవించి, మొదటి రెండు చరణాలకే కట్టుబడి ఉండాలని, ఈ పాటను కోరి రాజకీయం చేయకుండా లౌకికత్వాన్ని కాపాడాలని కాంగ్రెస్ తమ భాగస్వామ్య పక్షాలను కోరింది.

మరోవైపు, కెసి వేణుగోపాల్ ట్వీట్‌పై నేషనల్ కాన్ఫరెన్స్ అదే స్థాయిలో ప్రతిస్పందించింది. ఇండియా కూటమి భాగస్వామిగా, ఎప్పుడు పాడాలి లేదా ఎంత పాడాలి అనే విషయాలపై మీరు షరతులు విధించలేరు. ట్వీట్ చేసే హక్కు వేణుగోపాల్‌కు ఉంది. కానీ ఆయన దేనినీ బలవంతంగా రుద్దలేరు. ఇది ప్రజల నిర్ణయం. ప్రజలపై దేనినీ రుద్దడాన్ని మేము వ్యతిరేకిస్తాము. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన నూతన మార్గదర్శకాలకు అనుగుణంగానే ఒమర్ అబ్దుల్లా, ఫరూక్ అబ్దుల్లాలు మూడు నిమిషాల పాటు సాగిన పూర్తి గేయాలాపన ముగిసే వరకు నిలబడి గౌరవించారని ఎన్సీ నేత బషీర్ అహ్మద్ తెలిపారు.

## 'భారతరత్న'కే ఓటరు జాబితాలో పేరు గల్లంతు!

**బెంగళూరు, సెప్టెంబరు 9:** భారతదేశానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న గ్రహీత ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్. రావు పేరు ఓటర్ జాబితాలో తప్పుగా నమోదు కావడం చర్చనీయాంశంగా మారింది. కర్ణాటకలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా ఆయన పేరులో అక్షర వ్యత్యాసం గుర్తించారు. దీంతో తన గుర్తింపును నిర్ధారించేందుకు విచారణకు హాజరు కావాలని ఆయనకు నోటీసు జారీ చేశారు. 2002 నాటి ఓటర్ జాబితాలో సి.ఎన్.ఆర్. రావు పేరు "Prof C N R Rao"గా నమోదైంది. అయితే ప్రస్తుత ఓటర్ జాబితాలో ఆయన పేరు ప్రొఫెసర్ అన్న పదంలో డబుల్ ఎఫ్ ఉంది. అంటే పేరులో అదనంగా ఒక ఎఫ్ చేరింది. ఈ చిన్న అక్షర వ్యత్యాసమే సర్ ప్రక్రియలో అధికారుల దృష్టికి వచ్చింది. రావుకు నోటీసు పంపినట్లు సమాచారం.

సెల్ఫ్ నేమ్ మిస్‌మ్యాచ్ అంటే ఏమిట ఎన్యూమరేషన్ ఫారమ్‌లో ఓటరు 2002 ఓటర్ జాబితాలో ఉన్న తన వివరాలను ఉపయోగించినప్పుడు, ఆ వివరాలు ప్రస్తుత ఓటర్ జాబితాలో ఉన్న వివరాలతో సరిపోలకపోతే దాన్నిమిస్‌మాచ్‌గా పరిగణిస్తారు. పేరు, స్పెల్లింగ్ వంటి వివరాల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉన్నప్పటికీ అవి అధికారిక పరిశీలనకు కారణమవుతున్నాయి. ఇలాంటి కేసుల్లో నోటీసు అందుకున్న వ్యక్తి మాత్రమే విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. అందువల్ల ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్. రావు బెంగళూరులోని మల్లేశ్వరం ప్రాంతంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సమీపంలోని నిర్దేశిత ప్రదేశంలో వ్యక్తిగతంగా హాజరు కావాలని సూచించారు. బెంగళూరులో జన్మించిన 92 ఏళ్ల సి.ఎన్.ఆర్. రావు భారత శాస్త్రరంగంలో విశేష సేవలు అందించారు. మెటీరియల్స్ సైన్స్, కెమిస్ట్రీ తదితర రంగాల్లో ఆయన చేసిన పరిశోధనలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. ఆయనకు 2014లో భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న లభించింది. ఈ గౌరవాన్ని అందుకున్న శాస్త్రవేత్తల్లో ఆయన మూడో వ్యక్తిగా గుర్తింపు పొందారు. సాధారణంగా ఓటర్ జాబితాలో పేరు లేదా ఇతర వివరాల్లో చిన్నపాటి వ్యత్యాసాలు ఉన్నప్పుడు వాటిని సరిచేసుకునే అవకాశం ఉంటుంది. అయితే సర్ ప్రక్రియలో భాగంగా వివరాలను ధ్రువీకరించేందుకు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్. రావు వంటి దేశంలోని ప్రముఖ శాస్త్రవేత్త పేరు కేవలం ఒక అక్షరం తేడాతో ఓటర్ జాబితాలో భిన్నంగా నమోదై, దాని కారణంగా నోటీసు రావడం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

## విద్యార్థులకు నోటీసులు ఇస్తారా?

### నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌పై సుప్రీం ఆగ్రహం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:** నిరసనలో పాల్గొన్న ఓ న్యాయ విద్యార్థికి నోటీసులు జారీ చేయడంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. విద్యార్థులపై చర్యలు తీసుకోవద్దని సెప్టెంబరు 1న దేశవ్యాప్తంగా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా న్యాయ విద్యార్థికి గ్రేటర్ నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసులు ఇవ్వడాన్ని తప్పుపట్టింది. ఆ నోటీసులను తర్వాత ఉపసంహరించుకున్నప్పటికీ ఈ వ్యవహారం చాలా తీవ్రమైనదని సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పాల్గొన్నందుకు విద్యార్థికి ఈ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఈ విషయం బుధవారం సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనం దృష్టికి వచ్చింది. మేజిస్ట్రేట్ నోటీసులు ఇచ్చే ధైర్యం ఎలా చేశారు ఏ విద్యార్థిపైనా బలవంతపు చర్యలు తీసుకోవద్దని మేం స్పష్టంగాచెప్పాం. ఆ ఆదేశాలను ఏ మేజిస్ట్రేట్ ఉల్లంఘించకూడదని సిజెఐ వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో విద్యార్థి కార్యకర్త ఆకృతి చౌధరిపై జాతీయ భద్రతా చట్టం ప్రయోగించిన విషయంలో అలహాబాద్ హైకోర్టు కూడా యుపి అధికారులను తీవ్రంగా మందలించింది.

అధికారుల చర్యల వల్ల ఉత్తరప్రదేశ్ ఆర్వెలియన్ డిస్టోపియాగా మారే పరిస్థితి వస్తుందని హెచ్చరించింది. అధికారులు తమ విధేయత రాజ్యాంగం పట్ల ఉండాలి తప్ప రాజకీయ నేతల పట్ల కాదని స్పష్టం చేసింది. నోయిడా డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ మేధా రూపమ్ ఆమోదించిన ఆకృతి చౌధరి ఎన్‌ఎస్‌ఏ నిర్బంధాన్ని సెప్టెంబర్ 2న హైకోర్టు కొట్టివేసింది. ఆమెకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. నిరసనకు సంబంధించిన కేసుల్లో తగిన ఆధారాలు లేకుండానే కఠినమైన ఎన్‌ఎస్‌ఏను ప్రయోగించడంపై గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా యంత్రాంగం, పోలీసులపై ధర్మాసనం మండిపడింది.

## అమెరికా మానవరహిత సబ్‌మెరైన్ ఇరాన్ స్వాధీనం

**టెహ్రాన్, సెప్టెంబరు 9:** ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. హర్మూజ్ జలసంధి వద్ద అమెరికా నిఘా కోసం ఉపయోగిస్తున్న మానవరహిత సబ్‌మెరైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఇరాన్ నేవీ ప్రకటించింది. అత్యంత ఆధునిక సాంకేతికతతో రూపొందించిన జలాంతర్గామిని క్లిష్టమైన నిఘా ఆపరేషన్‌లో చేజిక్కించుకున్నట్లు వెల్లడించింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ అధికారిక మీడియా సంస్థ సెపాహ్ న్యూస్ విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపింది. స్వాధీనం చేసకున్న వాహనం డైవ్‌ఎల్‌డీ అని పేర్కొంది. ఇది నీటి అడుగున పనిచేసే అత్యాధునిక మానవరహిత జలాంతర్గామి అని తెలిపింది.ఇదే సమయంలో హర్మూజ్ జలసంధిపై అమెరికాకు చెందిన ఎంక్యూ9 రీపర్ డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఇరాన్ పేర్కొంది. అయితే ఇరాన్ ప్రకటనపై అమెరికా స్పందించింది. నీటి అడుగున పనిచేసే తమ డ్రోన్ ఒకటి పనిచేయడం ఆగిపోయిందని అమెరికా సైన్యం తెలిపింది. ప్రాంతీయ జలాలను పరిశీలించే సమయంలో ఈ సమస్య తలెత్తిందని పెంటగాన్ ప్రతినిధి చెప్పారు. అయితే ఇరాన్ స్వాధీనం చేసుకున్నది అదేనా కాదా అన్న విషయాన్ని మాత్రం అమెరికా స్పష్టం చేయలేదు. అది పాత మోడల్ అని, ఎలాంటి కీలక సమాచారం సేకరించలేదని, రహస్య సోనార్ లేదా రాడార్ పరికరాలు లేవని పేర్కొంది. డైవ్‌ఎల్‌డీ ఒక్కసారి స్థావరానికి తిరిగి రాకుండా 10 రోజుల వరకు పనిచేయగలదు. దాదాపు 6,000 మీటర్ల లోతు వరకు వెళ్లగలదు. ఒక్కో వాహనం ధర సుమారు రూ.21 కోట్లుగా ఉన్నట్లు అమెరికా రక్షణ రంగ మీడియా వెల్లడించింది.

## మసూద్ అఫ్ఘానిస్థాన్‌లో ఉన్నాడని పాక్.. లేనేలేడని అఫ్ఘాన్

### మసూద్ అజహార్‌పై పాక్ పన్నాగం

**కాబూల్, సెప్టెంబరు 9:** మసూద్ అజార్ కరుడుగట్టిన ఉగ్రవాది. నిషేధిత ఉగ్రవాదసంస్థ జైషే మహమ్మద్ వ్యవస్థాపకుడు. ఇండియాలో జరిగిన అనేక కీలక ఉగ్రదాడులకు ప్రధాన సూత్రధారి. ప్రస్తుతం మసూద్ అజార్ ఎక్కడ ఉన్నాడు అనే అంశంపై స్పష్టత లేదు. అతడు పాకిస్తాన్‌లోనే తలదాచుకున్నాడు అని ఇండియా సహా అనేక దేశాలు ఆరోపిస్తుంటే.. పాకిస్తాన్ మాత్రం తమ దేశంలోలేడని, ఆఫ్ఘనిస్థాన్‌లో ఉన్నాడని చెబుతోంది. మసూద్ అజార్ ఆఫ్ఘనిస్థాన్ వెళ్లిపోయాడని పాకిస్తాన్ కొన్నేళ్లుగా ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలపై ఆఫ్ఘనిస్తాన్ స్పందించింది. అతడు తమ దేశంలోనే లేడని వెల్లడించింది. ఈ అంశంపై ఆఫ్ఘన్ విదేశాంగ శాఖ స్పందిస్తూ మసూద్ తమ దేశంలో లేడని స్పష్టం చేసింది. ఇతర దేశాల మీద దాడికి, వ్యతిరేక కుట్రలకు తమ భూభాగాన్ని వినియోగించబోమని వెల్లడించింది. ఇండియాలో 2001లో పార్లమెంట్‌పై జరిగిన దాడికి, 2008 ముంబై దాడులకు, 2016లో పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌పై జరిగిన దాడికి, 2019లో జరిగిన పుల్వామా దాడికి పాల్పడింది జైషే మహ్మద్ సంస్థే. ఈ సంస్థను నడిపించి, ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి, మన దేశం మీదకు ఉసిగొల్పింది మసూద్ అజారే. అందువల్లే అతడిని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి 2019లో అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. అలాంటి మసూద్ అజార్‌కు ఆశ్రయమిచ్చినందుకు పాకిస్తాన్‌ను ఫైనాన్సియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్‌ఎటిఎ) నిషేధిత జాబితాలో చేర్చింది. అంటే, యూరప్ సహా అనేక దేశాలు అందించే ఆర్థిక సహాయాన్ని తీవ్రవాదులకు వినియోగిస్తే.. ఎఫ్‌ఎటిఎ ఆయా దేశాలను నిషేధిత జాబితాలో చేరుస్తుంది.

అలా, పాకిస్తాన్‌ను ఈజాబితాలో చేర్చారు. ఇలా చేయకూడదనుకుంటే మసూద్ అజార్‌ను అరెస్ట్ చేయాలి. 2019 నుంచి అతడు తమ దేశం వదిలి ఆఫ్ఘన్ వెళ్లిపోయాడని పాక్ చెబుతోంది. 2022లో తాలిబన్లు ఆఫ్ఘన్‌లో అధికారం చేపట్టిన తర్వాత కూడా మసూద్ అజార్ తమ దేశంలో లేడని వెల్లడించారు. రెండు దేశాలు అతడు తమ దేశంలో లేడని చెబుతుంటూ అతడు ఎక్కడ ఉన్నాడు అనే విషయంలో స్పష్టత లేదు.

## దుబాయ్ ఎయిర్‌పోర్టులో క్లిక్ ట్రావెల్




**దుబాయి, సెప్టెంబరు 9:** దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికుల అనుభవాన్ని పూర్తిగా మార్చేసే ఒక విప్లవాత్మక సేవను ప్రారంభించింది. రద్దీ సమయాల్లో, అత్యవసర పరిస్థితుల్లో ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు క్లిక్ ట్రావెల్ పేరుతో ఒక సరికొత్త మొబైల్ సర్వీస్‌ను అందుబాటులోకి తెచ్చింది. దుబాయ్ జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ ఐడెంటిటీ అండ్ ఫారినర్స్ అఫైర్స్ ఈ సేవను రూపొందించింది. ఈ విధానంలో ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ కౌంటర్ల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు. పాస్‌పోర్ట్ కంట్రోల్ అధికారులే నేరుగా ప్రయాణికులు ఉన్న చోటికి వచ్చి ఎంట్రీ లేదా డిపార్చర్ ప్రక్రియలను పూర్తి చేస్తారు. ఈ సేవ కోసం ఇమ్మిగ్రేషన్ అధికారులు ప్రత్యేక మొబైల్ పరికరాలను ఉపయోగిస్తారు. ఈ పరికరాలు జిడిఆర్‌ఎఫ్‌ఎ సెంట్రల్ సిస్టమ్స్, డేటాబేస్‌లకు అనుసంధానమై ఉంటాయి. దీని ద్వారా అధికారులు ప్రయాణికుల సమాచారాన్ని వెంటనే యాక్సెస్ చేయగలరు. బయోమెట్రిక్ వెరిఫికేషన్ టెక్నాలజీ సహాయంతో ప్రయాణికుడి గుర్తింపును నిర్ధారించి, ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు.

## నాలుగు పార్టీలతో టివికె కూటమి

### సెక్యులర్ సోషల్‌జస్టిస్ విక్టరీ అలయన్స్‌గా ప్రకటించిన సిఎం విజయ్

**చెన్నై, సెప్టెంబరు 9:** తమిళనాడు ముఖ్యమంత్రి, టివికె అధినేత సి. జోసెఫ్ విజయ్ తమ పార్టీతో కాంగ్రెస్, వీసీకే, ఎండీఎంకే, ఐయూఎంఎల్ కలిసి ఏర్పాటు చేస్తున్న రాజకీయ కూటమికి అధికారికంగా " సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్ " అనే పేరును ఖరారు చేశారు. బుధవారం చెన్నైలోని పనయూర్‌లో ఉన్న టివికె పార్టీ ప్రధాన కార్యాలయంలో కూటమి నేతల సమావేశం అనంతరం ఈ నిర్ణయం వెలువడింది.రాజకీయ కూటమిని అధికారికంగా ఏర్పాటు చేయడం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించడం కోసం ఈ సమావేశాన్ని నిర్వహించారు. కూటమికి పేరు పెట్టడంతో పాటు ఉమ్మడి కనీస కార్యక్రమం రూపకల్పనపై కూడా నేతలు చర్చించారు.ఈ సమావేశానికి కాంగ్రెస్ తరఫున మాణికం ఠాగూర్, తారగై కుత్బర్ట్, ప్రవీణ్ చక్రవర్తి; వీసీకే నుంచి తోల్ తిరుమావళవన్, వన్ని అరసు, రవి కుమార్, చింతనై సెల్వన్; ఎండీఎంకే నుంచి వైకో, దురై వైకో; ఐయూఎంఎల్ నుంచి కేఎం కాదర్ మొయిదీన్, షాజహాన్ హాజరయ్యారు. సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేత మాణికం ఠాగూర్ మాట్లాడుతూ కూటమికి చైర్‌పర్సన్‌గా సిఎం విజయ్ వ్యవహరిస్తారని తెలిపారు. రాబోయే ఉప ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులనుకూడా కూటమి తరఫునే ప్రకటిస్తామని వెల్లడించారు. జూలై 1న విజయ్‌తో మిత్రపక్షాల నేతలు జరిపిన తొలి సంప్రదింపుల అనంతరం ఇది రెండో కీలక సమావేశం. తొలి సమావేశంలో అధికారిక రాజకీయ కూటమి ఏర్పాటు, సమన్వయ వ్యవస్థ, ఉమ్మడి కనీసకార్యక్రమంపై చర్చ జరిగినప్పటికీ కూటమి పేరును అప్పట్లో ప్రకటించలేదు.తాజాగా టీవీకే కూటమి ఏర్పాటును అధికారికంగా ఖరారు చేసే దిశగా చర్యలు చేపట్టింది. బుధవారం జరిగిన సమావేశానికి ముందు పార్టీ మంత్రులు మిత్రపక్షాలు, ఇతర పార్టీల నేతలతో సంప్రదింపులు జరిపారు. వీసీకే అధినేత తిరుమావళవన్, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైకో సమావేశానికి హాజరవుతున్నట్లు ముందుగానే ధృవీకరించారు.అయితే సిపిఐ, సిపిఎం మాత్రం కూటమిలో చేరకుండా టివికె ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇస్తామని స్పష్టం చేశాయి.

## సంక్షిప్త వార్తలు

### ఢిల్లీ మాజీ చీఫ్ సెక్రటరీ రాకేశ్ మెహతా ఆత్మహత్య

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:** ఢిల్లీ మాజీ చీఫ్ సెక్రటరీ, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రాకేశ్ మెహతా (74) తీవ్ర విషాదకర రీతిలో ప్రాణాలు తీసుకున్నారు. నోయిడా సెక్టార్82 లోని కేంద్రీయ విహార్2 సొసైటీలో ఉన్న తన ఫ్లాట్‌లో ఆయన ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతదేహం వద్ద లభ్యమైన సూసైడ్ నోట్‌లో తాను గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, మానసిక ఆందోళనల కారణంగానే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారని పోలీసులు వెల్లడించారు. రాకేశ్ మెహతా 1975 బ్యాచ్‌కి చెందిన ఐఎఎస్ అధికారి.

### ఇరాన్ ట్యాంకర్లపై అమెరికా దాడులు..



**టెహ్రాన్, సెప్టెంబరు 9:** ఇరానీ ట్యాంకర్లపై అమెరికా దళాలు అటాక్ చేశాయి. సుమారు అయిదు ట్యాంకర్లను పేల్చినట్లు తెలుస్తోంది. గత రెండు రోజుల నుంచి అమెరికా యుద్ధనౌకను ఇరాన్ టార్గెట్ చేస్తున్న నేపథ్యంలో అగ్రరాజ్యం ప్రతీకార దాడులకు దిగినట్లు సెంట్రల్ కమాండ్ పేర్కొన్నది. గల్ఫ్ ఆఫ్ ఓమన్‌లో ఉన్న ఐఆర్జీసీకి చెందిన నాలుగు ఇరానీ ఆయిల్ ట్యాంకర్లను టార్గెట్ చేసింది అమెరికా. ఖర్గ్ దీవి దగ్గర మరో ట్యాంకర్‌ను కూడా పేల్చేశారు. అమెరికా తాజా దాడులకు కౌంటర్‌గా ఇరాన్ కూడా ప్రతిదాడులు చేసింది.

### టిబెట్‌లో మళ్లీ స్వల్ప భూకంపం

**లాసా, సెప్టెంబరు 9:** టిబెట్‌లో బుధవారం భారీ భూకంపం సంభవించింది. దీని ప్రభావంతో పొరుగు దేశమైన నేపాల్‌లోనూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.3గా నమోదైనట్లు యూరోపియన్‌మెడిటరేనియన్ సిస్మోలాజికల్ సెంటర్ (ఈఎంఎస్సీ) వెల్లడించింది. భూ అంతర్భాగంలో 35 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు ఈ సంస్థ పేర్కొంది. కాగా, భారత జాతీయ భూకంప పరిశోధన కేంద్రం (ఎన్సీఎస్) మాత్రం భూకంప తీవ్రతను 5.0గా నిర్ధారించింది.

### కర్ణాటక మంత్రి జర్కిహోళి నివాసాల్లో ఇడి సోదాలు

**బెంగుళూరు, సెప్టెంబరు 9:** కర్ణాటక పిడబ్ల్యూడీ శాఖ మంత్రి సతీశ్ జార్కిహోలీ నివాసాల్లో ఇవాళ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించింది. మంత్రి సతీశ్ కుమార్తె, ఎంపీ ప్రియాంకా జార్కిహోలీ నివాసాల్లోనూ ఇడి తనిఖీలు కొనసాగుతున్నాయి. ప్రాపర్టీలకు చెందిన కేసులో ఈ విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం 18ప్రదేశాల్లో సోదాలు జరుగుతున్నాయి. బెంగుళూరులోని డాలర్స్‌కాలనీలోఉన్న మంత్రి సతీశ్ ఇంటితో పాటు అనేక ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

### బుల్లెట్‌రైలు ఢీకొని కేరళ యువతి మృతి

**కన్నూరు, సెప్టెంబరు 9:** జపాన్‌లో నర్సింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న 22 యేళ్ల కేరళ యువతి దేవిక బుల్లెట్ రైలు ఢీకొని మృతిచెందింది. జపాన్ వెళ్లేందుకు డబ్బులేక, కూతురి మృతదేహాన్ని తీసుకురాలేక ఆమె పేరెంట్స్ అంతిమ వీడ్కోలు పలకలేకపోతున్నారు. జపాన్‌లో ఉన్న కేరళ సంఘం నిహాన్ కైరేలీ దేవిక అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### బంగ్లాదేశ్‌లో మరో ఇద్దరు హిందువుల దారుణ హత్య

**ఢాకా, సెప్టెంబరు 9:** బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు ఆందోళనకరంగా మారుతున్న వేళ వేర్వేరు ఘటనల్లో ఇద్దరు హిందువులు దారుణ హత్యకు గురయ్యారు. మృతుల్లో ఓ మహిళ కూడా ఉంది. తాజా ఘటనలతో హిందూ మైనారిటీల భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. నౌగావ్ జిల్లా మహాదేవ్‌పూర్‌లో 45 ఏళ్ల హిందూ స్వర్ణకారుడు అలీఫ్ చంద్ర దత్తా హత్యకు గురయ్యాడు.

# కెసిఆర్ మరణం కోరుతున్నది కుటుంబసభ్యులే.. కుమార్తే చెప్పారు: పిసిసి చీఫ్ మహేష్‌గౌడ్

## మీడియా పాయింట్



హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త : బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ మరణాన్ని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కోరుకోలేదు. కెసిఆర్ కుటుంబ సభ్యులే ఆయన మరణం కోసం పూజలు చేస్తున్నారని ఇప్పటికే కెసిఆర్ కూతురు కవిత చెప్పారు. వీర్లపల్లి శంకర్ సిఎం రేవంత్‌రెడ్డి అభిమాని. బిఆర్ఎస్ నేతలు రేవంత్‌రెడ్డిని నోటికి వచ్చినట్లు తిడుతున్నారన్న బాధలో శంకర్ అలా మాట్లాడారు. కెసిఆర్ ఆరోగ్యం బాగుండాలని కాంగ్రెస్ కోరుకుంటుంది. కెసిఆర్ ఆరోగ్యం చెడిపోవాలని కోరుకునేది ఆయన ఇంటి సభ్యులే. కెసిఆర్ ఫామ్‌హౌస్ బాత్రూంలో జారిపడితే గ్రీన్ ఛానల్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. అధికారులను అప్రమత్తం చేసి వారి ఆరోగ్యం కోసం జాగ్రత్తలు తీసుకున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఆసుపత్రికి వెళ్లి కెసిఆర్‌ను పరామర్శించారు. అసెంబ్లీకి కేసీఆర్ వస్తే దగ్గరికి వెళ్లి మాట్లాడిన ఘనత రేవంత్‌రెడ్డిది. అలాంటిది మా కాంగ్రెస్‌పై నిందలు వేయడం హాస్యాస్పదం. ప్రతిపక్ష నాయకులకు గౌరవించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీది. రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి తర్వాత అంతటి భద్రత కెసిఆర్‌కే కల్పించాం. కెసిఆర్ ఫామ్‌హౌస్ దగ్గర కూడా వందల సంఖ్యలో పోలీసులను మోహరించారు. వాళ్ళు సిరిసిల్ల నియోజకవర్గంలో రేవంత్ రెడ్డికి పిండ ప్రధానం చెయ్యడం మంచి సంస్కృతి అవుతుందా.. కెసిఆర్ ఆరోగ్యం గురించి చెడుగా ఆలోచిస్తుంది అతనికి దగ్గరగా ఉన్నవాళ్లే. కేసీఆర్ చెడును మేము ఎప్పుడూ కోరుకోలేదు. ప్రజలు మాకు అధికారం ఇస్తే, ముఖ్యమంత్రికి పిండ ప్రధానం చేయడం ఎంతవరకు సబబు? అని నిలదీశారు.

## కెసిఆర్ మొదటి నుంచి దళిత వ్యతిరేకే: మండలి విప్ అద్దంకి దయాకర్



కేసీఆర్ ఇంటి దగ్గర దళిత సంఘాలు చావు డప్పు కార్యక్రమం పెట్టారు. ఎందుకు పెట్టారో కేసీఆర్ ఆత్మ పరిశీలన చేసుకోవాలి. దళితులు కార్యక్రమం పెడితే ఆ ప్రదేశాన్ని సంప్రోక్షణ చేసి దళితులు అంటరానివారని చేశారని అద్దంకి దయాకర్ అన్నారు. దళితులకు వ్యతిరేకం మీరు. మీ డిఎన్ఎ దళిత వ్యతిరేక డిఎన్ఎ. దళిత వ్యతిరేక పార్టీ బిఆర్ఎస్ పార్టీ. ఈపని చేసినందుకు ఎలక్షన్ కమిషన్ మీ పార్టీని రద్దు చేయాలి. గతంలో నలుగురు, ఇప్పుడు ముగ్గురి కోసం వారి పార్టీ పని చేస్తున్నది. కేటీఆర్ దిగజారి, పనికిమాలిన రాజకీయాలు చేస్తున్నారు. గతంలో షాడో సీఎంగా వ్యవహరించిన మీరు బట్టలు విప్పుకొని తిరగడం ఏంటి? సమాజంలో విభజన తెస్తున్నారు. అలజడులు సృష్టిస్తున్నారు. మహిళా పోలీసుల పట్ల అవమానకరంగా వ్యవహరించారు. సంప్రోక్షణ చేసిన విషయంపై కేసీఆర్ క్షమాపణ చెప్పి మాత్రమే అసెంబ్లీకి రావాలి. లేదా కేసీఆర్ ఇది చేయించకపోతే వివరణ ఇవ్వాలి. దాసి సినిమా చూసినట్లు ఉంది మాకు. దళిత సమాజం, దళిత సంఘం నాయకులు దీన్ని ప్రశ్నించండి. బిఆర్ఎస్ పార్టీని తన్ని తరిమి కొట్టే కార్యాచరణ మా దళిత సమాజానిది.

## మధు మాట్లాడింది కెసిఆర్ భావజాలం: ఎమ్మెల్యే వేముల వీరేశం

తాతా మధు మాట్లాడింది ఆయన మాటలు కావు. కేసీఆర్ భావజాలం. దళిత సమాజం మొత్తం ఈ విషయాన్ని ఆలోచించాలి. మనుధర్మ భావజాలం అణువణువున నింపుకుని బి. ఆర్. ఎస్ పార్టీ వ్యవహరిస్తున్నది. మా జాతులపట్ల కుట్రపూరితంగా ఉండే విధానం ఎంపిక చేసుకున్నారు కేసీఆర్. మేము నడిచిన నేల పరిశుభ్రం అయ్యిందా? నీ ఇల్లు శుభ్రం చేస్తున్నది. నీ భూమి దున్నుతున్నది, వంట చేసి పెడుతున్నది మా జాతి వారే. మరి అవన్నీ నువ్వు వదులుకుంటావా? పసుపు నీళ్ల చల్లించిన కేసీఆర్ మీద ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలి.

## నిరసన చేస్తే..పసుపు నీళ్లతో శుద్ధి చేస్తారా?: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కాళోజీ జయంతి రోజున అన్యాయం గురించి హరీష్ రావు మాట్లాడుతున్నారు. స్పీకర్‌ని మీ పార్టీ సభ్యుడు అనరాని మాటలు అంటే అన్యాయం కనపడుతలేదా? బిజినెస్ రూల్స్ అతిక్రమించారు. వెయ్యి రోజుల్లో ముఖ్యమంత్రి తలుచుకుంటే మిమ్మల్ని ఎప్పుడో లోపల వేసేవారు. కేసీఆర్ అసెంబ్లీకిరావాలి. దళిత సమాజంకు క్షమాపణ చెప్పాలి అంటే స్పందన లేదు. ఎవరైనా మీ ఫామ్ హౌస్ దగ్గర గతంలో నిరసనచేశారా?అనరాని మాటలు అంటే ఆక్రోశంతో చేస్తే ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేస్తారా?కేసీఆర్ దీనికి కూడా క్షమాపణ చెప్పాలి.

## దోచుకుంది దాచుకోవడానికి ఈ దాడి: ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

మహిళల్ని ముందు పెట్టి శిఖండి రాజకీయాలు చేయాలని చూశారు. తెలంగాణను మరో బిహార్ చేయాలని చూస్తున్నారు.

విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులను టార్గెట్ చేయడం మంచి పద్ధతి కాదు. మీరు విధ్వంసం సృష్టించడానికి పన్నిన కుట్రలో భాగమే అసెంబ్లీ ముందు జరి గింది. మమ్మల్ని గతంలో ఇంటి నుండి బయ టకు రానీయ్యలేదు. మీకు మేము నిరసనలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాం. బ్లాక్ టికెట్లు అమ్మే బ్యాచును కేసీఆర్ అసెంబ్లీకి పంపారు. దళిత, గిరిజన, బహుజన వర్గాల మీద వీళ్ళు దాడి చేశారు. దోచుకుంది దాచుకోవడానికి ఈ దాడి. బిఆర్ఎస్ నేతలకు మహిళలలు, దళితులు, శాసనసభ, స్పీకర్ పట్ల గౌరవం లేదు. పసుపు నీళ్లతో శుద్ధి చేయడం అనేది చాలా అవమా నకరం. బిఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరు ఖండి స్తున్నాం. వీరిపై పిడి యాక్ట్ పెట్టాలి.

## ఇగోలతో సభ జరగనివ్వడంలేదు: బిజెపి ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి

ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నది. పర్స నల్ ఈగోలతో సభను జరగనివ్వడంలేదు. ప్రతి సారి దాడికి ప్రతి దాడి మంచిది కాదు. పోలీ సులను ఇబ్బందికి గురిచేయడం తప్పు. రోడ్డున అర్ధనగ్న ప్రదర్శన చేయడం ఏం సందేశం ఇస్తున్నట్లు. కులాల మధ్య అంతరాన్ని పెంచే విధంగా మాట్లాడు తున్నారు. సభలో లేని వారిని గంగుల కమలాకర్ కూడా సస్పెండ్ చేశారు. అధికారం ఉంది కాదా అని వారికి తోచినట్లు చేస్తున్నారు. పదిసంవత్సరాలు మమ్మల్ని ఇబ్బంది పెట్టారు. ఇప్పుడు మేము పెడతాం అనే విధంగా వ్యవహరిస్తున్నారు. ప్రజా సమస్యలపై చర్చ జరగాలి. మాట్లాడాలి. సభ ఆరు రోజుల్లో మూడు రోజులు ఇప్పటికే ఏం చర్చ లేదు. ఎవరి ఇంటిపై దాడి జరిగినా అది మంచిది కాదు. హుందాతనంతో శాసనసభ్యులు వ్యవహరించాలి.

## రోడ్లను శుద్ధి చేయడం బాధాకరం: ఎమ్మెల్యే రాందాస్ నాయక్

అధికారంలేకపోతే బతకలేని పరిస్థితి వచ్చింది. దళిత, గిరిజన, బహుజన వర్గాల మీద వీళ్ళు దాడి చేశారు.
దోచుకుంది దాచుకోవడానికి ఈ దాడి. దళితులు ఫామ్‌హౌస్‌కు వచ్చారనే కారణం తో రోడ్లను శుద్ధి చేయడం బాధాకరం. బిఆర్ఎస్ చేసిన తప్పును సరిదిద్దుకోకుండా మళ్లీ మళ్లీ అదే తరహా తప్పులు చేస్తోంది.

## పసుపు నీళ్లతో శుద్ధి అవమానకరం: కాంగ్రెస్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్



బిఆర్ఎస్ నేతలకు మహిళలు, దళితులు, శాసన సభ, స్పీకర్ పట్ల గౌరవం లేదు. పసుపు నీళ్లతో శుద్ధి చేయడం అనేది చాలా అవమానకరం. బిఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరు ఖండిస్తున్నాం. వీరిపై పిడి యాక్ట్ పెట్టాలి. కేసీఆర్ సభకు వచ్చి క్షమాపణ చెప్పాలి. ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించండి అని కేసీఆర్ ఆదేశాలు ఇచ్చినట్లు ఉంది. దళిత సంఘాలు ఆక్రోశంతో కార్యక్రమం చేస్తే ఆ ప్రాంతాన్ని శుద్ధి చేశారు. ఇది దళితుల్ని అవమానించడమే. దళితుడు స్పీకర్ అయినందుకు, కేసీఆర్ దొర అనే అహంకారంతో అసెంబ్లీకి రావడం లేదు.

## మళ్లీ తెరపైకి అంటరానితనం: కాంగ్రెస్ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

సభ నడవనీయద్దనే బిఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు. ఎప్పుడో మరిచిపోయిన అంటరానితనాన్ని మళ్ళీ వీళ్ళు తెరపైకి తెస్తున్నారు బిఆర్ఎస్ నేతలు.

కేసీఆర్ స్పీకర్ గారికి క్షమాపణ చెప్పి, తాత మధు పార్టీ నుండి బహిష్కరించాలి. లేదంటే రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీని బొందపెట్టే పరిస్థితి వస్తుంది.

## దళితులు ధర్నా చేస్తే ఆ ప్రాంతం మైల పడుతుందా?:విప్ బల్మూరి వెంకట్

దళితులు ధర్నా చేస్తే, ఆ ప్రాంతం మైల పడుతుందా ?ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేస్తారా ? 'బీఆర్ఎస్ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ డిఎన్ఎ లోనే దళిత వ్యతిరేక విధానం వున్నది. ఏకంగా శాసనసభాపతినే పరుష పదజాలంతో దూషించారని యావత్ తెలంగాణ సమాజం ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ జాతికి చెందిన స్పీకర్‌నే తిట్టడాన్ని తట్టుకోలేక దళిత సోదరులు డప్పు దరువులతో కేసీఆర్ ఫామ్ హౌస్ దగ్గర నిరసన వ్యక్తం చేస్తే. ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో సంప్రోక్షణ చేయడమంటే జాతి వివక్షత, అంటరాన్ని తనాన్ని చూపినట్లే. ఫామ్ హౌస్ లో పడుకున్న ప్రతిపక్ష నేత కేసీఆర్ స్పందించాలి. క్షమాపణ చెప్పాలి. లేకుంటే దళిత సమాజమే బిఆర్ఎస్ పార్టీని వెలివేసి, అంటరాని పార్టీగా గుర్తిస్తుంది. కేసీఆర్ కేబినెట్ లో దళిత నేత డిప్యూటీ సీఎం గా ఉంటే తీసేశారు. దళిత నేత భట్టిని కాంగ్రెస్ పార్టీ ప్రతి పక్షనేతగా చేస్తే, ఆ హోదా లేకుండా చేశారు. నిరసన వ్యక్తం చేశారు అన్న కారణంతో.. దళిత నాయకులు ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ను ఆ నాడు సభ నుంచి సస్పెండ్ చేశారు. ఇవాళ అత్యున్నత పదవిలో ఉన్న శాసనసభా పతిని కూడా దూషించారు.

కుక్కతోకకు గుండు కడితే సక్కగా రాదు అన్నట్లు బిఆర్ఎస్ నేతలకు ఎంత చెప్పినా బుద్ధి మాత్రం మారటం లేదు. నిన్న కేటీ ఆర్ కూడా మరోసారి ముఖ్యమంత్రి పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన అహంకారానికి నిదర్శనం. ఇలాంటి పరిస్థితి మార్చుకోకపోతే ప్రజలే బిఆర్ఎస్ నేతలకు బుద్ధి చెబుతారు.

# ప్రతిపక్షం అపోహాలు సృష్టించవద్దు

### కెసిఆర్ చావు ఎవరు కోరుకోవడంలేదు: శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు





హైదరాబాద్,సెప్టెంబరు 9,ప్రభాతవార్త: "ఎవరి చావును ఎవరు కోరుకోవడంలేదు.. అందరు బాగుండాలి,ప్రతిపక్షనేత కెసిఆర్ వంద సంవత్సరాలు బ్రతుకాలి ఈ తెలంగాణకు వారి దైన శైలిలో సేవ చేయాలి అని అంతా కోరు కొంటున్నారు. అపోహాలు ప్రతిపక్షం సృష్టించవద్దు అని శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు ఓటమిలను రాజకీయంగా ఎదుర్కొంటుందని ఎవరి చావులను కోరుకోదని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఆరోగ్యంగా ఉండాలని, ఆయన వందేళ్లకు పైగా బతికుండాలనే తాము మనస్పూర్తిగా కోరుకుంటున్నామని రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి కెసిఆర్ అనుభవంతో కూడిన మార్గదర్శకత్వంలో ప్రజాసేవ కొనసాగాలని తాము ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నారు. చట్టసభల్లో ప్రజాసమస్యలపై చర్చించేందుకు నిబంధనలు ఉంటాయని, బిఆర్ఎస్ సభ్యులు లేవనెత్తాలనుకుంటున్న అంశాలను సభా నిబంధనావళి ప్రకారం సరైన రూపంలో స్పీకర్ కు లిఖితపూర్వకంగా సమర్పించాలని ఆయన హితవు పలికారు. చట్టసభల హుందాతనాన్ని కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదని, శాసన 'సభ ప్రాంగణంలో', సభ లోపల అసభ్యకరమైన పదజాలం వాడటం, అభ్యంతరకరంగా ప్రవర్తించడాన్ని ఏమాత్రం ఆమోదించే ప్రసక్తే లేదని మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నియమ నిబంధనలకు అందరూ కట్టుబడి ఉండాలని, స్పీకర్ స్థానాన్ని గౌరవిస్తూ సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు. ప్రతిపక్షం నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలతో ప్రజల పక్షాన నిలబడాలే తప్ప, వివాదాలు సృష్టిస్తూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. ప్రధాన ప్రతిపక్షం దుర్భాషలతో స్పీకర్‌పై దాడులు చేసిందని, ఈరోజు దళితులు నడిచిన నేల శుద్ధి చేశారని బిజెపి, సిపిఐ, ఎంఐఎం సభ కార్యక్రమాల నిర్వహణకు స్పీకర్ తీసుకొనే కార్యాచరణకు మద్దతు పలుకాలని కోరుతూ ఆయన బిఆర్ఎస్ శాసనసభ సభ్యుల జాబితా చదువుతూ సస్పెన్షన్ ప్రతిపాదన చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మన్‌కుమార్ మాట్లాడుతూ దళితులు తిరిగిన నేలను శుద్ధిచేయడం పై సెక్షన్338 ప్రకారం ప్రకటన చేశారు. ఎస్‌సిలను బిఆర్ఎస్ ఎర్రవెల్లిలో శుద్ధి చేసి దళితులను అవమానపరుస్తోందని కాంగ్రెస్ వాయిదా తీర్మానం పై ఆయన మాట్లాడారు. శుద్ధిపేరుతో ఎస్‌సిల ఆత్మగౌరవం దెబ్బతీశారనిఆగ్రహం వ్యక్తం చేశారు.

బిఆర్ఎస్ నేతలు బేషర్తుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణను ఆత్మగౌరవం కోసం సాధించుకొ న్నామని రాష్ట్రం వచ్చినా వివక్ష కొనసాగుతోందని శుద్ధి చేయడంపై ఏం సమాధానం చెబుతారని అన్నారు. స్పీకర్‌ను దూషించిన అంశంపై కూడా బిఆర్ఎస్ నేతలు పశ్చాత్తాపం ప్రకటించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అడ్లూరి లక్ష్మన్ ప్రసంగంకు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడ్డుపడ్డారు.

### ఎర్రవెల్లి వ్యవసాయక్షేత్ర శుద్ధిపై చర్చకు తీర్మానం ప్రకటించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్

# దళిత, గిరిజన, బిసి వ్యతిరేకి బిఆర్ఎస్

## బిజెపి, బిఆర్ఎస్ భావజాలం ఒక్కటే

### స్పీకర్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### శాసనసభలో మంత్రులు, సభ్యులు

హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త: స్పీకర్‌ను కించపరచేలా మాట్లాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రులు, సభ్యులు కోరారు. దళిత, గిరిజన, బిసి వర్గాల వ్యతిరేకి బిఆర్ఎస్ అని ఆరోపించారు. శాసనసభలో బుధవారం బిఆర్ఎస్ సభ్యులు వ్యవహరించిన తీరు, స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు తదితర వాటిపై పలువురు మంత్రులు, సభ్యులు మాట్లాడారు. బిఆర్ఎస్ సభ్యులు వ్యవహరించిన తీరు బాగాలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సభా ఔన్నత్యాన్ని కాపాడాలని కోరారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు బిజెపి సభ్యులు సహకరిస్తున్నారని విమర్శించారు. శాసనసభా వ్యవహారాల మంత్రి డి శ్రీధర్ బాబు మాట్లాడుతూ దళితులపై బిఆర్ఎస్ సభ్యులు చేసిన వ్యఖ్యలపై మాట్లాడుతారనుకుంటే బిజెపి సభ్యులు ఏదో ఏదో మాట్లాడుతున్నారన్నారు. ఛైర్‌కు, సభ్యులకు గౌరవం ఇవ్వాలని సూచించారు. బిజెపి సభ్యులు సభా కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని, ఇది సరికాదన్నారు. సభా కార్యక్రమాలు జరగాలని, వివిధ అంశాలై చర్చించాలని ఉద్దేశ్యం లేదని తప్పుపడ్డారు. సామాజిక న్యాయం గూర్చి మాట్లాడటం లేదని విమర్శించారు. భూములకు సంబంధించి 22ఎ, విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర అంశాలపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. మరో మంత్రి ధనసరి అనసూయ స్పందిస్తూ సిఎంను బిజెపి సభ్యులు ఏక వచనంతో మాట్లాడుతున్నారని, దాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. స్పీకర్‌ను విమర్శిస్తే కనీసం బిఆర్ఎస్ సభ్యుల్లో పశ్చాపం కూడా లేకుండా శాసనసభ నుండి బయటకు పోయి డ్రామాలు ఆడుతున్నారన్నారు. దళితులు నడిచిన ఫామ్‌హౌస్ ప్రాంతాన్ని పశుపు నీళ్లతో సుద్ధి చేయడం అత్యంత హీనమైన చర్య అని వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్, బిజెపి భావజాం ఒక్కటేనన్నారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ సభ్య సమాజాం తలవంచుకునేలా చెప్పలేని రీతిలో బిఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతున్నారన్నారు. కుల అహంకారంతో బిజెపి, బిఆర్ఎస్‌లు శుద్ధి చేస్తారని చెప్పారు. గ్రామాల అభివృద్ధికిఇ సంబంధించిన బిల్లు శాసనసభలో ప్రవేశపెడితే దానిపై బిజెపి సభ్యులు మాట్లాడకుండా సమయం వృధా చేస్తున్నారని విమర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బిజెపి నాయత్వంలో విస్పోటనం జరుగుతోందన్నారు. ఆ పార్టీ సభ్యులు ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రం నుండి నిధులు తీసుకు రావడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. సిపిఐ సభ్యులు కె సాంబశివరావు మాట్లాడుతూ ఎజెండాలో 22ఎ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సమస్యలను పెడతామని ప్రభుత్వం చెబుతోందని, దాన్ని బిజెపి సభ్యులు ఫాలో అవ్వాలన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో విపరీత పోకడలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఫామ్‌హౌస్ వద్ద దళితులు రావడంపై పసుపు నీటితో శుద్ధి చేయడం సరికాదన్నారు. ఇంకా వివక్షత కొనసాగడం దుర్మార్గమన్నారు.

అలాగే సిఎంకు పింప్రదానం ఘోరమైన విషయమని ఖండించారు. అటువంటి వారిపై కేసులు పెట్టాలని సూచించారు. అంతేకాకుండా చిల్లరి మనుషులు అనడం ఏ భాష అని అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే బిఆర్‌స్ సభ్యులపై విధించిన సస్పెన్షన్ వేటును ఎత్తివేయాలన్నారు. ఇంకా వీటిపై సభ్యులు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, గండ్ర సత్యన్నారాయణ, నాయని రాజేందర్‌రెడ్డి, మదన్ మోహన్‌రావు, బాలానాయక్, నవీన్, అబ్దుల్ బలాల తదతరులు మాట్లాడారు.

# పోలీసు ఉద్యోగాలకు వయో పరిమితి పెంచాలని సిఎంకు బల్మూరి వినతి

హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త: పోలీసు ఉద్యోగాలకు వయో పరిమితిని మరింతగా పెంచాలని కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌సి బల్మూరి వెంకట్ కోరారు. ఈ మేరకు ఆయన సిఎం రేవంత్ రెడ్డిని బుధవారం కలిసి ఒక వినతి పత్రం అందజేశారు. కరోనా పరిస్థితులు, గత ప్రభుత్వం లో నోటిఫికేషన్ల విడుదల ఆలస్యం కావడం వంటి కారణాల వల్ల అనేక మంది నిరుద్యోగులు వయో పరిమితిని దాటినందున వారి కోసం మ రికొంత సడలించాలని వెంకట్ కోరారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు 36 ఏళ్లు, ఎస్ఐ ఉద్యోగాలక 38 ఏళ్ల వరకు వయో పరిమితిని పెంచాలని ఆయన కోరారు. సిఎం రేవంత్ రెడ్డి దీనికి సానుకూలంగా స్పందించారని వెంకట్ మీడియాకు తెలిపారు.

# తెలంగాణ ఎన్ఎస్‌యుఐ నూతన రాష్ట్ర జిల్లా కమిటీల ఏర్పాటు

హైదరాబాద్,సెప్టెంబరు 9,ప్రభాతవార్త: తెలంగాణ ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర,జిల్లాకమిటీలను తెలంగాణ ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎడవెల్లి వెంకటస్వామి ప్రకటించారు. రాష్ట్రకమిటిలో రేగులపాటి రితీష్‌రావు,మామిడాల రాహుల్ యాదవ్‌లను ఇద్దరని సీనియర్ వైస్‌ప్రసిడెంట్లు గానియించారు. తొమ్మిది మందిని వైస్ ప్రసిడెంట్లుగా 63 మందిని జనరల్ సెక్రటరీలుగా స్టేట్ సెక్రటరీలుజాయింట్ సెక్రటరీలుగా మరో 68మందిని ప్రకటించారు. అదే విధంగా 34 జిల్లాల ఎన్ఎస్‌యుఐ ప్రసిడెంట్లను పేర్లు ప్రకటించారు.

# డిజిపి కార్యాలయంలో కాళోజి జయంతి

హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త: ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు డిజిపి కార్యాలయంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాళోజి చిత్ర పటానికి మల్టీ జోన్ 2 ఐజి షా నవాజ్ ఖాసీం, సంక్షేమ, క్రీడల ఐజి డాక్టర్ గజారావు భూపాల్. టి జి స్పాట్ ఎస్‌పి రూపేష్, ఎఐజి రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాళోజి సేవలను షా నవాజ్ ఖాసీం కొనియాడారు . సాహిత్య రంగానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని షా నవాజ్ ఖాసీం తెలిపారు. ప్రజా సమస్యలపై కాళోజి తన రచనల ద్వారా చైతన్యాన్ని తీసుకువచ్చారని కొనియాడారు.

## ఇథనాల్ ఇ20 పెట్రోల్ వాడకంతో అనేక ప్రయోజనాలు: మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, సెప్టెంబరు 9,ప్రభాతవార్త: ఇథనాల్ వినియోగంతో రైతుల పంటలకు మంచి ధర, కాలుష్యం తగ్గింపు, విదేశీ మారకద్రవ్య ఆదా వంటి ప్రయోజ నాలు ఉన్నాయని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసనమండలిలో బుధవారం ప్రశ్నోత్త రాల సమయంలో సభ్యులు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకంపై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. పెట్రోల్ 20 శాతం ఇథ నాల్ కలపడం వల్ల వాహనాలు పాడవుతున్నట్లు ఇప్పటివరకు వాహన యజమానులు, ఆటో మొబైల్ రంగ నిపుణుల నుంచి రవాణాశాఖకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ20 ఇంధన విధానం ప్రకారం ఏప్రిల్ 16 నుంచి దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ విక్రయిస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల వాహనాల పికప్, మైలేజీ కొంత తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, సాధారణ సర్వీసింగ్ పెద్దగా ఇబ్బందులు ఉండవన్నారు. రాష్ట్రంలో ఈవి పాలసీని విజయవంతంగా అమలు చేస్తున్నామని, ఎలక్ట్రిక్ వాహనాలకు 100 శాతం పన్ను మినహాయింపు కల్పిస్తున్నట్లు మంత్రి చెప్పారు.


## కార్మికుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: మంత్రి వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, సెప్టెంబరు 9,ప్రభాతవార్త: కార్మికుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్షమని మంత్రి వివేక్ వెంకటసామి స్పష్టం చేశారు. శాసన మండలిలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యులు బి.మహేష్ గౌడ్ కార్మి కుల వేతన సవరణపై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. రాష్ట్రంలోని కార్మికులకు కనీస వేతనాలను కాంగ్రెస్ ప్రభుత్వం గణనీయంగా పెంచిందని తెలిపారు. కొత్త వేతనాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.10 కోట్ల మంది కార్మికులకు ప్రయోజనం కలుగుతుందని కార్మికులను అన్ సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ నాలుగు కేటగిరీలుగా విభజించి, రాష్ట్రాన్ని మూడు జోన్లుగా వర్గీకరించినట్లు వివరించారు. మున్సిపల్ కార్పొరేషన్లు జోన్1, మున్సిపాలిటీలు జోన్2, గ్రామీణ ప్రాంతాలు జోన్3గా నిర్ణయించినట్లు వివరించారు. కోర్ ఏరియాలో కనీస వేతనం రూ.10,900 నుంచి రూ.14 వేలకు, జోన్2లో రూ.15 వేలకు, జోన్1లో రూ.16 వేలకు పెంచినట్లు తెలిపారు. తక్కువ వేతనాలు చెల్లించే సంస్థలపై ఫిర్యాదులు వస్తే కార్మిక శాఖ ద్వారా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

## యూరియా బుకింగ్ యాప్ రైతుల పాలిట శాపం

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

హైదరాబాద్,సెప్టెంబరు 9,ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా బుకింగ్ యాప్ రైతుల పాలిట శాపంగా మారిందని, ఈ యాప్ తక్షణమే రద్దు చేయాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసనమండలిలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని నెల్లికంటి సత్యం ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్ సాంకేతిక లోపాలు, సర్వర్ సమస్యలు, ఓటిపి ఆలస్యం, బుకింగ్ సమయంలో యూరియా స్టాక్ వెంటనే అయిపోవడం వంటి కారణాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్మార్ట్ ఫోన్ వినియోగంపై అవగాహన లేని చిన్న, సన్నకారు రైతులు యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవడం మరింత కష్టంగా మారిందని పేర్కొన్నారు. బుకింగ్ చేసేందుకు ప్రయత్నించేలోపే స్టాక్ పూర్తయినట్లు చూపిస్తుండటంతో రైతులు రోజుల తరబడి ఎరువుల కోసం తిరగాల్సి వస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారని, వారికి యూరియా సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు సబ్సిడీ యూరియా అందించే సహకార సంఘాలకు గతంలో రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరించేదని, ఇటీవల కాలంలో దానిని ఉపసంహరించుకోవడంతో యూరియా ధరలు పెరిగినట్లు సభ దృష్టికి తీసుకోచ్చారు. ఈ నేపథ్యంలో రానున్న కాలంలో రైతులు వ్యవసాయానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందని నెల్లికంటి సత్యం హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునర్ పరిశీలించి, రైతులకు సకాలంలో అవసరమైన మేరకు యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఎల్‌ఈనో ప్రభావంపై ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి సత్యం సూచించారు.



## అసలు రైతులకు ఎరువులు అందేలా యాప్

### వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

గతంలో ఆధార్ ఆధారంగా ఎరువులు పంపిణీ చేసేవారని, కానీ సబ్సిడీ ఎరువులు కేవలం భూమిని సాగు చేసే అసలైన రైతులకు మాత్రమే అందేలా చూసేందుకు 'ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. యాప్ తలెత్తే సమస్యలను భారత ప్రభుత్వ సాంకేతిక బృందం ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందని సిపిఐ సభ్యులు నెల్లికంటి సభ్యులు అడిగిన సమాధానమిచ్చారు. స్మార్ట్‌ఫోన్ లేని రైతులు ఎఫ్ పరిధిలోని కామన్ సర్వీస్ సెంటర్లు సిఎస్ ద్వారా ఎరువులను బుక్ చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. రానున్న పంట కాలాలలో నిరంతరాయంగా సేవలను అందించడానికి, గరిష్ట లోడ్ నిర్వహించడానికి డిమాండ్ అనుగుణంగా సర్వర్ సామర్థ్యాన్ని ఆటోమేటిక్ పెంచే విధంగా భారత ప్రభుత్వ ఎఫ్ సాంకేతిక బృందం ఎప్పటికప్పుడు లోడ్ టెస్టింగ్ నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యలు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఎల్‌ఈనో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముం దస్తు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ చెప్పారు. శాసనమండలిలో బుధవారం ప్రశ్నోత్తరాల



సమయంలో సభ్యులు ఎ.వి. ఎన్.రెడ్డి, సిపిఐ సభ్యులు నెల్లి కంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమా ధాన మిచ్చా రు. ఈ సందర్భంగా మంత్రి శ్రీని వాస్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ ప్రభావంపై రైతాంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు నీటి లభ్యత, పంటల సాగు తదితర అంశాలపై సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. విపత్కర పరిస్థి తుల్లో రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వ సహాయం కోరుతున్నట్లు చెప్పారు. ఎల్ ప్రభా వంతో ఎదురయ్యే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని ముందస్తు చర్యలు చేపట్టి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు.



## ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీని అరికట్టాలి: ఎమ్మెల్సీ విజయశాంతి

హైదరాబాద్,సెప్టెంబరు 9,ప్రభాతవార్త:రాష్ట్రంలో ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ అడ్డగోలుగా పెరిగిపోయిందని, దానిని వెంటనే అరికట్టాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని ఎమ్మెల్సీ విజయశాంతి అన్నారు. ఏదైనా అనారోగ్య సమస్య కారణంగా ఆసుపత్రికి వెళ్తే చాలు ఆఫీజు, ఈఫీజు అంటూ లక్షల రూపాయలు దండుకుంటున్నారని మండిపడ్డారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఆసుపత్రుల బిల్లులు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు : మంత్రి దామోదర రాజనర్సింహా

హైదరాబాద్, సెప్టెంబరు 9,ప్రభాతవార్త: ప్రజలకు ముఖ్యంగా కావాల్సినవి విద్య, వైద్యం అని, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అవి భారంగా మారాయని మంత్రి దామోదర రాజనర్సింహా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీకి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దోపిడీని అరికట్టి, ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

## బిసి కులగణన చేపట్టాలి: తీన్మార్ మల్లన్న

హైదరాబాద్, సెప్టెంబరు 9,ప్రభాతవార్త: జనగణనలో బిసి కులగణన చేపట్టే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రభుత్వాన్ని కోరారు. బిసి కులగణన చేపట్టకపోతే విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో బిసిలు మరో పదేళ్ల పాటు వెనకబడి పోతారని పేర్కొన్నారు. బిసి కులగణన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణ ప్రజల గొంతుక కాళోజీ

## ఆయన జీవితం సామాజిక న్యాయం కోసం సాగిన నిరంతర ఉద్యమం: మంత్రి జూపల్లి

### ఘనంగా ప్రజాకవి కాళోజీ 112వ జయంతి-తెలంగాణ భాషా దినోత్సవం

**రవీంద్రభారతి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** కాళోజీ నారాయణరావు ప్రజల గొంతుక, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక, సామాజిక చైతన్యానికి చిరునామా అని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్, పురావస్తుశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రస్తుతించారు. కాళోజీ జీవితం సాహిత్య ప్రయాణమేకాదు ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సామాజికన్యాయం కోసం సాగిన నిరంతర ఉద్యమం అన్నారు. పుట్టుకనీది, చావునీది బతుకంతా దేశానిది అనేది కాళోజీ ఆలోచనలకు, జీవితత్వానికి దర్పణమన్నారు. కానీ ఈరోజుల్లో అన్నీ నాదే అన్నరీతిలో సమాజం ఆలోచన నడుస్తుందని, అందుకే ఇంత దుస్థితిని ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోయారు. అధికారం ముందు తలవంచని కలం, అన్యాయం ముందు మౌనం వహించని స్వరం కాళోజీదని అభివర్ణించారు. కాళోజీకి కవిత్వం ప్రజల సమస్యలను ప్రశ్నించే అక్షరాయుధమని, ఆయన రచనల్లో తెలంగాణ ప్రజల జీవితం, బాధ, ఆశ, ఆకాంక్ష, పోరాటం, ఆత్మగౌరవం స్పష్టం కళ్లకుకట్టు తాయన్నారు. కాళోజీ మాటలు, చేతలు, ఆలోచనలు, ఆవేదన, వేషభాషలు, ప్రవర్తనల్లో తెలంగాణ స్వరూపం సంపూర్ణంగా గోచరిస్తుందని, అందుకే ఆయన్ను తెలంగాణ ఆధునిక సాహిత్యం ముఖద్వారమని పేర్కొన్నారని గుర్తుచేశారు. కాళోజీ రచనలు తెలంగాణ ఉద్యమానికి జీవం పోశాయని, రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర మరువలేనిదని జూపల్లి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రభుత్వపరంగా నిర్వహిస్తున్న ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు 112వ జయంతి ఉత్సవాలు తెలంగాణ భాషా దినోత్సవంగా ఘనంగా జరిగింది. భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి ఐఎఎస్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు విశిష్ట అతిథులు తెలంగాణ సాంస్కృతిక సారథి అధ్యక్షురాలు డా. జి.వి.వెన్నెల, పొట్టపల్లి శ్రీనివాసరావు, వెంకటరమణ, ఈ సంవత్సర కాళోజీ పురస్కార స్వీకర్త ప్రముఖకవి వి.ఆర్.విద్యార్థి తదితరులతో కలిసి జ్యోతిప్రకాశనంచేసి కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి ప్రసంగించారు. ముందుగా సభకు డా. ఏనుగు నరసింహారెడ్డి స్వాగతం పలికి కార్యక్రమ నేపథ్యాన్ని వివవరించారు. ఈ సందర్భంగా ప్రముఖకవి వి.ఆర్.విద్యార్థి, ఆయన సతీమణి రత్న మాలను మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు శాలువాతో సత్కరించి కాళోజీ పురస్కారాన్ని, పురస్కారంతోపాటు లక్షావెయ్యినూట పదహార్ల నగదు, జ్ఞాపికను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. చివరగా పురస్కార స్వీకర్త వి.ఆర్.విద్యార్థి తన స్పందనలో కాళోజీ తన జీవితాన్ని సమాజానికి అంకితం చేశారని తెలిపారు. సభకుముందు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు కాళోజీ రచనలను ఆలపించి ఉర్రూతలూగించారు.


బుధవారం కాళోజీ పురస్కారంతో వి.ఆర్.విద్యార్థి, రత్నమాలను సత్కరిస్తున్న మంత్రి కృష్ణారావు, నరసింహారెడ్డి, వెన్నెల, వెంకటరమణ, శ్రీనివాసరావు తదితర అతిథులు



## కాళోజీ జయంతి తెలంగాణ భాషా దినోత్సవం శుభాకాంక్షలు: సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** కాళోజీ జయంతి తెలంగాణ భాషా దినోత్సవం శుభాకాంక్షలుతెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితెలంగాణ భాష, యాస, సంస్కృతి, ప్రజల జీవన విధానాన్ని తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిన ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు సేవలను చిరస్మరణీయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడి సేవలు మననంతో స్మరించుకోవాలన్నారు. ప్రజల గొంతుకగా నిలిచిన కాళోజీ స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు ప్రజా ప్రభుత్వం సార్థకంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ భాషకు కాళోజీ చేసిన సేవలు శ్లాఘనీయమని ఆయన స్ఫూర్తితో తెలంగాణ భాష, సాహిత్యానికి మరింత ప్రోత్సాహం అందించడమే ప్రజా ప్రభుత్వలక్ష్యం అని ప్రభుత్వం స్పష్టం చేశారు. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆ మహనీయుడి చిత్రపటానికి సిఎంరేవంత్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. కాళోజీ చిత్రపటానికి నివాళులు అర్పించిన ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కూడా ఉన్నారు.

## తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ స్పోక్స్‌పర్సన్‌గా 26మంది నియామకం

**హైదరాబాద్,సెప్టెంబరు 9,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్‌కమిటీ టిపిసిసి స్పోక్స్‌పర్సన్‌ను జిల్లాల వారిగా 26 మందిని ప్రకటిస్తు ఉత్తర్వులు జారిచేసింది. ఎ.బి. శ్రీనివాస్, ఆదిలాబాద్ ఆసిఫాబాద్ జిల్లా స్పోక్స్ పర్సన్‌గా నియమించింది,జనక్ ప్రసాద్ మంచిర్యాల, పెద్దపల్లి భూపాలపల్లి, యోగేష్ రెడ్డి నిర్మల్, ఎం. కమలాకర్ జగిత్యాల, ఇందిరా శోభన్ నిజామాబాద్, కె. మానవతా రాయ్ హనుమకొండ వరంగల్‌లకు స్పోక్స్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. మేడి రవిచంద్ర మహబూబాబాద్ రాజన్న సిరిసిల్ల , సత్యం శ్రీరంగం సంగారెడ్డి మెదక్ , కాల్వ సుజాత మేడ్చల్ మల్కాజిగిరి దామోదర్ అవెల్లి కరీంనగర్ సిద్దిపేట డాక్టర్ కొనగల మహేష్ వికారాబాద్, నూక కిరణ్ యాదవ్ జనగాం,బండారు శ్రీకాంత్‌రంగారెడ్డి, జి. లోకేష్ యాదవ్ మహబూబ్ నగర్ నారాయణపేట, షేక్షావలి ఆచారి జోగులాంబ గద్వాల్ వనపర్తి , బండి సుధాకర్‌నాగర్ కర్నూల్, డి. వెంకట్ రమ సూర్యాపేట, బొజ్జా సంధ్యా రెడ్డి యాదాద్రి భోంగిరి, దర్పల్లి రాజశేఖర్ రెడ్డి నల్గొండ, మద్ది శ్రీనివాస్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్పోక్స్‌పర్సన్‌గా ఉంటారు. డాక్టర్ రియాజ్ ములుగు,ఎ. జ్ఞాన సుందర్ ఖమ్మం, సయ్యద్ నిజాముద్దీన్ హైదరాబాద్, గౌరీ సతీష్ సికింద్రాబాద్, చనగాని దయాకర్ ఖైరతాబాద్, జహీర్ అక్తర్ కామారెడ్డి జిల్లాలో స్పోక్స్‌పర్సన్‌గా వ్యవహిస్తారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

### టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్ సెప్టెంబరు 9,ప్రభాతవార్త:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ఘనంగా బుధవారం నివాళులు అర్పిం చారు.చాకలి ఐలమ్మ ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట పటిమ తెలంగాణ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. సామాజిక అన్యాయం, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం నాటి నిరంకుశ పాలనకు ఎదురొడ్డి నిలిచిన ఐలమ్మ, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన మహనీయురాలని అన్నారు. ఆమె త్యాగాలను స్మరించుకుంటూ సమానత్వం, సామాజిక న్యాయం సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి మహిళల గురించి పట్టింపు లేదు

### మీడియాతో చిట్‌చాట్ చేసిన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మీ

**హైదరాబాద్, సెప్టెంబరు9, ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డికి మహిళల గురించి పట్టింపు లేదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వాపోయారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన సిఎం తమ మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ లాబీలో బిఆర్ఎస్ మహిళా ఎంఎల్ఎలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మీ బుధవారం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. దెబ్బ తగిలింది తమకు అని, తమ గురించి మాట్లాడడం లేదని అన్నారు. వాళ్లేమో అమ్మ గురించి వాళ్ళ అక్కల గురించి ఆలోచించారని పేర్కొన్నారు. తమకు జరిగిన అవమానంపై కెసిఆర్ తక్షణమే విచారం వ్యక్తం చేశారని తెలిపారు. సభలో మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వకుండా నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు.

## కాళోజీ సాహిత్య స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శనీయం

### కాళోజీ జయంతి సందర్భంగా కెసిఆర్ ఘన నివాళి

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** 'అవనిపై జరిగేటి అవకతవకలు జూచి ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు? అంటూ, తోటి సమాజం ఎదుర్కొంటున్న కష్టాలను తన కన్నీటితో కలిపి పంచుకున్న తెలంగాణ మనసు కవి, ప్రజాకవి పద్మవిభూషణ్, కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్ రావు వారికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజీతో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ స్మరించుకున్నారు.

## 11న దేశవ్యాప్తంగా బ్యాంక్‌ల సమ్మె: ఎఐబిఒఎ

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** బ్యాంకింగ్ రంగంలో ఉన్న అసమానతలు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 11వ తేదీ శుక్రవారం దేశవ్యాప్తంగా సమ్మె చేపడుతున్నామని ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్ అసోసియేషన్ (ఎఐబిఒఎ) తెలిపింది. ఈ సమ్మెకు ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 28,29,30 తేదీలలో మరో విడత 3 రోజులు దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తామని అసోసియేషన్ హెచ్చరించింది. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ ఛైర్మన్ అనిల్‌కుమార్, సంయుక్త కార్యదర్శి మురళి, ఉభయ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు హరినాథ్, ప్రధాన కార్యదర్శి సుబ్రమహ్మణ్యం, క్రాంతి, సంగీత ఈ సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు.

## హరీష్‌రావు పై క్షుద్రపూజలు ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

### తెలంగాణ డిజిపికి జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబరు9, ప్రభాతవార్త:** సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీశ్‌రావుపై బహిరంగంగా "బ్లాక్ మేజిక్", "క్షుద్ర పూజలు" ఆరోపణలు చేసిన వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు కాకపోవడంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)లో న్యాయవాది సామాజిక వేత్త కారుపోతుల రేవంత్ పిర్యాదుచేశారు. ఇట్టి ఫిర్యాదును ఎన్‌హెచ్‌ఆర్‌సి విచారణకు స్వీకరించింది.నాలుగు వారాల్లోగా ఆంగ్లంలో "యాక్షన్ టేకెన్ రిపోర్ట్" సమర్పించాలని తెలంగాణ డీజీపీని కమిషన్ బుధవారం ఆదేశించింది. హరీశ్‌రావు తరఫున ఆయన అనుమతితో, హైకోర్టు న్యాయవాది కారుపోతుల రేవంత్ మానవ హక్కుల పరిరక్షణ చట్టం, 1993లోని సెక్షన్ 12(ఏ) కింద 22.08. 2026న ఈ ఫిర్యాదును దాఖలు చేశారు.

## పలువురు ప్రముఖులకు తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారాలు

### ఆచార్య బేతవోలు, ఆచార్య కసిరెడ్డి ప్రభృతుల ఎంపిక: రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు

**నాంపల్లి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రతీయేటా వివిధ రంగాల్లో విశేషమైన కృషిచేసిన 12 మంది ప్రముఖులను ప్రతిభా పురస్కారాలతో సత్కరిస్తున్నది. ఇందులో భాగంగా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల సంఘం ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన ప్రముఖులను 2025 సంవత్సరానికిగాను పురస్కార గ్రహీతలుగా ఎంపిక చేసినట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు. ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన వారిలో బెల్లంకొండ ప్రసేన్-కవిత; ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి-విమర్శ; గుండోజు యాదగిరి-చిత్రలేఖనం; బి.వి.ఆర్.చారి-శిల్పం; జొన్నలగడ్డ అనురాధా-నృత్యం; మహావాది సరిత-సంగీతం; డా. ఓలేటి పార్వతీశం-పత్రికారంగం; ఎం.దినకర్‌బాబు- నాటక రంగం; భట్టు కిషన్-జానపద కళారంగం; ఆచార్య బేతవోలు రామబ్రహ్మం-అవధానం; కె.ఆశాజ్యోతి-ఉత్తమ రచయిత్రి; కె.వి.నరేందర్-నవల ఉన్నారు. త్వరలో తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లిలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో జరిగే ప్రత్యేక ఉత్సవంలో ఈ పురస్కారాలు ప్రదానం చేస్తామని, పురస్కారంతోపాటు ఒక్కొక్కరికి 30,116 రూపాయల నగదు అందజేసి ఘనంగా సత్కరిస్తామని రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తెలియజేశారు.

## సమాచార శాఖలో మట్టి గణపతుల పంపిణీ

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ గాను మట్టి వినాయకుడిని పూజించాలని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి పేర్కొన్నారు. నేడు సమాచార పౌర సంబంధాల శాఖ ఉద్యోగులకు మట్టి గణపతి ప్రతిమల పంపిణీని కమీషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముకుందరెడ్డి మాట్లాడుతూ, పండుగలను పర్యావరణ పరిరక్షణలో భాగంగా భాద్యతాయుతంగా జరుపుకోవాలని అన్నారు. జల వనరుల పరిరక్షణ కాలుష్య నివారణకు కేవలం మట్టి గణపతి మాత్రమే పూజించాలని పేర్కొన్నారు. ఈ ఉచిత గణపతి ప్రతిమల కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్ జగన్‌తో పాటు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



## ఫొటోల మార్ఫింగ్ జరిగిందని శాంతి భద్రతల డిజికి ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజున సోమవారం బిఆర్ఎస్ నేతలు, పోలీసులతో జ రిగిన గొడవ, తొక్కిసలాటపై సర్కారు విడుదల చేసిన ఫోటోలలో తమ ఫోటోలు మార్ఫింగ్ జరిగిందని బిఆర్ఎస్‌కు చెందిన నాయకులు ఆరో పించారు. దీనిపై సర్కారు మంగళవారం విడుదల చేసిన ఫోటోలలో అనేకం మార్ఫింగ్ జరిగాయని, దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులు సుధీర్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూదన చారి తదితరులు శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్‌ను డిజిపి కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు.

## ముఖరా కే గ్రామస్తుల పోరాటం అభినందనీయం: కెటిఆర్

**హైదరాబాద్, సెప్టెంబరు9, ప్రభాతవార్త:** 1000 రోజులగా కాంగ్రెస్ వైఫల్య పాలనపై ముఖరా కే గ్రామస్తుల నిరంతర పోరాటం అభినందనీయమని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలపై 100 రోజులో అమలు చేస్తానని చెప్పి అధికారంలో వచ్చి 1000 రోజులు అవుతున్న ఇంకా హామీలు అమలు చేయట్లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ముఖరా కే గ్రామస్తులు నిరంతరం రకరకాల కార్యక్రమాలు చేస్తూ నిరసన తెలపుతున్నారని అన్నారు. పోలీసులు ఎంత ఇబ్బంది పెడుతున్నా భయపడకుండా ప్రభుత్వాని ప్రశ్నింస్తున్నారని పేర్కొన్నారు.ఇలాగే కాంగ్రెస్‌హామీలపై పోరాటాలు కొనసాగించాలంటూ తెలంగాణ భవన్‌లో తనను కలిసి ముఖరాకే మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షిని కెటిఆర్‌అభినందించారు.కార్యక్రమంలోమాజీ ఎంపిటిసి గాడ్గేసుభాష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన ఫొటోలు ఎఐ రూపొందించిన నకిలీ చిత్రాలు: కెటిఆర్

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన ఫొటోలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ద్వారా రూపొందించిన నకిలీ చిత్రాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలపై అసత్య ప్రచారం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ, దాని అనుబంధ సోషల్ మీడియా హ్యాండిల్స్ ఏఐ రూపొందించిన ఫేక్ ఫొటోలు, వీడియోలను ఉపయోగిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ నకిలీ ఫొటోలపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామని, వాటిని రూపొందించిన, ప్రచారం చేసిన వ్యక్తులతో పాటు వాటిని ఉద్దేశపూర్వకంగా ప్రసారం చేసిన మీడియా సంస్థలపై కఠినమైన న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు.

## మారుతి సుజుకీతో కలిసి డేర్ టు గో గ్లామ్‌ని ప్రారంభించిన వరుణ్ మోటార్స్

### ఆశయసాధకుల కోసం అద్భుతమైన కొత్త బాలెనో కారు ఆవిష్కరణ

**హైదరాబాద్, సెప్టెంబరు 9,ప్రభాతవార్త:** వరుణ్ మోటార్స్ ప్రై లి భారతదేశపు అగ్రగామి మారుతీ సుజుకి కారు డీలర్ యువకులను ఆకర్షించడానికి రూపొందించిన అద్భుతమైన న్యూ బాలెనోను పరిచయం చేసింది.ప్రతిష్టాత్మకమైన పట్టణ ఆశయసాధకులైన యువకులు సొగసైన అద్భుతమైన కారును మారుతి సుజుకి ఉత్పాదక సంస్థతో కలిసి మార్కెట్‌లో విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి వచ్చిన బ్యాంక్ ఆఫ్ ఇండియా గౌరవ అతిథివిశిష్ట అతిధులు వరుణ్ దేవ్‌లతో కలిసి మేనేజింగ్ డైరెక్టర్ ఆర్ సి రాజు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ వి నిరంజన్, బిజినెస్ హెడ్ వరుణ్ గ్రూప్ ది బాలెనో ని ఇక్కడ ఆవిష్కరించారు.బేగంపేట్ షోరూమ్‌లో ఎడిఎల్ఎ వరుణ్ మోటార్స్ నుండి శ్రీకాంత్, జిఎం హేమా ప్రసాద్. ఇతర సిబ్బంది పాల్గొన్నారు. . కస్టమర్ అంచనాలకు అనుగుణంగా నూతనంగా రూపొందించిన అద్భుతమైన న్యూ బాలెనోగా వరుణ్ మేనిజింగ్ డైరెక్టర్ ఆర్‌సి రాజు తెలిపారు. లెవెల్ 2 ఎడిఎస్, ఫ్రంట్ వెంటిలేటెడ్ సీట్లు సహా సెగ్మెంట్‌ఫస్ట్ ఫీచర్ల పరిచయం సిగ్నేచర్ నెక్స్ వేవ్ గ్రిల్, వివిధ అదనపు భద్రత యొక్క ఆధునిక ప్రదర్శనను కూడా కలిగి ఉందని అన్నారు.. అధునాత జీవన శైలి కలిగే యువతకు ఇది మనసుకు హత్తుకొంటుందని ఆయన వివరించారు. ప్రీమియం ప్రోగ్రెసివ్ డిజైన్ అద్భుతమైన న్యూ బాలెనో కొత్త ఫ్రంట్ ఫేసియా ఫీచర్లు ఎన్ ఈ ఎక్స్ వేవ్ ప్రీమియం కొత్త దృష్టిని ఆకర్షించే సంతకం గ్రిల్ దాని స్పష్టమైన డిజైన్‌తోవెడల్పాటి కొత్త గ్రిల్ కొత్తదానిని నిర్వచించడంలో ఉపకరిస్తుందని తెలిపారు. బాలెనో యొక్క రహదారి ఉనికి, క్షితిజ సమాంతర క్రోమ్ స్లాట్‌లతో ప్రముఖ 3డి నమూనాలను కలిగి ఉందనీ తెలిపారు. ఇది ఎంతో భద్రతతో కూడిన ప్రయాణం చేయడానికి వీలుగా ఉందని రోడ్డుపై ఏలాంటి భయాలు లేకుండా వెళ్లడానికి వీలుగా ఉంటుందని చెప్పారు. ఇది అద్భుతమైన న్యూ బాలెనో వెడల్పును పెంచడంతో సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. బ్యాంకు ఈ వాహనం కొనుగోలు దారులకు రుణాలివ్వడం చేస్తోందని తెలిపారుఎ నెక్సాయొక్క క్రాఫ్టెడ్ ఫ్యూచరిజం డిజైన్ యొక్క టచ్‌కొత్త క్రోమ్ యాక్సెంట్ ఫెండర్ గార్నిష్ డిజైన్‌కు అధునాతనత అంశాలను ఇందులో జోడించామని తెలిపారు అయితే ఎన్ ఇ ఎక్స్‌ఎల్ ఇడి డి ఆర్ ఎల్ లు దాని నిర్ధారిస్తూనే ఉన్నాయి ప్రత్యేక ఆకర్షణ. అద్భుతమైన న్యూ బాలెనో షార్క్ ఫిన్ యాంటెన్నాతో వస్తుంది, ఎన్ ఇ ఎక్స్ టెక్ తో అద్భుతమైన కొత్త బాలెనో పరిచయం చేయబడింది ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ సెగ్మెంట్ కస్టమర్‌లకు కొత్త స్థాయి డ్రైవింగ్ సౌలభ్యం మ భద్రత స్థాయి 2 ఎడిఎఎస్ ఒక రాడార్ కెమెరా అమర్చార్చి కొత్త కారునుపరిచయం చేశారు. ఇంటీరియల్ ఖరీదైన ద్యూయల్‌టోన్ కలిగిఉంది.లీటరుకు 23కిలోమీటర్ల మైలేజి ,సిఎన్‌జి కిలోకు 33.61 మైలేజీ ఉంటుందని తెలిపారు.




## లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన పలువురు ప్రతినిధులు

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** పంజాబ్ రాష్ట్ర సమాచార కమిషనర్ హర్‌ప్రీత్ సంధూ తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను బుధవారం లోక్ భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా హర్‌ప్రీత్ సంధూ పంజాబ్ రాష్ట్ర సమృద్ధమైన వ్యవసాయ వారసత్వాన్ని, చండీగఢ్ నగరంలోని విశిష్ట చారిత్రక వారసత్వాన్ని ప్రతిబింబించే తాను రచించిన పుస్తకాలను గవర్నర్‌కు అందజేశారు. అలాగే, భారత జాతీయ పక్షి నెమలిని ప్రతిబిం బించే 'ది ప్రైడ్ ఆఫ్ పీకాక్ – గ్లోరీ ఆఫ్ ఇం డియా' అనే తన విశిష్ట కళాకృతిని కూడా గవ ర్నర్‌కు బహూకరించారు. హర్‌ప్రీత్ సంధూ రూపొం దించిన కళాకృతిని గవర్నర్ ప్రశంసిస్తూ, భారతదేశ సహజ, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోత్స హించేందుకు చేస్తున్న కృషిని అభినందించారు.




హైదరాబాద్‌కు చెందిన మహిళా దక్షతా సమితి అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్, ఇతర ప్రతినిధులతో కలిసి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో కలిశారు.

కార్గిల్ యుద్ధ వీరుడు, ఆత్మహత్యల నివారణ ఉద్యమకారుడు గ్రూప్ కెప్టెన్ జి.జె. రావు (రిటైర్డ్), ఇతర ప్రతినిధులతో కలిసి గవర్నర్‌ను లోక్ భవన్‌లో కలిశారు.

సంస్కార భారతి – తెలంగాణ ప్రాంత్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.కె.వి. శర్మ, ఇతర ప్రతినిధులతో కలిసి గవర్నర్‌ను లోక్ భవన్‌లో కలిశారు.

బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో కలిసింది.

## అసెంబ్లీలో ఏలేటి వ్యాఖ్యలపై దుమారం: విరుచుకుపడ్డ మంత్రులు

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో అసెంబ్లీలో దుమారం రేగింది. సభలోలేని సభ్యులను సస్పెండ్ చేయడం బాధాకరమని అన్నారు.

సభ ఉల్లంఘన జరిగినప్పుడు బీజేపీ శాసనసభపక్ష నేతగా కొన్ని అంశాలను ప్రస్తావించాల్సిన అవసరం ఉందని అసెంబ్లీలో పేర్కొన్నారు. ఏ నియమ నిబంధనల ప్రకారంగా సస్పెండ్ చేశారని ప్రశ్నించారు. బీఏసీ లో చెప్పినట్లు సభ నడుపుతారా లేదా రాష్ట్రంలో అనేక సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 22ఏ పై ఎప్పుడూ చర్చిస్తారో చెప్పే వరకు సభలో మా ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలపై అధికార పార్టీ సభ్యులు మండిప డ్డారు. సభ ఔన్నత్యాన్ని కాపాడటం మనందరి బాధ్యతన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభ స్థానంలో ఉన్న వారి గౌరవాన్ని కాపాడేలా మా ట్లాడాలని హితువు పలికారు.

ఏ అంశంపైనైనా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న మంత్రి శ్రీధర్‌బాబు సభ కార్యక్రమాలను నిరంతరం అడ్డుకోవడం సమంజసమా అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నిం చారు. సభ సజావుగా సాగడం బీజేపీ సభ్యులకు ఇష్టం లేనట్లుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ సజావుగా జరగడం బీజేపీ సభ్యులకు ఇష్టం లేదన్న మంత్రి కోమటిరెడ్డి వెం కట్‌రెడ్డి సభ్య సమాజం తలదించుకునేలా స్పీకర్‌పై ఇష్టాను సారం మాట్లాడతారా అని నిలదీశారు. నిరసన కార్యక్రమంచేస్తుంటే శుద్ధి చేయడం మంచి పద్ధతా?అని ప్రశ్నించారు.

ఎర్రవల్లిలో దళితులు కా ర్యక్రమం చేసినచోట శుద్ధి చేయడాన్ని ఏమ నాలని?, ఖర్గే కూర్చున్న వేదికను ఎందుకు శుద్ధి చేశారో సమాధానం చెప్పాలని బీజేపీ సభ్యులను డిమాండ్ చేశారు.

## ఇది బిఆర్ఎస్ సస్పెన్షన్ కాదు..ప్రజా సమస్యలపై కాంగ్రెస్ విధించిన సస్పెన్షన్

### బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు9, ప్రభాతవార్త:** ఇది బిఆర్ఎస్ సస్పెన్షన్ కాదు.. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ విధించిన సస్పెన్షన్ అని బిఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్‌రావు ఎక్స్ వేదికగా మండపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు అంటే ప్రతిపక్షాన్ని టార్గెట్ చేయడం కాదు.. ప్రజల సమస్యలపై చర్చ జరగాలని, వాటికి పరిష్కారం చూపాలని అన్నారు. ప్రజలు తమ సమస్యలు మాట్లాడండి అంటుంటే...రేవంత్‌రెడ్డి మాత్రం బిఆర్ఎస్‌ను బయటకి పంపిండి అంటున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నియంతృత్వం ఎంత పెరిగితే, ప్రజాతిరుగుబాటు అంత పెరుగుతుంది అన్న విషయం రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలని అన్నారు. మూడు రోజులుగా అసెంబ్లీ సమావేశాలను తెలంగాణ ప్రజలు చూస్తున్నారని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఒక్క సమస్యపైనైనా చర్చ జరిగిందా.. ఒక్క ప్రభుత్వ విధానంపైనైనా సమాధానం చెప్పారా..? అని ప్రశ్నించారు. ప్రతిపక్షాన్ని వేధించడం, గొంతు నొక్కడం, బయటకు పంపించడం తప్పు.. ప్రజల సమస్యలపై ఈ ప్రభుత్వానికి పట్టింపు లేదని విమర్శించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా తమను బలవంతంగా బయటకు పంపించడం అప్రజాస్వామికం అని పేర్కొన్నారు.

## బిఆర్ఎస్ నాయకులు చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు మంత్రుల ఫిర్యాదు

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** బుధవారం సాయంత్రం లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను పలువురు మంత్రులు కలిశారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ తొలిరోజు లోపలికి ప్రవేశించే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు... స్పీకర్‌ను అవమానపర్చేవిధంగా మాట్లాడిన తీరును మంత్రులు గవర్నర్‌కు వివరించారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రబాకర్, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్ వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ,వెడ్మ బొజ్జు పటేల్ తదితరులు గవర్నర్‌ను కలిశారు.

బీఆర్ఎస్ పార్టీ దొర అహంకారంతో వ్యవహరిస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. శాసనసభ స్పీకర్, అతని తల్లిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు దూషించారని, దీన్ని నిరసిస్తూ కేసీఆర్ ఫామ్ హౌజ్ దగ్గర డప్పులతో దళితులు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం కేసీఆర్ దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ఈ రెండు ఘటనలపై డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో మంత్రులు,ఎమ్మెల్యేలమంతా గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. దళితులు ప్రజాస్వామ్యంగా నిరసన తెలిపితే కేసీఆర్ అవమానించారు, తన ఫామ్‌హౌస్ రోడ్డులో దళితులు నడిచారని కేసీఆర్ శుద్ధి చేయించారు. కేసీఆర్ చూపించిన అంటరానితనంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు స్పీకర్, స్పీకర్ తల్లిని కూడా దూషించారు. బీఆర్ఎస్ నేతలు చేసిన శుద్ధీకరణపై కేసీఆర్ ఇప్పటికైనా స్పందించాలని కోరారు.


**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION**

01. Tender Notice No.: Short Tender Notice

No.17/2026-27/GVMC/SE-Gwk/E.E-GWK Zone, Dt:08.09.2026 (07 days)

| | | | |
|---|---|---|---|
| 1 | Number of Works | : | 04 No's. |
| 2 | Value of Works | : | Rs. 265.90 Lakhs |
| 3 | Down Load Starting Date | : | 09.09.2026 @ 02.00 PM |
| 4 | Down load Ending date | : | 16.09.2026 @ 03.00 PM |

Note: Further details @ www.ape.procurement.gov.in
EE-Gwk or SE-Gwk (Contact No.9848933235)

sd/- For Commissioner

# కొత్త రుణాల సేకరణపై దృష్టి

- ఈ రెండు నెలల్లో రూ.12 వేల కోట్లు లక్ష్యం - 7.5 శాతం వడ్డీతో 6 నుండి 25 యేళ్లలో చెల్లింపు

- పాత రుణ మార్పిడికి తక్కువ వడ్డీకి మరో రూ.25 వేల కోట్లు - రిజర్వ్ బ్యాంక్‌కు ఆర్థిక శాఖ ప్రతిపాదనలు

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలు, పథకాలకు భారీగా నిధులు అవసరం కావడంతో కొత్త రుణాల సేకరణపై ఆర్థిక శాఖ దృష్టి సారించింది. ఈ నెలతో పాటు, జూన్‌తో కలిపి కొత్తగా రూ.12 వేల కోట్లు సేకరించాలని తాజాగా నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ బాండ్లను వేలానికి పెట్టాలని రిజర్వు బ్యాంకుకు పంపిన ప్రతిపాదనల్లో కోరింది. ఆర్థిక శాఖ అధికారవర్గాల వివరాలు ప్రకారం వీటి వేలం ద్వారా సమకూరిన మొత్తం రూ.12 వేల కోట్లను రాబోయే 6 నుంచి 25 ఏళ్లలో తిరిగి చెల్లిస్తామని తెలిపింది. వీటిని 7 శాతం నుంచి 7.5 శాతం వడ్డీకే తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో అధిక వడ్డీలకు తీసుకోవడం వల్ల వడ్డీ కిస్తీల భారం అధికమైనందువల్ల తక్కువ వడ్డీలకు వచ్చేవాటిపైనే ప్రధానంగా దృష్టిసారించింది. ఇక ప్రస్తుతం మెట్రో రైలు స్వాధీనం, రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు, ఆర్టీసీకి నిధులు సమకూర్చడం తదితర కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా డబ్బు అవసరం ఉంది. రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలకే రాబోయే 100 రోజుల్లో రూ.6,200 కోట్లకుపైగా కావాలని అంచనా వేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల వైద్య ఖర్చులన్నింటినీ ఆర్థిక శాఖ చెల్లిస్తోంది. మరో వైపు నెలకు రూ.700 కోట్ల నిధులను ఉద్యోగుల బిల్లులకు సర్దుబాటు చేస్తోంది. అలాగే మెట్రో మొదటి దశను రూ.15 వేల కోట్ల వ్యయంతో (అప్పుతో కలిపి) ఎల్అండ్‌టీ ఎంఆర్‌హెచ్‌ఎల్ నుంచి రాష్ట్రం ప్రభుత్వం తీసుకోడానికి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మొత్తంలో రూ.13 వేల కోట్ల రుణాలు, రూ.2 వేల కోట్ల ఈక్విటీ వాటా ఉంది. 100 శాతం ఈక్విటీ వాటాతో షేర్ పర్చేజ్ అగ్రిమెంట్ ద్వారా ప్రభుత్వం టేకోవర్ చేసుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐఆర్ఎఫ్‌సీ రుణం ఇవ్వగా మిగిలిన మొత్తాన్ని హెచ్ఎండీఏ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ద్వారా సమకూర్చనున్నారు. ఈ మొత్తం తక్షణం అందజేస్తేనే గడువులోగా లావాదేవీ ప్రక్రియ పూర్తవుతుందని ప్రభుత్వాన్ని హెచ్ఎంఆర్ఎల్ కోరింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ ఖజానాకు ఆదాయం మరింత పెంచడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఇదే సమయంలో ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ ఆర్థిక వనరుల అన్వేషణలో కీలకంగా వ్యవహరిస్తోంది. ఈ నెలాఖరు నుంచి భూముల రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచడం ద్వారా ఆదాయం సమకూరితే పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాత బకాయిల చెల్లింపులకు మరిన్ని నిధులు అందుబాటులోకి వస్తాయనేది ఆర్థిక శాఖ అంచనా. కాగా గతంలో అధిక వడ్డీకి తీసుకున్న రుణాలకు సంబంధించిన బకాయిలకు నెలనెలా కిస్తీల చెల్లింపుల భారం అధికంగా ఉన్నందు వల్ల వాటిని తక్కువ వడ్డీకి మార్చే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించింది. గతేడాది ఈ విధానంలో కొన్ని రుణాలు తీర్చినప్పటికీ ఈ సంవత్సరం కొత్తగా రూ.25 వేల కోట్లు ఇలా తక్కువ వడ్డీకి తీసుకోవాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. వీటితో గతంలో సేకరించిన అధిక వడ్డీ రుణాల బకాయిలను ఒకేసారి తీర్చేయాలని ప్రయత్నాలు చేస్తోంది. గతంలో 10 నుంచి 11 శాతం వరకూ వడ్డీ చెల్లించే ఒప్పందంతో రుణాలు తీసుకోగా ఇప్పుడు 7 నుంచి 7.5 శాతానికే సేకరించి వాటిని తీర్చేస్తోంది. ఈవిధంగా రూ.25 వేల కోట్లపై 3 శాతం వరకూ వడ్డీని తగ్గించుకోగలిగితే ఏటా కనీసం రూ.వెయ్యి కోట్ల దాకా కిస్తీల చెల్లింపుల భారంతగ్గుతుందని ఆర్థికశాఖ అంచనా వేస్తోంది.



చలో హైదరాబాద్ పేరుతో నిరసనకు బయల్దేరిన అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు

## అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతల డిమాండ్

చలో హైదరాబాద్ పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టిన అంగన్‌వాడీ నేతలు

ఇందిరాపార్కు చౌరస్తాలో అడ్డుకున్న పోలీసులు - నేతలు, ఉద్యోగులు అరెస్ట్

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** అసెంబ్లీ సమావేశాలలో అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియూ) ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, సిఐటియూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్‌లు డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ రాష్ట్రం నలుమూలలా ఉన్న అంగన్‌వాడి టీచర్లు, వర్కర్లతో కలసి ఛలో హైదరాబాద్ పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టేందుకు బయల్దేరిన వారిని పోలీసులు ఇందిరాపార్కు చౌరస్తాలో అడ్డుకున్నారు. దశల వారీగా ర్యాలీగా వచ్చిన అంగన్ వాడీలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుని వివిధ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్, యూనియన్ అధ్యక్షురాలు సునీత, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మిలు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడి టీచర్ల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ కేంద్రాలను రద్దు చేయాలని, వీటిని అంగన్‌వాడీలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు 18వేల రూపాయల వేతనం అమలుచేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధనకై ధర్నా చేపట్టిన అంగన్‌వాడీలకు అనుమతులు ఇవ్వకుండా అడ్డుకోవటం, అరెస్ట్ చేయటం అన్యాయమని, ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

వీఆర్ఏ, ఎజెసి ఆధ్వర్యంలో ధర్నా

మద్దతు తెలిపిన రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, దాసోజు శ్రవణ్, ఆర్.ఎస్.ప్రవీణ్



ధర్నాలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, దాసోజు శ్రవణ్, ఆర్ఎస్ ప్రవీణ్ తదితరులు

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** జీవో నెంబర్ 81, 85 ప్రకారం ప్రస్తుత వీఆర్ఏల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మద్దతు ఆర్.కృష్ణయ్యతో పాటు ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్, ముఠా జైసింహ, సిఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌లు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వీఆర్ఏలను వివిధ శాఖల్లో 16,758 మందికి ఉద్యోగాలు ఇచ్చి, సర్దుబాటు చేసిందని, 3, 797 మంది వీ ఆర్ఏల వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు అందించకపోవటంతో నిరుద్యోగులుగా మిగిలి పోయారని గుర్తు చేశారు. వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు వస్తాయనే ఆశతో తండ్రి ఉద్యోగం కోసం అన్నదమ్ములకు ఆస్థులు రాసిచ్చి, ఉద్యోగ వాటా క్రింద లక్షల రూపాయలు అప్పుచేసి తోబుట్టువులకు ఇచ్చారని, కానీ ఏళ్లు గడు స్తున్నా, వారసులకు ఉద్యోగాలు రాక పోవటంతో మానసిక వత్తిడికి గురై, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ఏలలో ఎక్కువ దళిత బలహీన వర్గాల వారే ఉన్నారని, వారి న్యాయమైన సమస్యను పరిష్కరించి, వారికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. జేఏసీ నేతలు మాట్లాడుతూ 61 సంవత్సరాల వయస్సు పైబడిన 3,797 మంది వీఆర్ఏల వారసులకు తండ్రి స్థానంలో ఉద్యోగ ఉత్వర్వులు ఇచ్చి, దళిత, బలహీన వర్గాలకు చెందిన వీఆర్ఏల కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియూ ఉపాధ్యక్షులు జే.మల్లిఖార్జున్, కాంట్రాక్ట్ ఔట్‌సోరినసంగ్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు జే.వెంకటేష్, జేఏసీ నేతలు రాజశేఖర్, వంగూరు రాములు, భరత్, హరీష్, సాగర్, శ్రీకాంత్, రవిసాగర్, నగేష్, బీసీ సంఘం నేతలు నీల వెంకటేష్ పాల్గొన్నారు.

## చేతబడి నెపంతో మహిళ దారుణ హత్య

నెల్కి వెంకటాపూర్‌లో కలకలం



**మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** చేతబడి చేస్తుందనే అనుమానంతో ఓ మహిళను గొడ్డలితో నరికి దారుణంగా హత్య చేసిన ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నెల్కి వెంకటాపూర్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. దండేపల్లి ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. నెల్కి వెంకటాపూర్ గ్రామానికి చెందిన సింగాతి లచ్చయ్య భార్య లక్ష్మి (45) ఇంట్లో ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన సింగాతి రమేష్ (37), అతని తల్లి రాంబాయి ఆమెపై గొడ్డలితో విచక్షణా రహితంగా దాడి చేశారు. తీవ్ర గాయాలపాలైన లక్ష్మి రక్తపు మడుగులో అక్కడికక్కడే కుప్పకూలింది. కేకలు విని అడ్డుకోవడానికి వచ్చిన గ్రామస్తులు కృష్ణమూర్తి, సుమలతలను పక్కకు నెట్టేసి నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న భర్త లచ్చయ్య ఇంటికి చేరుకునేసరికి లక్ష్మి ప్రాణాలు కోల్పోయింది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు.

## పెళ్లైన ఐదు నెలలకే యువతి అనుమానాస్పద మృతి

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** పెళ్లైన అయిదు నెలలకే ఒక యువతి అనుమానస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటు చేసుకొంది. నాగర్‌కర్నూల్ జిల్లా లట్టుపల్లి గ్రామానికి చెందిన నాగలక్ష్మికి మదగాని శేఖర్‌తో ఈ ఏడాది ఏప్రిల్‌లో వివాహమైంది. వివాహం అనంతరం వీరిద్దరూ బంజారాహిల్స్‌లోని సుఖ్‌దేవ్‌నగర్‌లో నివాసముంటున్నారు. వివాహమైన నెల రోజులకే శేఖర్ నాగలక్ష్మిని మానసికంగా, శారీరకంగా వేధించడం ప్రారంభించాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. పండుగల సమయంలో పుట్టింటికి వెళ్లకుండా అడ్డుకోవడంతో పాటు తరచూ గొడవపడేవాడని తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం నాగలక్ష్మిని నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు శేఖర్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. అనంతరం ఆమె ఉరివేసుకుని మృతి చెందినట్లు తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా మెడపై వాపు ఉన్నట్లు గుర్తించారు. భర్త వేధింపులు కారణంగానే మృతి చెందిందన్నారు.

## గచ్చిబౌలి అత్యాచారం నిందితుడికి 20 యేళ్ల జైలు

**గచ్చిబౌలి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త** గచ్చిబౌలిలో మూడేళ్ల క్రితం చోటుచేసుకున్న అత్యాచారం, ఫోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజేంద్రనగర్ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ ఫోక్సో కోర్టు జడ్జీ తీర్పునిచ్చారు. నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు 3వేల రూపాయల జరిమానా, బాధితురాలికి 3లక్షల పరిహారం అందించాలని తీర్పు వెల్లడించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో గత మూడేళ్ల క్రితం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా మాచవరంకు చెందిన మీనగళ్ల వేణుగోపాల్(42) నగరానికి వచ్చి కొండాపూర్ రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటూ సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేసేవాడు. తాను నివాసం ఉంటున్న ఇంటి సమీపంలోనే ఉంటున్న ఓ మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి నమ్మించిన వేణుగోపాల్ అత్యాచారానికి ఒడిగట్టాడు. ఈ విషయమై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు 642/2023 నమోదు కాగా, నాటి నుంచి కేసు కోర్టులో నడుస్తుంది. నిందితుడి మీద ఫోక్సో కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును సైతం పోలీసులు నమోదు చేశారు. కాగా రాజేంద్రనగర్ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ ఫోక్సో కోర్టు జడ్జీ టి.శ్రీనివాస్ ఈ కేసులో తాజాగా సంచలన తీర్పు వెల్లడించారు. మైనర్ బాలిక మీద అత్యాచారానికి ఒడిగట్టిన నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జీ టి.శ్రీనివాస్ బుధవారం తీర్పు వెల్లడించారు. నిందితుడికి జైలు శిక్షతో పాటు 3వేల రూపాయల జరిమానా, బాధితురాలికి 3లక్షల పరిహారం అందించాలని తీర్పునిచ్చారు.

## పోలీస్‌స్టేషన్ ఎదుట యువకుడి పెట్రోల్ హైడ్రామా విషాదాంతం!

ప్రేమ వ్యవహారం బెడిసికొట్టడంతో మనస్తాపం

రెండు రోజుల పాటు మృత్యువుతో పోరాడి కన్నుమూత

**రామాయంపేట, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** యువతిని పెళ్లి చేసుకోవాలంటూ వేధిస్తున్నాడని ఫిర్యాదు రావడంతో పోలీసుల విచారణకు హాజరైన ఓ యువకుడు పోలీస్‌స్టేషన్ ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న ఘటనలో విషాదం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన యువకుడు గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటన రామాయంపేటలో తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేట పట్టణానికి చెందిన దుర్గాప్రసాద్ (సోను) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. పట్టణానికి చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకోవాలంటూ గత కొన్ని నెలలుగా వేధిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై యువతి గత మే నెలలో హైదరాబాద్‌లోని అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో షీటీమ్‌కు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయినా వేధింపులు ఆగకపోవడంతో యువతి కుటీంబీకులు రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన దుర్గాప్రసాద్.. తనపై కేసు నమోదు కావడంతో మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. పోలీస్‌స్టేషన్ ఎదుటకు వచ్చిన అతడు ఒక్కసారిగా ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే మంటలను అదుపులోకి తెచ్చి దుర్గాప్రసాద్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. రెండు రోజుల పాటు అక్కడ చికిత్స పొందిన ఆయన పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులు, యువతి చేసిన ఫిర్యాదు, పోలీసుల విచారణ తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు సీఐ సైదా నాయక్ తెలిపారు.



## చైనా వైఖరిపై ఫిలిప్పీన్స్ రక్షణమంత్రి ధ్వజం

**సియోల్, సెప్టెంబరు 9:** అంతర్జాతీయ వేదికపై చైనా తీరుపై ఫిలిప్పీన్స్ రక్షణ మంత్రి గిల్బర్టో సి. టియోడోరో తీవ్రంగా మండిపడ్డారు. దక్షిణ చైనా సముద్రంపై బీజింగ్ వైఖరిని వివరిస్తూ ఓ వ్యక్తి తనకు నోట్ అందించడాన్ని ఆయన బహిరంగంగానే ప్రశ్నించారు. ఇది బెదిరింపు, దౌర్జన్యం, దాడి చేయడంతో సమానమని వ్యాఖ్యానించారు. దక్షిణ కొరియాలో జరుగుతున్న సియోల్ డిఫెన్స్ డైలాగ్ 2026లో టియోడోరో ప్రసంగిస్తున్నారు. ఆ సమయంలో తెల్ల కోటు ధరించిన ఓ వ్యక్తి ఆయన వద్దకు వచ్చి టేబుల్‌పై ఓ కాగితం పెట్టాడు. అది చైనా తరఫున వచ్చిన నోట్ అని భావించిన టియోడోరో సభను ఉద్దేశించి దీన్ని చదవాలా అని అడిగారు.

## కన్నడ మీడియం స్కూలుకు సాయం అందించాలి

## రక్తంతో ప్రభుత్వానికి లేఖరాసిన టీచర్



**శివమొగ్గ, సెప్టెంబరు 9:** కన్నడ మాధ్యమ పాఠశాలలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరుతూ కర్ణాటకలో ఓ ఉపాధ్యాయుడు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఏకంగా తన రక్తంతోనే ప్రభుత్వానికి లేఖ రాశారు. 1995 తర్వాత ప్రారంభమైన కన్నడ మాధ్యమ పాఠశాలలను గ్రాంట్‌ఇన్‌ఎయిడ్ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. శివమొగ్గ జిల్లా శికారిపురలోని సాలేశ్వర విద్యా సంస్థలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ప్రశాంత్ ఈ లేఖను రాశారు. బుధవారం నిర్వహించనున్న ప్రజా సేవా ఆందోళనలో విద్యాశాఖ మంత్రి మధు బంగారప్పకు ఈ లేఖను అందజేయనున్నారు. లేఖ రాసేందుకు ప్రశాంత్ ముందుగా తన చేతి నుంచి సిరంజితో రక్తం తీసుకున్నారు. సూది తొలగించిన తర్వాత ఆ రక్తాన్ని కాగితంపై చిందించారు. అనంతరం అందులో వేళ్లను ముంచి లేఖను రాశారు. తమ పాఠశాల ప్రస్తుతం మూతపడే పరిస్థితికి చేరుకుందని ప్రశాంత్ తెలిపారు. ఇలాంటి సంస్థలను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే ఆర్థిక సాయం అందించాలని కోరారు. తమ విద్యాసంస్థ 31 ఏళ్లుగా కొనసాగుతోందని చెప్పారు. అయితే గతంలో గ్రాంట్ కోసం పరిశీలించినప్పుడు కేవలం ఒక్క రోజు వ్యవధి తక్కువగా ఉండటంతో అర్హత కోల్పోయిందని వివరించారు. 1995 తర్వాత ఏర్పాటైన అన్ని కన్నడ మాధ్యమ పాఠశాలలను గ్రాంట్‌ఇన్‌ఎయిడ్ పథకంలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.

## లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన ఇంటర్మీడియట్ అధికారి



ఎసిబికి పట్టుబడ్డ డిఐఓ గోవింద్ రామ్

**సంగారెడ్డి బ్యూరో సెప్టెంబర్ 9, ప్రభాత వార్త:** జిల్లా కేంద్రంలో బాధితుల నుంచి లంచం తీసుకుంటూ జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవింద రామ రెడ్ రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. కాలేజీకి అనుకూలంగా రిపోర్ట్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసిన అధికారి సంగారెడ్డి జిల్లాలోని ఓ కాలేజీకి కొద్ది రోజుల క్రితమే జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరాం తనిఖీకి వెళ్లారు.అయితే అక్కడ చిన్న చిన్న పొరపాట్లు,ఇతర అంశాలను పరిశీలించిన ఆయన వాటిని సరిచేసి కాలేజీకి అనుకూలంగా రిపోర్టు ఇవ్వాలంటే తనకి రూ.50 వేలు లంచంగా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశాడు.ఈవిషయంలో చేసేది లేక సదరు కాలేజీ యాజమాన్యం ముందుగా గోవిందరాంకు రూ.30 వేలు ఇచ్చారు.మిగతా డబ్బు కూడా ఇవ్వాలని ఒత్తిడి చేయగా వారు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఇంటర్మీడియట్ అధికారి అయిన గోవిందరాం తన ఆఫీసులో మిగతా రూ.20 వేల డబ్బులు బాధితుల నుంచి లంచంగా తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈమేరకు అతనిపై అధికారులు కేసు నమోదు చేసి మిగతా విషయాలు దర్యాప్తు చేస్తున్నారు.ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ సుదర్శన్,ఇన్స్పెక్టర్లు వెంకటేశ్వర్లు,రమేష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ మాట్లాడుతూ ఏ అధికారి అయినా లంచం ఇవ్వమంటే మాకు సమాచారం అందించాలని తెలిపారు.

## మిలటరీ ఆయుధాల చోరీలో బిగ్ ట్విస్ట్.. మూడు నెలలుగా సాగిన దొంగతనం

తుపాకులతో పాటు రెండు వేల బుల్లెట్లు మాయం

ఫిర్యాదు అంది పది రోజులు కావస్తున్నా కానరాని పురోగతి

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలోని ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్ (ఏఓసి) ప్రాంగణంలో గల మద్రాస్ రిజిమెంట్ ఆయుధ గోదాములో వెలుగు చూసిన ఆయుధాల చోరీ కేసులో బిగ్ ట్విస్ట్ వెలుగు చూసింది. ఆయుధాల చోరీ అంతకు ముందు రోజు జరిగింది కాదని మూడు నెలలుగా సాగిన వ్యవహారమని తాజాగా వెలుగు చూసింది. ఆయుధాల చోరీతో పాటు రెండు వేలకు పైగా బు ల్లెట్లు దొంగతనం జరిగిందని పోలీసులు, మిలటరీ అధికారుల విచారణలో వెలుగు చూసినట్లు సమాచారం. మరోవైపు ఈ ఘటన వెలుగుచూ సి పది రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేక పోవడం సంచలనంగా మారింది.

రక్షణ శాఖలో దక్షిణాది ప్రాంతంలో పురాతనమైన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో మిలటరీ సాయుధ గోదాము నుంచి ఆయుధాలు చోరీ అవడం దేశ వ్యాప్తంగా సంచలనం రేపగా దీనిపై పోలీసు, మిలటరీ విభాగాల విచారణ ముందుకు సాగడం లేదు. శిక్షణా కేంద్రాలు, ఆ యుధాల పరిశోధనా కేంద్రాలు వుండే సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో పోరాట దళంలో అగ్రగామి విభాగంగా పేరొందిన మద్రాస్ రిజిమెంట్ సాయుధ గోదాము నుంచి నాలుగు ఎకె 47, ఒక ఇన్సాస్ తుపాకి, ఆరు పిస్టళ్లు, మరికొంత మందుగుండు సామాగ్రి చోరీ అయినట్లు గ త నెల 30వ తేదీన బొల్లారం పోలీసులకు లెఫ్టినెంట్ కల్నల్ మయాంక్ గోవిత్రికర్ బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. దీని పై బిఎన్ఎస్ 331, 305 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ చేబట్టడం విదితమే. ఈ ఉదంతం తరువాత అటు పోలీసులు ఇటు మిల టరీ అధికారులు భిన్నకోణాల్లో విచారించినా ఎలాంటి పురోగతి కనిపించలేదు. ఇదే సమయంలో మిలటరీ ఫైరింగ్ రేంజి పక్కన ఎలక్ట్రానిక్ డి టోనేటర్లు లభ్యమవగా ఇవి రక్షణ శాఖకు సంబంధించినవి కావని, ప్రైవేటువని పోలీసులు తెలిపారు. మరోవైపు ఆయుధాల చోరీపై అనేక అనుమానాలు వెలుగు చూడడం, వీటిపై పోలీసులు, మిలటరీ అధికారులు విచారించినా ఎలాంటి ముందడుగు పడలేదు.

కాగా దీనిపై తాజాగా కొ త్త సమాచారం వెలుగు చూసింది. ఆయుధాల చోరీ మూడు నెలలుగా సాగుతోందని మిలటరీ, పోలీసు అధికారులకు సమాచారం అందినట్లు తెలిసింది. కొందరు వ్యక్తులు విడతల వారిగా తుపాకులతో పాటు రెండు వేలకు పైగా బుల్లెట్లు చోరీ అయినట్లు సమాచారం అందినట్లు తెలిసింది. దీనిపై పోలీసులు,


మిలటరీ అధికారులు అంతర్గంగా విచారణ చేబట్టినట్లు తెలిసింది.

# ఉప ఎన్నికల బరిలోకి మమత!

**కోల్‌కత్తా,సెప్టెంబరు 9:** దేశంలో ఐదు అసెంబ్లీ స్థానాలకు ఒక లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. వీటిలో పశ్చిమ బెంగాల్, తమిళనాడులో రెండేసి స్థానాలు, పుదుచ్చేరిలో ఒకటి ఉన్నాయి. ప్రద్యుత్ బోర్డోలోయ్ రాజీనామాతో ఖాళీ అయిన అస్సాంలోని నాగావ్ లోక్‌సభ స్థానానికి కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాలన్నింటికీ సెప్టెంబర్ 16వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసుకునే అవకాశం ఉంది. అక్టోబర్ 6వ తేదీన పోలింగ్ జరగనుంది. పశ్చిమ బెంగాల్‌లోని రెజినగర్, నందిగ్రామ్ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరుగుతుండటంతో అందరి దృష్టి వాటిపైనే ఉంది. నౌడా నుంచి కూడా గెలిచిన హుమాయున్ కబీర్ రెజినగర్ స్థానాన్ని ఖాళీ చేశారు. మరోవైపు ముఖ్యమంత్రి సువేందు అధికారి తన భవానిపూర్ స్థానాన్ని ఉంచుకుని నందిగ్రామ్ స్థానాన్ని వదులుకున్నారు. ఈ కారణంగానే రెజినగర్, నందిగ్రామ్‌లలో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి.

ప్రస్తుతం కోల్‌కతాలో అత్యంత చర్చనీయాంశం ఏమిటంటే మమతా బెనర్జీ ఈ రెండు సీట్లలో దేని నుంచైనా పోటీ చేస్తారా లేదా అన్నది చర్చించుకుంటున్నారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జరిగిన రాజకీయ పరిణామాలను, అసెంబ్లీలో గానీ, లోక్‌సభలో గానీ మమతా బెనర్జీ పార్టీని విచ్ఛిన్నం చేసిన తీరును దృష్టిలో ఉంచుకుని.. మమత అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసి సభలోకి ప్రవేశించాలని చాలా మంది నిపుణులు భావిస్తున్నారు. ఒకవేళ మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్ శాసనసభ సభ్యురాలిగా ఎన్నికైతే ఆమె సభలో ప్రస్తుత సమస్యలను సమర్థవంతంగా లేవనెత్తగలరని అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా మమతా బెనర్జీ ఎమ్మెల్యే అయితే.. ఆమె ప్రతిపక్ష నాయకురాలుగా కూడా మారి పార్టీని కాపాడుకోగలరు. మమతా బెనర్జీ వీధి, నిరసన రాజకీయాలకు ప్రసిద్ధి చెందినప్పటికీ అసెంబ్లీలో ఉండటం ఆమెను మరింత ప్రభావవంతంగా మార్చగలదు. ఇప్పుడు అతిపెద్ద ప్రశ్న ఏమిటంటే.. మమతా బెనర్జీకి ఏ సీటు అత్యంత సురక్షితమైనదనే గణాంకాలను పరిశీలిస్తే మమతా బెనర్జీకి నందిగ్రామ్ అత్యంత సురక్షితమైనదిగా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి అభ్యర్థి అయినప్పటికీ సువేందు అధికారి నందిగ్రామ్‌లో కేవలం 9,665 ఓట్ల తేడాతో గెలిచారు. దీంతో మమతా బెనర్జీ ఇక్కడ నుంచి పోటీ చేస్తే ఆమెకు విజయం సులభం అవుతుందని భావిస్తున్నారు.

వాస్తవానికి 2021లోనే నందిగ్రామ్‌లో మమతా బెనర్జీసువేందు అధికారిల మధ్య పోటీ జరిగింది. అప్పుడు సువేందు 1,956 ఓట్ల తేడాతో మమతా బెనర్జీని ఓడించారు. ఇక రెజినగర్ సీటు విషయానికి వస్తే ఇది ముర్షిదాబాద్ జిల్లాలోని బహారంపూర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన అధిర్ రంజన్ చౌదరి పలుమార్లు పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. రెజినగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 65 శాతం ముస్లిం జనాభా



ఉంది. ఇక్కడి నుంచి పోటీ చేయడం పశ్చిమ బెంగాల్‌లోని మైనారిటీలకు సానుకూల సందేశాన్ని పంపుతుంది. ఈ రెండు సీట్లలో జరిగే ఉప ఎన్నికల కోసం మమతా బెనర్జీ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలని నిపుణులు కూడా భావిస్తున్నారు.

దీంతో రెజినగర్ సీటు తృణమూల్‌కు సులభతరం కాగా నందిగ్రామ్ సీటును అదే ప్రాంతానికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సుభంకర్ సర్కార్‌కు వదిలేస్తే ఈజీగా గెలవవచ్చని భావిస్తున్నారు. అయితే మమతా బెనర్జీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నడూ ఎన్నికల్లో పోటీ చేయలేదనేది కూడా వాస్తవం. 2011లో ముఖ్యమంత్రి అయిన తర్వాత సుబ్రతా బక్షి ఆమె కోసం ఆ సీటును ఖాళీ చేశారు.



# ఇ-ఫాస్టింగ్ ఇలా చేస్తే..

ఆ మధ్య మధ్యప్రదేశ్ బేగంగంజ్ ప్రాంతంలో కొందరు జైనులు.. పర్యూషణ్ పర్వ్ సందర్భంగా ఆ రోజు డిజిటల్ ఫాస్టింగ్ చేశారు. ఆధ్మాత్మిక భావనలో గడిపేశారు. ఆత్మశుద్ధి చేసుకోగలగడం, ఆత్మ పరిశీలనకు అవకాశం కలగడంతోపాటు ఆధ్యాత్మికంగా తమను తాము మెరుగుపర్చుకోవడానికి అవకాశముంటుందని ఈ ప్రయోగం చేశారట.

కొన్ని గంటలు లేదా ఓరోజు పూర్తిగా ఎలక్ట్రానిక్ వస్తువులు, గ్యాడ్జెట్లకు దూరంగా ఉండటమే ఈ-ఫాస్టింగ్! దీనివల్ల ఒత్తిడి అదుపులో ఉంటుంది. అశాంతి ఆమడ దూరం పారిపోతుంది. అందుకే, నెలలో కనీసం రెండు రోజులైనా దీన్నిపాటించాలంటున్నారు నిపుణులు. ఈ ఫాస్టింగ్‌కు అలవాటు పడటం అంత సులువేం కాదు. ముందు మీ రోజువారీ అవసరాలేంటి? ఎలక్టానిక్ వస్తువులైన ఫోన్, ల్యాప్‌టాప్, స్మార్ట్ వాచ్.. ఇలా ఏదీ లేకుండా ఉండగలమా లేదా?అన్నది గమనించుకోండి. దానికి కొన్ని రోజుల ముందు నుంచే చిన్నగా ఒక్కో అలవాటునీ తప్పించుకోండి. ఉదయం నిద్ర లేవడానికి గడియారంలోనే అలారం పెట్టండి. ఫోన్‌లో కాలక్షేపానికి వినియోగించే అనవసరమైనయాప్స్‌ను తొలగించండి. సామాజిక మాధ్యమ ఖాతాలను సైన్‌అవుట్ చేసేయండి. నిద్రలేచిన వెంటనే ఫోన్ లేకుండా.. ఆరుబయట అందాలను ఆస్వాదించొచ్చు. నులివెచ్చని సూర్యోదయాన్ని చూస్తూ కాఫీ తాగుతూ ఉల్లాసంగా గడిపేయొచ్చు. చిన్న చిన్న స్ట్రెచ్‌లు, నడక, యోగాసనాలుప్రయత్నిస్తూ శరీరాన్ని దృఢంగా ఉంచుకోవచ్చు. ఆపై రోజువారీ ప్రణాళిక చేసుకోవడం, సకాలంలో పనులు పూర్తిచేయడం వంటివన్నీ చకచకా పూర్తయిపోతాయి. పత్రికలు, మ్యాగజీన్‌లు చదవండి. చుట్టుపక్కల వారితో మాట్లాడండి. ఇవన్నీ మీకో కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తాయి. అదీ లేదంటే ఆసక్తి ఉన్న మరో అంశంపై దృష్టిపెట్టండి. విరామమో, విశ్రాంతో అంటూ.. గ్యాడ్జెట్స్‌తో గడిపేసిన మీరు కుటుంబానికి తగిన సమయం కేటాయించి ఉండకపోవచ్చు. ఇందుకు ఈ టైమ్‌ని వాడండి. కలిసి భోజనం చేయండి. అంతా కలిసి ఆటలాడండి. ఇవన్నీ మీలో ఆందోళనల్ని దూరం చేస్తాయి. ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి. నిద్రలేమి సమస్యను తగ్గించి మానసిక ప్రశాంతతను అందిస్తాయి. □

# పసుపు మరకలా ?




పండుగలు, వ్రతాల మాసం. వేడుకలైనా పసుపు, కుంకుమల మరకలు. ఈ పసుపు, గంధం మరకలు మరీనూ! ఓ పట్టాన వదలవు. మీకూ అదే సమస్యా? ఇవి ప్రయత్నించి చూడండి. పసుపు మరక కడిగితే విస్తరిస్తుంది. సబ్బు పెడితే ఎర్రగా మారుతుంది. రెండు తలనొప్పి తెచ్చేవే అందుకే దాన్ని జాగ్రత్తగా శుభ్రం చేయాలి. ముందు పసుపు అంటిన ప్రాంతాన్ని నీటితో కడగండి. వేడి నీటి సమస్యలను మరింత జటిలం చేస్తుంది. కాబట్టి, చల్లటివే మేలు. ఆపై కాస్త బేకింగ్ సోడా తీసుకుని, దానికి తగినన్ని నీళ్ల కలిపి మందమైన పేస్ట్‌గా చేయాలి. ఆ మిశ్రమాన్ని మరక ఉన్నచోట రాయాలి. 20 నిమి షాలు పక్కనపెట్టేయాలి. ఆపై చల్లటి నీటితో ఉతికేయడమే. మరక ఇంకా కనిపిస్తే మళ్లీ ఈ ప్రక్రియను పునరావృతం చేయాలి. లేదంటే చల్లటి నీటితో కడిగాక లిక్విడ్ డిష్వాష్ను వేసి, వేళ్లతో బాగా రుద్దాలి. దాన్ని పది నిమిషాలు పక్కన పెట్టి, ఆపై నీటితో కడిగేసిన ఫలితం ఉంటుందట. లేదంటే నీళ్లతో కడిగాక దాన్ని నేరుగా ఎండలోనైనా పెట్టొచ్చట. పసుపులోని కర్క్యుమిన్ రేడియేషన్కి వస్తోంది. పసుపుతో పిగ్మెంటేషన్ మాయమవు తుంది. లిక్విడ్ డిష్వాష్ చిట్కా గంధానికి కూడా పని చేస్తుంది. గంధం మరక అంటిన చోట నిమ్మ చెక్కతో రుద్ది చూడండి. లేదంటే కొన్నినీళ్లకి వినెగర్ చేర్చి, ఆ నీళ్లతో కడిగిన ఫలితం ఉంటుంది. కాసేపు పచ్చిపాలల్లో నానబెట్టి, తరవాత ఉతికినా గంధం, కుంకుమ మరకలు పోతాయి. □

**చిట్కా:** ✦ మిక్సీలో ఎండుద్రాక్ష వేసేటపుడు కొద్దిగా నిమ్మరసం కలిపితే ద్రాక్షలు బ్లేడ్‌కు అంటుకోకుండా వుంటాయి. ✦. కొత్తిమీర పొడికి కొద్దిగా ఉప్పు నిల్వవుంచితే ఎక్కువకాలం తాజాగా వుంటుంది. ✦ ఆమ్లేట్ లావుగా రావాలంటే సొన గిలకొట్టాక కొద్దిగా నీరు కలపాలి. ✦. ఉల్లి పాయలు తరిగేందుకు అరగంట ముందు వాటని పాలథిన్ కవర్లోవేసి ఫ్రిజ్‌లో పెడితే తరిగేటప్పుడు కళ్ళుముండవు. ✦.ఎండుకొబ్బరిని సులభంగా తురమాలంటే దానిపై కొద్దిగా నీళ్ల చల్లి ఫ్రిజ్‌లో ఉంచాలి. □



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**వ్యథ**

# గతం కాదు, భవిష్యత్తు చూడండి !

**ప్రశ్న:** నాకు మగవాళ్లంటేనే నమ్మకం పోయింది. నా తండ్రి, ప్రేమించిన వ్యక్తి, పెళ్లి చేసుకున్న భర్తను చూసిన తరువాత సమాజం పట్ల నమ్మకం పోయింది. మా నాన్న స్వార్థపరుడు. దురాశతో నా మెడలు వంచి ఒక శాడిస్టుకి ఇచ్చి పెళ్లి చేశాడు. శాడిస్టు అయిన అతనితో వేగలేక పెళ్లయిన ఏడాదికే ఇల్లు వదిలి వెళ్లిపోయాను. తరువాత కేసు పెట్టాను. అతను పెద్దల సమక్షంలో విడాకులు తీసుకుని విడిపోయాం. తర్వాత ఒక వ్యక్తి ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి నేను దాచుకున్న డబ్బు తీసుకుని జల్సాలు చేసుకున్నాడు. అతని వ్యవహారం బయటపడటంతో ప్రేమకు స్వస్తి చెప్పి చీటింగ్ కేసు పెట్టాను. పోలీసులు అతని వద్ద లంచాలు తీసుకుని కేసును నీరుగార్చారు. నేను ఎంబీఏ చదివి ఒక కంపెనీ లో ఉన్నత స్థాయి ఉద్యోగం చేస్తున్నాను. నెలకు లక్షకు పైగా జీతం వస్తుంది. వయస్సు 34 ఏళ్ల కావస్తోంది. ఒకప్పుడు చక్కని భర్త, మంచి పిల్లలు, అంద మైన కుటుంబం అంటూ కలలు కనేదానిని. ఈ అనుభవాలతో ప్రేమ, పెళ్లి అంటేనే అసహ్యం వేస్తోంది. అయితే తెలియని శూన్యత మనసును వెంటాడు తోంది. డబ్బు ఉన్నా మనసుకు శాంతి దొరకడం లేదు. చురుకు దనం తగ్గి పోయింది. నిత్యం మనసు కల్లోలంగా ఉంటోంది. నిద్ర పట్టడం లేదు. ఈ దశలో అన్ని సమస్యలకు దూరంగా ఉండేందుకు తగిన సలహా ఇవ్వండి.- **సరళ (పేరు మార్చాం), విశాఖపట్నం**



**జవాబు:** అమ్మా.. గతాన్ని చూసి కుమిలిపోవడం మానండి. మంచి భవిష్యత్తు కోసం ఆలోచించండి. మీరు ఎదుర్కొన్న చేదు అనుభవాల వల్ల పురుషులపైనా, ప్రేమపైనా, సమాజంపైనా నమ్మకం కోల్పోవడం సహజమే. కానీ కొందరి చెడు ప్రవర్తనను మొత్తం సమాజానికి ఆపాదించడం మంచిది కాదు. మీరు బలహీనురాలు కాదు.. గాయపడిన బలమైన మహిళ మాత్రమే. ఆర్థికంగా స్వతంత్రంగా నిలబడ గలిగిన మీ సామర్థ్యమే మీ బలం. ప్రస్తుతం ప్రేమ, పెళ్లి గురించి ఎలాంటి తొందరపాటు నిర్ణయం తీసుకోకండి. కొంతకాలం మీకు మీరే సమయం కేటాయించండి. మనసుకు విశ్రాంతి ఇవ్వండి. ప్రతిరోజూ నడక, యోగా లేదా ధ్యానం అలవాటు చేసుకోండి. క్రమబద్ధమైన నిద్రకు ప్రాధాన్యత ఇవ్వండి. నమ్మకమైన స్నేహితులతో మనసు విప్పి మాట్లాడండి. గతాన్ని పదేపదే గుర్తు చేసుకోవడం మాని, కొత్త లక్ష్యాలను వెదకండి. డబ్బు భద్రతను ఇస్తుంది కానీ మానసిక ప్రశాంతతను కొనలేం. మీకు ఇప్పుడు కావాల్సింది కొత్త ప్రేమ కాదు.. మానసిక ప్రశాంతత. నిద్రలేమి, ఆందోళన, చురుకుదనం తగ్గడం కొనసాగితే నిపుణులను సంప్రదించండి. సైకాలజిస్ట్ వద్ద కౌన్సెలింగ్ తీసుకోండి. జీవనశైలిని మార్చుకోండి. సమాజం పట్ల మీ దృష్టి కోణాన్ని మార్చుకోండి. కొందరిని చూసి అందరూ అలాగే ఉంటారని అను కోకండి. ఎంబీఏ చేసిన మీరు శాస్త్రీయంగా నిర్ణయాలు తీసుకోవడం, సమస్యలను పరిష్కరించడం, కొత్త లక్ష్యాలను ఎంచుకోవడంపై దృష్టి పెట్టండి. □

# భక్తజన రక్షకుడే భగవంతుడు

భగవంతుడు తన భక్తులను ఎప్పుడూ ఓ కంట కని పెట్టుకుంటూ ఉంటాడు. ధర్మబద్ధమైన .. న్యాయ బద్ధమైన వారి అవసరాలను తీరుస్తూ, ఆపదల నుంచి .. ప్రమాదాల నుంచి వాళ్లని కాపాడుతూ ఉంటాడు. సాధు జీవనాన్ని గడిపే తన భక్తులకి హాని తలపెట్టడానికి ఎవరు ప్రయత్నించినా ఆయన ఎంతమాత్రం సహించడు. అందుకు ఉదాహరణగా విష్ణుభక్తుడైన అంబరీషుడి జీవితంలోని ఒక సంఘటన కనిపిస్తుంది. ప్రతి ఏడాదిలానే ఆ ఏడాది కూడా అంబరీషుడు 'ద్వాదశీ వ్రతం' ఆచరిస్తాడు. ఈ వ్రతం ఆచరించేవారు ఏకాదశి రోజున ఉపవాసం ఉండి .. ద్వాదశి ఘడియలు వచ్చిన తరువాతనే భోజనం చేయాలి. ఆ వ్రతాన్ని ఆయన పూర్తిచేస్తుండగా దూర్వాసుడు అక్కడికి వస్తాడు. త్వరగా స్నానం చేసి తమ ఆతిథ్యం స్వీకరించవలసిందిగా దూర్వాసుడిని అంబరీషుడు కోరతాడు. నదీ స్నానానికి వెళ్లిన దూర్వాసుడు ఎంతకీ రాకపోవడంతో, ద్వాదశీ ఘడియలు మించిపోతున్నాయనే ఉద్దేశంతో వ్రతభంగం కాకుండా అంబరీషుడు కొంచెం నీరు మాత్రం తీసుకుంటాడు. అంతలో అక్కడికి వచ్చిన దూర్వాసుడు నువ్వు సేవించినది జలమే అయినా .. అది భోజనంతో సమానమే అంటూ ఆగ్రహిస్తాడు. తనని భోజనానికి పిలిచి అవమానపరి చావంటూ ఎడమకాలుతో తన్ని .. పది నీచ జన్మలు ఎత్తమని అంబరీషుడిని శపిస్తాడు. క్షమించమని అంబరీషుడు అంటున్నా వినిపించుకోకుండా మరో శాపం ఇవ్వడానికి సిద్ధమవుతాడు. అప్పుడు తన భక్తుడిని రక్షించుకోవడానికి శ్రీమహావిష్ణువు 'సుదర్శన చక్రం' వదులుతాడు. సుదర్శన చక్రం బారి నుంచి తనని రక్షించే శక్తి ఎవరికీ లేదని తెలిసిన దూర్వాసుడు, శ్రీమహావిష్ణువు పాదాలనే ఆశ్రయిస్తాడు. అంబరీషుడినే శరణు వేడుకోమని స్వామి చెప్పడంతో, దూర్వాసుడు అక్కడికే పరిగెడతాడు. అప్పుడు అంబరీషుడు .. దూర్వాసుడిని మన్నించి వదిలేయమని కోరడంతో సుదర్శన చక్రం శాంతిస్తుంది.

# ఉలవల సూప్..



**పశువులకు దాణాగా వాడే ఉత్పత్తులు మనకూ ఎంతో ఆరోగ్యకరమైనదే.** కానీ, పోషకాలు పుష్కలంగా ఉండే ఈ సూపర్‌ఫుడ్‌తో చాట్‌లు, వడలు.. వంటి మరెన్నో రకాల వంటకాలనూ చేసుకోవచ్చు. ఉలవల్లో సాల్యు బుల్ ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఈ గింజల్ని డైట్‌లో చేర్చుకోవడం వల్ల మలబద్ధకం, గ్యాస్‌వంటి జీర్ణ సంబంధిత సమస్యలూ ఎదురు కావు. ఆకలినీ పెంచుతాయి. అధికబరువునీ నియంత్రి స్తాయి. పైగా వీటిల్లో గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల రక్తపోటు, చక్కెర వ్యాధి అదుపులో ఉంటాయి.

✦ ఉలవల్ని, కొత్త బియ్యాన్ని సమానంగా తీసు కుని జావ చేసుకుని తాగితే కాల్షియం లభిస్తుంది. ఎముకలకు కండరా లకు తక్షణ శక్తి లభిస్తుంది. అలానే, వీటికి యాంటీ మైక్రోబియల్ లక్షణాలు ఉండటం వల్ల గాయాలు త్వరగా మానతాయి.

✦ ఈ గింజల్లోని ఫెనోలిక్ సమ్మేళనాలు కొలెస్ట్రాల్‌ని కరిగిస్తే, ఇవి యాంటీ లిథోజెనిక్‌గా పనిచేయడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలానే ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్ వంటివాటితో పాటు బి1,బి2, బి6, సి విటమిన్లు సమృద్ధిగా లభిస్తాయి. దీనివల్ల మాంసాహారానికి సమానంగా ప్రొటీన్ కూడా దొరుకుతుంది. ఇక, రక్తహీనతతో, ఎముకల బలహీనతతో బాధపడే మహిళలు, చిన్నారులు రోజూ సూప్‌లా తాగితే సరి. సమస్యలు తగ్గుముఖం పడతాయి. □

## 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' అందమైన ప్రయాణం: ఆనంద్ దేవరకొండ



**ఎపిక్ సినిమా ఎలా ఉండబోతుంది?**
ఎపిక్ సినిమాపై టీమ్ అంతా మొదటి నుంచి ఎంతో నమ్మకంగా ఉన్నాం. 80ఎస్, 90ఎస్, 2000ఎస్ ఇలా అన్ని జనరేషన్ల వారికి ఈ సినిమా కనెక్ట్ అవుతుంది. చదువు కోసం విదేశాలకు వెళ్లిన వారికి మాత్రమే కాకుండా, కుటుంబానికి దూరంగా ఉండే ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది.

**ఆదిత్య పాత్రలో మిమ్మల్ని మీరు చూసుకున్నారా?**
నూటికి నూరు శాతం చూసు కున్నాను. ఎపిక్ కథ వింటున్నప్పుడే ఇదేంటి నా కథ లాగే ఉంది అనుకున్నాను. నేను అమెరికాలో చదువుకున్నాను. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ అనే తేడా లేకుండా విదేశాల్లో చదువుకుంటున్న తెలుగువారంతా ఈ సినిమాకు బాగా కనెక్ట్ అవుతారు.

**ఆదిత్య పాత్ర ఎలా ఉండబోతుంది?**
నేను పోషించిన ఆదిత్య పాత్ర చాలా ఇన్నోసెంట్‌గా ఉంటుంది. ప్రతి విషయంలో కన్ఫ్యూజ్ అవుతుంటాడు. లైఫ్ లో తనకి నచ్చింది చేయాలా? లేక పేరెంట్స్‌కి నచ్చినట్టు బ్రతకాలా?

**బేబీ ప్రభావం ఈ సినిమాపై ఎంతవరకు ఉంటుంది?**
బేబీ అంత పెద్ద విజయం సాధించింది కాబట్టి, నేనువైష్ణవి కలిసి నటిస్తున్నప్పుడు ఆ సినిమా గురించి మాట్లాడటం సహజమే. అయితే బేబీకి, ఎపిక్ సినిమాకి పోలిక లేదు. రెండూ దేనికవే ప్రత్యేకమైనవి. బేబీ ఒక సంచలనమైతే, ఇది ఒక అందమైన ప్రయాణం లాంటిది.

**90ఎస్ సిరీస్ కి కొనసాగింపుగా ఎపిక్ సినిమా ఉంటుందా?**
90ఎస్ సిరీస్‌కి సీక్వెల్ కాదు. కానీ, ఆ ప్రపంచంలో నుంచి, ఆ పాత్రల నుంచి పుట్టిన కథే ఇది. చిన్న కొడుకు ఆదిత్య విదేశాలకు చదువుకోవడానికి వెళ్ళినప్పుడు అక్కడ జరిగే కథగా ఇది ఉంటుంది.

**వైష్ణవి చైతన్య పోషించిన కడలి పాత్ర ఎలా ఉండబోతుంది?**
కడలి పాత్ర ప్రతి అమ్మాయికి కనెక్ట్ అవుతుంది. ఒక అమ్మాయి పైకి నవ్వుతూ కనిపిస్తున్నంత మాత్రాన, తను సంతోషంగా ఉందని కాదు.

**మీ వదిన రష్మికతో సినిమాల గురించి చర్చిస్తూ ఉంటారా?**
సినిమాల గురించి పెద్దగా మాట్లాడుకోము. కానీ, ఎపిక్ ఎప్పుడు విడుదల చేయాలని రిలీజ్ డేట్ కోసం కొంచెం టెన్షన్ పడుతున్న సమయంలో.. వదిన నాకు మెంటల్ గా సపోర్ట్ గా నిలబడ్డారు.

**మీ వదిన రష్మికతో సినిమాల గురించి చర్చిస్తూ ఉంటారా?**
సినిమాల గురించి పెద్దగా మాట్లాడు కోము. కానీ, ఎపిక్ ఎప్పుడు విడుదల చేయాలని రిలీజ్ డేట్ కోసం కొంచెం టెన్షన్ పడుతున్న సమయంలో.. వదిన నాకు మెంటల్‌గా సపోర్ట్‌గా నిలబడ్డారు.

# తెర


## 'సిగ్మా' రేజ్ ఆఫ్ సిగ్మా సాంగ్ రిలీజ్

లైకా ప్రొడక్షన్స్ సుభాస్కరన్ నిర్మాణంలో రాబోతున్న మోస్ట్ ఎవైటెడ్ మూవీ"సిగ్మా . సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా ద్వారా జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇప్పటికే విడుదలైన తొలి రెండు పాటలు"సిగ్మా స్టైల్,"అయ్యయ్యో అమ్మడ్డి సినిమాపై మరింత బజ్ క్రియేట్ చేశాయి. రెండు పాటలు విభిన్నమైన మూడ్స్‌తో ఆకట్టుకోవడంతో "సిగ్మాపై ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ మరింత పెరిగింది. తాజాగా మేకర్స్ రేజ్ అఫ్ సిగ్మా పాటని రిలీజ్ చేశారు. తమన్ అందించిన పవర్‌ఫుల్




మ్యూజిక్, సీన్ రోనాల్డ్ ఎనర్జిటిక్ వోకల్స్‌తో Rage Of Sigmae సాంగ్ ఆకట్టుకుంటోంది. విడుదలైన వెంటనే ఈ పాటకు సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది.లైకా ప్రొడక్షన్స్, ఏ. సుభాస్కరన్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా, రాజు సుందరం, సంపత్ రాజ్, శివ పండిట్, అన్బు థాసన్, యోగ్ జపి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి తమన్ ఎస్. సంగీతం అందిస్తున్నారు. కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, హరిహరసుధన్ వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.

## 'మహేంద్రగిరి వారాహి' భారీ బడ్జెట్‌తో నిర్మించాం: నిర్మాత మధు కలిపు



**మీ సినీ ప్రయాణం గురించి చెప్పండి?**
నాకు ముందేం సినిమా నేపథ్యం లేదు. దర్శకుడు శేఖర్ కమ్ములతో 'హ్యాపీడేస్' సమయం నుంచి పరిచయం ఉంది. అలాగే కిరణ్, అడివి శేష్‌కూడా నాకు మంచి మిత్రులు. అలా నేను సినిమాల్లోకి వచ్చాను. అంతకంటే ముందు బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్ రంగాల్లో వ్యాపారాలు చేశాను.

**'మహేంద్రగిరి వారాహి' సినిమా ఎలా మొదలైంది?**
'రంగమార్తాండ' తర్వాత మరొక మంచి సినిమా చేయాలనుకుంటున్న సమయంలో దర్శకుడు సంతోష్ ఈ వారాహి అమ్మవారి స్క్రిప్ట్ చెప్పారు. కథ బాగా నచ్చడంతో ప్రాజెక్ట్ ప్రారంభించాము.

**చాలా మంది స్టార్స్ వున్నారు కదా?**
అవునండి. సుమంత్, సిద్ధు జొన్నలగడ్డ గారు, ఐశ్వర్య రాజేష్‌ఇలా అద్భుతమైన నటీనటులు నటించిన పర్ఫెక్ట్ మల్టీస్టారర్ ఇది. సుమంత్ నటన అద్భుతంగా ఉంటుంది. ఐశ్వర్య రాజేష్‌అమ్మవారి రూపంలో చాలా అద్భుతంగా కనిపిస్తారు. సిద్దుపాత్ర చాలా ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది.

**లక్ష్మణ్ ఎలా వచ్చారు?**
లక్ష్మణ్ రంగమార్తాండ నుంచి నా తోడున్నారు. ఈ కథ నచ్చి ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు.

**సినిమాలో స్పెషల్ ఎఫెక్ట్స్, విజువల్స్ ఎలా ఉంటాయి?**
డివోషనల్ ఎలిమెంట్స్‌తో వస్తున్న సినిమా ఇది. కథలో ఏముందో ఎక్కడా రాజీ పడకుండా తీశాం. దాదాపు గంట పాటు విఎఫ్ఎక్స్ (VFX) వర్క్ ఉంటుంది. అన్నపూర్ణ స్టూడియోస్‌లో చేయించిన ఈ వర్క్ అంతా చాలా నేచురల్‌గా, అద్భుతంగా వచ్చింది. అలాగే సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకి మేజర్ అసెట్‌గా నిలుస్తాయి.

**చిత్రీకరణ ఎక్కడెక్కడ జరిపారు?**
మేము దాదాపుగా అన్నీ ఒరిజినల్ లొకేషన్లలోనే తీశాం. రామచంద్రపురం కోట, ముచ్చింతల్, గండికోట, ఒరిస్సాలోని వివిధ ప్రాంతాల్లో షూట్ చేశాం. కేవలం అమ్మవారి గర్భగుడికి మాత్రం

**బ్రహ్మానందం పాత్ర గురించి?**
బ్రహ్మానందం గారి క్యారెక్టర్ చాలా డివోషనల్‌గా ఉంటుంది. ఇప్పటివరకు ఆయన ఇలాంటి పాత్ర చేయలేదు, చాలా డిఫరెంట్‌గా ఉంటుంది.

**పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర ప్రభావం ఉందా?**
పవన్ కళ్యాణ్ 'వారాహి' యాత్ర వల్ల ఈ పేరుకు మంచి ప్రచారం వచ్చింది. ఆ తర్వాత వారాహి అమ్మవారి గుప్త నవరాత్రులు జరగడం, కాకినాడలో ఆలయ నిర్మాణం జరగడం చూశాం. పవన్ భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలిచి అద్భుతమైన ఫలితాలు పొందారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉంటాయి.

**బిజినెస్ గురించి?**
సినిమా టీజర్‌తోనే ఓటీటీ డీల్స్ క్లోజ్ అయిపోయాయి. ట్రైలర్ విడుదలయ్యాక చాలామంది థియేట్రికల్ కోసం అడిగారు, కానీ కంటెంట్ మీద ఉన్న నమ్మకంతో ప్రపంచవ్యాప్తంగా మేమే సొంతంగా భారీస్థాయిలో విడుదల చేస్తున్నాము. దాదాపు 900 స్క్రీన్స్ లో రిలీజ్ చేస్తున్నాం.ప్రమోషన్లలో భాగంగా దాదాపు 150 థియేటర్లలో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించాము.

**మీ నెక్స్ట్ ప్రాజెక్ట్‌లు ఏమిటి?**
దర్శకుడు సంతోష్‌తో మరొక సినిమా చేసే ఆలోచన ఉంది. దాంతో పాటు ఒక హాలీవుడ్ స్టూడియోతో కలిసి నేరుగా ఇంగ్లీష్, తెలుగు భాషల్లో ఒక హారర్ సినిమా చేస్తున్నాం.

## 'కాకా' అనస్వర రాజన్ ఫస్ట్ లుక్ రిలీజ్



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి వాల్తేరు వీరయ్య సక్సెస్ తర్వాతప్రతిష్టాత్మక చిత్రం 'కాకా'తో రాబోతున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కే నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలను నెలకొల్పుతోంది. భారీ స్థాయి లో హైఇంటెన్సిటీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ లో మెగాస్టార్ ను రెండు డిఫరెంట్ షేడ్స్‌లో చూపించడంతో సినిమాపై మాస్‌లో భారీ క్రేజ్ ఏర్పడింది. ఈ సినిమాలో కీలక పాత్ర లో నటిస్తున్న అనస్వర రాజన్ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా మేకర్స్ ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఆమె వెనుక పడిన నీడ పోస్టర్ మూడ్‌ను పూర్తిగా మార్చేస్తోంది. గోడపై మెగాస్టార్ చిరంజీవి సిల్హౌట్ కనిపిస్తూ, అనస్వర సాఫ్ట్, చీర్‌ఫుల్ అప్పియరెన్స్‌కు ఆసక్తికరమైన కాంట్రాస్ట్‌ను క్రియేట్ చేస్తోంది. అనస్వరను మేకర్స్ హార్ట్ ఆఫ్ కాకా"గా ఆమె పాత్రను అమ్ములు పాప"గా రివీల్ చేశారు.ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుండగా, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి.అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ చేస్తున్నారు. ఆంటోనీ ఎల్ రూబెన్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.

## 'కళ్యాణం కమనీయం జీవితం' ట్రైలర్ లాంచ్ ఈవెంట్



ఈ నెల 18న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న మూవీ..వివిపై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై, ఖాన్ దురాని, సాహితి ఆవంచ హీరో హీరోయిన్స్‌గా రవి లోకిరెడ్డి డైరెక్షన్ లో పైలా ప్రసాద్ రావు, కిషోర్ గుండాల సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'కళ్యాణం కమనీయం జీవితం'. ఈ సినిమా ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ మురళీ కార్తికేయ మాట్లాడుతూ నేను కంపోజ్ చేసిన ఒక పాట వల్ల నాకు ఈ మూవీ అవకాశం వచ్చింది. ప్రొడ్యూసర్ పైలా ప్రసాద్ రావు మాట్లాడుతూ యూఎస్‌లో సాఫ్ట్ వేర్ రంగంలో ఉన్న మాకు సినిమా అంటే ప్యాషన్. మేము గతంలో 24 కిస్సెస్ మూవీ నిర్మించాం. కొత్త వాళ్లకు అవకాశం కల్పిస్తూ ఇన్నోవేటివ్ కంటెంట్ ను ఆడియెన్స్ కు చూపించాలనే ప్రయత్నంతో మా సొంత బ్యానర్ పై "కళ్యాణం కమనీయం జీవితం' సినిమాను నిర్మించాం. ప్రొడ్యూసర్ కిషోర్ గుండాల మాట్లాడుతూ నా మిత్రుడు ప్రసాద రావు ఈ కథ గురించి చెప్పిన వెంటనే ఇంకేమీ ఆలోచించకుండా సినిమా ప్రొడక్షన్ లో భాగమయ్యాను. డైరెక్టర్ వి.వి.వినాయక్ మాట్లాడుతూ ఈ సినిమా చిన్నదే గానీ సినిమా తీసిన వాళ్లు చిన్న వాళ్లు కాదు. ఈ చిత్రంతో ఒక కొత్త దర్శకుడికి అవకాశం కల్పించినందుకు ప్రొడ్యూసర్స్ ప్రసాదరావు, కిషోర్‌కి మా డైరెక్టర్స్ అందరి తరుపున థ్యాంక్స్ ప్రొడ్యూసర్ కేఎల్ దామోదరప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి కొత్త ప్రొడ్యూసర్స్ ను కాపాడుకోవాల్సిన బాధ్యత మన ఇండస్ట్రీ పై ఉంది. వాళ్లు బాగుంటే మరో నాలుగు సినిమా తీసి కొత్త వాళ్లకు అవకాశం కల్పిస్తారు. దర్శక నిర్మాత అయోధ్యకుమార్ మాట్లాడుతూ నిర్మాత ప్రసాదరావు నాకు చిరకాల మిత్రులు. 24 కిస్సెస్ తర్వాత ఆయన నిర్మిస్తున్న రెండో చిత్రమిది.

## ఘనంగా సౌత్ ఇండియన్ మీడియా అవార్డ్స్ వేడుక

ప్రతిష్ఠాత్మక TNIT సౌత్ ఇండియన్ మీడియా అవార్డ్స్ వేడుక ప్రెస్ మీట్ దక్షిణాది మీడియా రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన జర్నలిస్టులు, మీడియా సంస్థలు, డిజిటల్ క్రియేటర్ల సేవలను గుర్తించి పురస్కరించేందుకు TNIT మీడియా అకాడమీ ఆధ్వర్యంలో TNIT సౌత్ ఇండియన్ మీడియా అవార్డ్స్ 2026ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికారిక సమాచారాన్ని వెల్లడిం చేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు.




యాక్టర్ అలీ మాట్లాడుతూ అవార్డులు నటులకు, దర్శకులకు, టెక్నీషియన్లకు, మిగతా అన్ని డిపార్ట్‌మెంట్లకు కూడా దొరుకుతుంటాయి. కానీ వాళ్లందరినీ హైలైట్ చేసే ఒక రిపోర్టర్‌కు అవార్డు ఇవ్వాలనే ఆలోచన రావడం చాలా అద్భుతమైన విషయం. రఘుకి ఇలాంటి ఆలోచన రావడం చాలా ఆనందంగా ఉంది. రిపోర్టర్లకు, ఫోటో గ్రాఫర్లకు ఇలా మీడియా రంగంలోని అందరికీ అవార్డులు ఇవ్వడంతో పాటు ఒక హెల్త్ కార్డు కూడా ఇస్తే బాగుంటుందని నా ఆలోచన. దానికి నా సపోర్ట్ కూడా ఉంటుంది. ఈ హెల్త్ కార్డు ప్రతి కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుంది. అక్టోబర్ 23న బెంగళూరులో ఈ వేడుక జరుగు తుంది. దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ: మీడియా సినీ పరిశ్రమలోని కళాకారులను ప్రోత్స హిస్తుంది. వాళ్లు లేకపోతే మాకు గుర్తింపు లేదు. అలాంటి మీడియాను TNIT సౌత్ ఇండియన్ మీడియా అవార్డ్స్‌తో సన్మానించడం చాలా ఆనందంగా ఉంది. నిర్మాత రామ్‌సత్య నారాయణ మాట్లాడుతూ: కెమెరా వెనక ఉండే వాళ్లకు కూడా అవార్డులు ఇవ్వడం గొప్ప విషయం. రఘు భట్ మాట్లాడుతూ: అలీకి, రామ్ సత్యనారాయణకి, రేలంగి నరసింహారావుకి ధన్యవాదాలు.

# వరల్డ్ ఆర్చరీ టైటిల్ కైవసం చేసుకున్న శీతల్

**అహ్మదాబాద్:** తొలి ఎడిషన్‌లో మూడో అంచెగా బుధవారం అహ్మదాబాద్‌లో జరిగిన వరల్డ్ ఆర్చరీ పారా సిరీస్‌లో భారత స్టార్ శీతల్ దేవి తన తొలి మహిళల కాంపౌండ్ వ్యక్తిగత టైటిల్‌ను కైవసం చేసుకుంది. థాయ్‌లాండ్, చెకియాలలో జరిగిన గత రెండు దశల్లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత, ఫైనల్‌లో కజకిస్తాన్‌కు చెందిన ఐజాదా సెయిడాన్‌ను ఓడించిన శీతల్ చివరకు ఆ అడ్డంకిని అధిగమించింది. 144 పాయింట్లతో స్కోర్లు సమం అయిన తర్వాత, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ చివరి ఎండ్‌లో వెనుక నుండి పుంజుకుని షూట్‌ఆఫ్‌కు దారితీసింది. ఆ తర్వాత షూట్‌ఆఫ్‌లో, సీడాన్ తొమ్మిది స్కోరు చేయగా, ఆమె ఇన్నర్‌టెన్ స్కోరు చేసి విజయాన్ని ఖాయం చేసుకుంది.



ఈ టోర్నమెంట్‌లో శీతల్ భారతదేశం తరపున ఏకైక వ్యక్తిగత ఛాంపియన్‌గా నిలిచింది. మొత్తం మీద, భారత ఆర్చర్లు 4 స్వర్ణాలు, 3 రజతాలు, 8 కాంస్యాలతో సహా 15 పతకాలను సాధించారు. పారాలింపిక్ ఈవెంట్లలో భారతదేశానికి మరో నాలుగు వ్యక్తిగత కాంస్య పతకాలు లభించాయి. వీరిలో సరిత (మహిళల కాంపౌండ్), తోమన్ కుమార్ (పురుషుల కాంపౌండ్), భావనాచౌదరి (మహిళల రికర్వ్) స్వాతిచౌదరి (జూ1 మహిళలు) ఉన్నారు. ఇదే రోజు బుధవారం మరో మ్యాచ్‌లో హర్విందర్ సింగ్ మరియు భావనా చౌదరి నేతృత్వంలోని భారత పారా మిక్స్ రికర్వ్ జట్టు చైనాపై 6-0 తేడాతో ఆధిపత్య విజయం సాధించి, వరుసగా తమ రెండవ పారా సిరీస్ టైటిల్‌ను కైవసం చేసుకుంది.

## వాలీబాల్ ఛాంపియన్‌షిప్..

# ఏడేళ్ల తర్వాత క్వార్టర్ ఫైనల్స్‌కు భారత్

**జపాన్:** ఏవీసీ పురుషుల వాలీబాల్ ఛాంపియన్‌షిప్ 2026లో భారత పురుషుల వాలీబాల్ జట్టు బుధవారం జపాన్‌లో జరిగిన మ్యాచ్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. పూల్ ఎ చివరి మ్యాచ్‌లో ఒమన్‌పై బహ్రెయిన్ విజయం సాధించడంతో, పూల్ దశలో ఎనిమిదో ఉత్తమ జట్టుగా నిలిచిన భారత్ చివరి ఎనిమిది జట్లలోకి అర్హత సాధించింది. అంతకుముందు న్యూజిలాండ్‌పై స్ట్రెయిట్ సెట్స్ విజయంతో మూడు పాయింట్లతో తమ పూల్ స్టేజ్ ప్రచారాన్ని ఇప్పటికే ముగించిన భారత్, ఇతర ఫలితాలు తమకు అనుకూలంగా రావాలని ఎదురుచూస్తోంది. చైనా, ఇరాన్‌ల చేతిలో ఓడిపోయినప్పటికీ, న్యూజిలాండ్‌పై సాధించిన విజయం, సెట్‌పాయింట్ నిష్పత్తి ఆధారంగా బహ్రెయిన్‌ను అధిగమించి ఎనిమిదో స్థానాన్ని దక్కించుకోవడానికి సరిపోయింది. 2019లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్న తర్వాత,



ఏడేళ్లలో భారత్ క్వార్టర్ ఫైనల్‌కు చేరడం ఇదే మొదటిసారి. ఈ జట్టు 21 ఏళ్లుగా సెమీఫైనల్స్‌కు చేరలేదు. అయితే, గురువారం జరిగే క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో పూల్ దశలోని అగ్రశ్రేణి జట్టును ఎదుర్కోనున్నందున వారికి మరింత కఠినమైన సవాలు ఎదురుకానుంది. జపాన్ ప్రస్తుతం 9 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో ఉంది, కానీ చైనా, ఇరాన్‌ల (ఇరు జట్లు 6 పాయింట్లతో ఉన్నాయి) మధ్య ఒక మ్యాచ్ మిగిలి ఉంది, ఇది పట్టికలోని అగ్రస్థానాల తుది ర్యాంకులను నిర్ణయిస్తుంది.




# వరుస గేమ్‌లలో తన్వి గెలుపు

**హో చి మిన్ సిటీ (వియత్నాం):** వియత్నాం ఓపెన్ 2026లో తన్వి శర్మ రాచెల్ చాన్‌ను వరుస గేమ్‌లలో ఓడించింది. బుధవారం వియత్నాం ఓపెన్‌లో జరిగిన రౌండ్ ఆఫ్ 32లో, టాప్ సీడ్ తన్వి శర్మ కెనడాకు చెందిన రాచెల్ చాన్ ను 2-11-6, 21-17 తేడాతో వరుస గేమ్‌లలో ఓడించి, బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 100 ఈవెంట్ తదుపరి రౌండ్‌కు చేరుకుంది. వరల్డ్ టూర్ సూపర్ 750 టోర్నమెంట్ ప్రారంభ రౌండ్‌లో డెన్మార్క్‌కు చెందిన అమలీ షుల్జ్‌ను 21-16, 21-17 తేడాతో వరుస గేమ్‌లలో అద్భుతంగా ఓడించి, భారత టీనేజర్ చివరి 16 మందిలో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. అలాగే ఇదేరోజు అంతకుముందు మ్యాచ్‌లో భారత్ ప్లేయర్ అన్మోల్ ఖర్బ్ థాయ్‌లాండ్‌కు చెందిన సరున్రాక్ విటిడ్సార్న్ చేతిలో 14-21, 14-21 తేడాతో ఓడిపోగా, అలప్ మిశ్రా తన స్వదేశీయుడైన ఆర్య భివ్‌పతకిని 21-8, 21-14 తేడాతో ఓడించాడు. ఇక గత నెలలోనే, తైపీలో జరిగిన తైపీ ఓపెన్ సూపర్ 300 మహిళల సింగిల్స్ ఫైనల్‌లో వియత్నాంకు చెందిన ఆరో సీడ్ గుయెన్ థుయ్ లిన్‌ను 21-16, 21-16 తేడాతో ఓడించి తన్వి తన తొలి వరల్డ్ టూర్ టైటిల్‌ను గెలుచుకుంది. కాగా గత ఏడాది యూఎస్ ఓపెన్ సూపర్ 300లో రన్నరప్‌గా నిలిచిన తన్వి, తుది పోరులో న్గుయెన్‌ను ఓడించడానికి కేవలం 36 నిమిషాలు మాత్రమే తీసుకుంది.

## ఆట

## మహిళల ఆసియా కప్..

# నేడే తొలి సెమీఫైనల్ మ్యాచ్

## భారత్ ప్రత్యర్థిగా బంగ్లాదేశ్

**న్యూఢిల్లీ:** మహిళల ఆసియా కప్ 2026 నాకౌట్ సమరానికి తెరలేచింది. గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లు ముగియడంతో సెమీఫైనల్స్ రేసు ఖరారైంది. యూఏఈపై ఉత్కంఠ విజయం సాధించిన బంగ్లాదేశ్ నాలుగో జట్టుగా సెమీస్ అర్హత సాధించింది. మొదటి సెమీఫైనల్లో టీమిండియా





బంగ్లాదేశ్‌ను ఢీకొట్టనుంది. గ్రూప్ బి లో తీవ్ర ఉత్కంఠ నడుమ సాగిన చివరి లీగ్ మ్యాచ్‌లో యుఏఈపై బంగ్లాదేశ్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లకు సమాన పాయింట్లు ఉండటంతో గెలిచిన జట్టుకే సెమీస్ అవకాశం లభించే పరిస్థితి ఏర్పడింది. మహిళల ఆసియా కప్ టోర్నీలో భారత్ హ్యాట్రిక్ విజయాలతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది.

గ్రూప్ ఎ లో అగ్రస్థానంలో నిలిచిన భారత మహిళల జట్టు, గ్రూప్‌బి లో రెండో స్థానంలో నిలిచిన బంగ్లాదేశ్‌తో మొదటి సెమీఫైనల్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ ఈ నెల 10 గురువారం రాత్రి 8 గంటలకు దుబాయ్ అంతర్జాతీయ స్టేడియంలో జరగనుంది. టోర్నీ పొడవునా అజేయంగా నిలిచిన హర్మన్‌ప్రీత్ సేన ఈ మ్యాచ్‌లో గెలిచి ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. రెండో సెమీఫైనల్ మ్యాచ్ ఈ నెల 11 శుక్రవారం జరగనుంది.

మరోవైపు భారత్ చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్థాన్ కూడా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. హాంగ్ కాంగ్‌తో జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పాకిస్థాన్ 72 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. గ్రూప్ బి టాపర్ శ్రీలంక, గ్రూప్ ఎ లో రెండో స్థానంలో నిలిచిన పాకిస్థాన్ జట్లు ఈ పోరులో తలపడనున్నాయి. ఈ మ్యాచ్ కూడా దుబాయ్ వేదికగానే రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ రెండు సెమీఫైనల్స్‌లో విజేతలుగా నిలిచిన జట్లు ఈ నెల 13న జరిగే మహా ఫైనల్లో ఆసియా కప్ ట్రోఫీ కోసం పోరాడతాయి. కాగా గత చరిత్రను పరిశీలించినా భారత్ ఫైనల్ చేరడంలో ఎలాంటి సందేహం లేదు.

ఒకవేళ పాకిస్థాన్ కూడా శ్రీలంకను ఓడించి ఫైనల్ చేరితే మరోసారి దాయాదీ దేశాలు తలపడనున్నాయి. సెప్టెంబర్ 13(ఆదివారం) ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నీలో ఇప్పటికే ఇరు జట్ల మధ్య పోరు ఏకపక్షంగా ముగిసింది. పాకిస్థాన్ 55 పరుగులకు కుప్పకూలగా, భారత్ 8.4 ఓవర్లలోనే 56 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది.



## యుఎస్ ఓపెన్‌లో నవారోపై

# పెగులా విజయం

**న్యూయార్క్:** నవారోపై విజయం సాధించిన పెగులా, సబలెంకాతో సెమీఫైనల్ పోరుకు సిద్ధమయ్యింది. న్యూయార్క్‌లోని ఆర్థర్ ఆషే స్టేడియంలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో, మూడో సీడ్ జెస్సికా పెగులా ఒక సెట్ వెనుకబడినప్పటికీ, 26వ సీడ్ ఎమ్మా నవారోను 3-6, 6-4, 6-3 తేడాతో 2 గంటల 21 నిమిషాల పాటు జరిగిన పోరులో ఓడించి, వరుసగా మూడో ఏడాది యూఎస్ ఓపెన్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. మొదటి సెట్ సర్వీస్ బ్రేక్‌ల మార్పిడితో ప్రారంభమైంది. పెగులా తన సర్వ్‌లో తడబడటంతో ఒకే గేమ్‌లో మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసి 2-4తో వెనుకబడింది. దాదాపు తొమ్మిది నిమిషాల పాటు సాగిన గేమ్‌లో నవారో నెగ్గింది. నవారో తన రెండవ సెట్ పాయింట్‌పై 6-3 తేడాతో కైవసం చేసుకుంది. పెగులా రెండవ సెట్‌ను ప్రారంభించినా స్కోరు 4-4తో సమం అయినప్పుడు, ఇద్దరిలో ఎవరూ తమ ఆధిక్యాన్ని నిలబెట్టుకోలేకపోయారు. ఆ తర్వాత 4-5తో వెనుకబడి 30-30 వద్ద సర్వ్ చేస్తున్నప్పుడు, నవారో ఆ సెట్‌లో తన మొదటి డబుల్ ఫాల్ట్ చేసింది. దాంతో పెగులాకు మ్యాచ్‌లో మొదటి సెట్ పాయింట్ లభించడంతో రెండవ సెట్‌ను 6-4తో కైవసం చేసుకుంది. 3-2 ఆధిక్యంలో ఉన్న పెగులా, నవారో సర్వ్‌పై ఒత్తిడి పెంచి, ఆమె సర్వ్‌ను బ్రేక్ చేసి 4-2 ఆధిక్యం సాధించింది. అప్పుడే నిలకడగా ఆడే పెగులా తన సత్తా చాటడం మొదలుపెట్టింది. ఆమె తన సర్వ్‌ను నిలబెట్టుకుని ఆధిక్యాన్ని 5-2కు పెంచుకుంది. తన తర్వాతి సర్వ్‌లో, రెండవ మ్యాచ్ పాయింట్ వద్ద, పెగులా దానిని సద్వినియోగం చేసుకుని, సెట్‌ను 6-3తో, మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

## పొదుపు పెరిగినా

# అప్పులూ ఎక్కువే!

## భారతీయ కుటుంబాల్లో ఆర్థికస్థితిపై ఆర్బీఐ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:** భారతీయుల్లో పొదుపుచేయడం పెరిగినా అదేస్థాయిలో అప్పులు కూడా పెరిగాయని రిజర్వుబ్యాంకువెల్లడించింది. నాలుగేండ్ల క్రితం భారతీయ కుటుంబాలు తమ వద్ద ఉన్న ప్రతి 100 రూపాయల ఆర్థిక పొదుపునకు 27 రూపాయల అప్పును ఉంటే ఇపుడు రుణం 32 రూపాయలకు చేరింది. రిజర్వుబ్యాంకు తన 2026 ఆగస్టు బులెటిన్‌లో ప్రచురించిన తాజా గృహ ఆర్థిక స్థితిగతులు నివేదికలో ఈ అంశాన్ని ప్రస్తావించింది. ఈ ఏడాది మార్చి నాటికి భారతీయ కుటుంబాల వద్ద రూ.490.3 లక్షల కోట్ల విలువైన ఆర్థిక ఆస్తులు ఉన్నాయి. అదే సమయంలో వారిపై రూ.158.5 లక్షల కోట్ల రుణభారం ఉంది. ఇవి కేవలం ఆర్థిక పొదుపులు మాత్రమే. ఆస్తి, బంగారం ఇందులో పరిగణనలోకి తీసుకోలేదు.2022 జూన్ నుంచి 2026 మార్చి వరకు ఉన్న 16 త్రైమాసికాల కాలంలో కుటుంబాల రుణాలు 78 శాతం



పెరిగాయి. పొదుపు 49 శాతం పెరిగింది. ఆర్థిక వ్యవస్థ 41 శాతం వృద్ధి చెందింది. ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటుతో పోలిస్తే రుణాల వృద్ధి రేటు దాదాపు రెట్టింపుగా ఉంది. కుటుంబాలు తమ వద్ద ఉన్న ఆస్తుల మొత్తాన్ని తగ్గించుకోలేదు. పైగా ఆ నాలుగు సంవత్సరాల కాలంలో ప్రతి సంవత్సరం ఆరంభంతో పోలిస్తే ముగింపు సమయానికి వారి వద్ద ఉన్న ఆస్తుల విలువ పెరిగిందని ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయి. అయితే వాటికి తోడుగా తీసుకున్న అప్పుల విషయంలో మాత్రం మార్పు వచ్చింది. ఈ 49 శాతం ఆ మొత్తం నాలుగు సంవత్సరాల కాలానికి వర్తిస్తుంది. 2024 మార్చి నాటి గణాంకాలను పరిశీలిస్తే ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటుతో పోలిస్తే పొదుపు వృద్ధి నెమ్మదిగా ఉందని ఆర్‌బీఐ డేటా వెల్లడిస్తున్నది. కేవలం అప్పులు మాత్రమే వేగంగా పెరుగుతూ వచ్చాయి. కుటుంబాలు తమ డబ్బును దాచుకునే విషయంలో మార్పు వచ్చింది. ఈ ఏడాది మార్చి నాటికి కుటుంబాల ఆర్థిక ఆస్తులలో 34.4 శాతంతో బ్యాంక్ డిపాజిట్లు ఇప్పటికీ అతిపెద్ద వాటాను కలిగి ఉన్నాయి. మ్యూచువల్ ఫండ్స్ అత్యధిక వృద్ధిని నమోదు చేశాయి. వీటి వాటా 6.4 శాతం నుంచి 10.5 శాతానికి పెరిగింది. ప్రత్యక్ష షేర్ల పెట్టుబడులు 20.1 శాతం నుంచి 18.1 శాతానికి తగ్గాయి. కుటుంబ పొదుపులో ప్రతి 100 రూపాయల్లో సుమారు 29 రూపాయలు షేర్లు, మ్యూచువల్ ఫండ్ల రూపంలో ఉన్నాయి. వీటిలో ఎక్కువ భాగం మార్కెట్ కదలికలకు అనుగుణంగా మారుతుంటుంది.

## వాణిజ్యం

# వరుస సమ్మెలతో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:** బ్యాంకు ఉద్యోగ సంఘాలు వరుస సమ్మెలకు పిలుపునిచ్చాయి. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్, ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఈనెల 11న ఒకరోజు సమ్మెకు ప్రతిపాదించాయి. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది.అదే విధంగా ఆల్ ఇండియా బ్యాంక్ అధికారి సేన మహాసంఘ్,




బ్యాంక్ కర్మచారి సేన మహాసంఘ్ కూడా ఈ సమ్మెల్లో పాల్గొనే అవకాశం ఉంది. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మెకు ఈ సంఘాలు ప్రతిపాదించాయి. అంతేకాకుండా యుఎఫ్ బియు, ఎఐబిఎఎస్ఎం, బికెఎస్ఎం సంఘాలు అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లాలని ప్రతిపాదించినట్లు యూనియన్ బ్యాంక్ తెలిపింది.బ్యాంకింగ్ కార్యకలాపాలపై ప్రభావంఈ సమ్మెల వల్ల కలిగే ప్రభావాన్ని ప్రస్తుతం ఖచ్చితంగా అంచనా వేయలేమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేర్కొంది. సమ్మె జరిగితే దేశవ్యాప్తంగా బ్యాంకుశాఖలు,పరిపాలనా కార్యాలయాల కార్యకలాపాలపై ప్రభావంపడే అవకాశంఉందని తెలిపింది.

# సెన్సెక్స్, నిఫ్టీలకు నష్టాలు!

**ముంబయి, సెప్టెంబరు 9:** భారత స్టాక్ మార్కెట్ బుధవారం భారీగా నష్టపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ 813 పాయింట్లు నష్టపోగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 203 పాయింట్లు నష్టపోయింది. బుధవారం ఉదయం ట్రేడింగ్ నష్టాల్లోనే మొదలైంది. బీఎస్ఈ సెన్సెక్స్ 75,216.22 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. చివరకు 813.35 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ 74,764.23 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 203.60 పాయింట్లు నష్టపోయి 23,431.50 పాయింట్ల వద్ద ముగిసింది. బీఎస్ఈ సెన్సెక్స్ 30 షేర్ ఇండెక్స్‌లో



టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, ఏసియన్ పెయింట్స్, ఎన్టీపీసీ, ట్రెంట్ షేర్లు లాభపడ్డాయి. మరోవైపు మారుతి, ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. బ్రాడర్ మార్కెట్లో నిఫ్టీ 100 షేర్ 0.72 శాతం, నిఫ్టీ ఐటీ ఇంఎక్స్ 3.24 శాతం, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 1.79 శాతం పడిపోయాయి. ఐటీ షేర్లు భారీగా పతనమయ్యాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు అత్యధికంగా 4.55 శాతం పతనమయ్యాయి. ఇన్ఫోసిస్ షేర్లు 4.43 శాతం, టెక్ మహీంద్రా షేర్లు 3.87 శాతం, టీసీఎస్ షేర్లు 2.26 శాతం పనతమయ్యాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 99.60 డాలర్లకు చేరింది. అమెరికాఇరాన్ యుద్ధం మళ్లీ తీవ్రతరం కావడం, సౌదీపై హౌతీ ఉగ్రవాదులు దాడి చేయడం వంటి కారణాల వల్ల క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నాయి. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి, జపాన్ నిక్కీ 225 ఇండెక్స్, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్ లాభాల్లో ముగియగా హాంకాంగ్ సెంగ్ ఇండెక్స్ నష్టాల్లో ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.11 వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర అంతర్జాతీయ మార్కెట్లో 4,391.07 డాలర్ల వద్ద కొనసాగుతోంది.




# 1.05 కోట్ల షేర్లను విక్రయించనున్న న్యూ ఇండియా అష్యూరెన్స్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఐపీఓలో భాగంగా 1.05 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నట్లు ప్రభుత్వ రంగ సాధారణ బీమా సంస్థ ది న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ వెల్లడించింది. కంపెనీ వివరాల ప్రకారం, మొత్తం 1,05,00,000 షేర్ల విక్రయం ద్వారా.. ఎన్ఎస్ఇలో తమకున్న మొత్తం వాటాలో సుమారు 29.83 శాతం వాటాను ఉపసంహరించుకోనుంది. అవసరమైన అన్ని నియంత్రణ సంస్థల అనుమతులు లభించిన తర్వాత, ఎన్ఎస్ఇ ఐపీఓలో భాగంగా ఆఫర్ ఫర్ సేల్ విధానంలో ఈ షేర్లను విక్రయించనున్నట్లు బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎన్ఎస్ఇ నుంచి తమకు మొత్తం రూ.123.20 కోట్ల డివిడెండ్ అందినట్లు న్యూ ఇండియా అష్యూరెన్స్ తెలిపింది.ఐపిఒ ప్రక్రియలో భాగంగా ఎన్ఎస్ఇకు సంబంధించిన ఈక్విటీ షేర్లను 2026 సెప్టెంబర్ 8న ఎస్క్రో ఖాతాకు బదిలీ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. సెబీ సూచించిన ప్రకారం, ఈ షేర్ల విక్రయం లేదా డిస్పోజల్ ప్రక్రియ 2026 సెప్టెంబర్ చివరి నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది.రూ.1,7501,785గా ఎన్ఎస్ఇ ఐపీఓకు రూ.1,750 నుంచి రూ.1,785 వరకు ప్రైస్ బ్యాండ్ నిర్ణయించే అవకాశం ఉంది.ఎన్ఎస్ఇ ఐపిఒ పూర్తిగా ప్రస్తుత వాటాదారులు తమ షేర్లను విక్రయించే ఓఎఫ్ఎస్ రూపంలోనే ఉండనుంది. ఐపీఓలో విక్రయించనున్న ఈక్విటీ వాటాను గతంలో ప్రతిపాదించిన 6 శాతం నుంచి సుమారు 5.5 శాతానికి తగ్గించే అవకాశం ఉన్నట్లు సమాచారం.ఈ ఐపీఓ ద్వారా ఎన్ఎస్ఇ సుమారు రూ.24,300 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

# నేనేమీ రుణాల ఎగవేతదారునికాదు

## -పారిశ్రామికవేత్త విజయ్ మాల్యా



**లండన్, సెప్టెంబరు 9:** తనను పరారీలో ఉన్న వ్యక్తిగా పిలువడంపై ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యా మండిపడ్డారు. తాను కావాలనే బ్రిటన్ లో ఉండిపోలేదని స్పష్టంచేశారు. బ్రిటన్ నుంచి బయటకు వెళ్లేందుకు ప్రస్తుతం తనకు చట్టపరమైన అనుమతి లేదని అన్నారు. 1992 నుంచి బ్రిటన్లో శాశ్వత నివాస హక్కుతో ఉంటున్నానని మాల్యా చెప్పారు. భారత్‌కు రావాలన్నా ప్రస్తుత పరిస్థితుల్లో తాను దేశం విడిచి వెళ్లలేనని పేర్కొన్నారు. తన విషయంలో భారత ప్రభుత్వం వ్యవహరించిన తీరు తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ రుణాల వ్యవహారంలో మాల్యా చాలాకాలంగా న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటున్నారు. కింగ్‌ఫిషర్ భారీ నష్టాల్లో కూరుకుపోయి బ్యాంకుల రుణాలు చెల్లించలేకపోయిన సమయంలో 2016 మార్చిలో ఆయన భారత్ నుంచి బ్రిటన్‌కు వెళ్లారు. బ్యాంకుల కన్సార్టియంకు దాదాపు రూ.9,000 కోట్ల బకాయిలు ఉన్నట్లు కేసులు నమోదయ్యాయి. 2019లో ముంబై ప్రత్యేక కోర్టు ఆయనను పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా ప్రకటించింది. మాల్యాను భారత్‌కు తీసుకొచ్చేందుకు 2017లో కేంద్ర ప్రభుత్వం బ్రిటన్ సర్కారు అనుమతి కోరింది. అదే ఏడాది లండన్లో ఆయన అరెస్టయ్యారు. తర్వాత బెయిల్ లభించినా బ్రిటన్ విడిచి వెళ్లకూడదన్న షరతు విధించారు. భారత్‌కు అప్పగించాలన్న దిగువ కోర్టు నిర్ణయాన్ని మాల్యా హైకోర్టులో సవాల్ చేశారు. ఇదే సమయంలో తనను బ్రిటన్ నుంచి బయటకు వెళ్లనివ్వడం లేదని మాల్యా చెబుతున్నారు. ఇటీవల బాంబే హైకోర్టులోనూ ఇదే విషయాన్ని ఆయన తరఫు న్యాయవాదులు వెల్లడించారు. భారత్‌కు ఎప్పుడు వస్తారో చెప్పాలని కోర్టు కోరగా బ్రిటన్ కోర్టుల ఆంక్షల వల్ల ఇంగ్లండ్, వేల్స్ నుంచి బయటకు వెళ్లలేమని తెలిపారు. మాల్యా పాస్‌పోర్టు కూడా రద్దయిందని చెప్పారు. కింగ్‌ఫిషర్ రుణాల విషయంలో బ్యాంకులు అసలు బకాయిల కంటే ఎక్కువ మొత్తాన్ని ఇప్పటికే రికవరీ చేశాయని మాల్యా తరఫు న్యాయవాదులు కోర్టులో వాదించారు.




# భారత్ బ్యాంకుల డిపాజిట్లలో 15% వృద్ధి: మూడీస్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:** భారత బ్యాంకుల డిపాజిట్ వృద్ధి 2027 ఆర్థికసంవత్సరంలో సుమారు 15 శాతానికి వేగవంతం కావచ్చని రేటింగ్ ఏజెన్సీ మూడీస్ అంచనా వేసింది. ముఖ్యంగా విదేశీ కరెన్సీ నాన్‌రెసిడెంట్ డిపాజిట్లలో భారీ పెరుగుదల దీనికి తోడ్పడనుందని తెలిపింది.విదేశీ కరెన్సీ నాన్‌రెసిడెంట్‌డిపాజిట్ల ప్రభావాన్ని మినహాయిస్తే, 2027లో బ్యాంకుల డిపాజిట్ వృద్ధి సుమారు 10 శాతంగా ఉండొచ్చని మూడీస్ పేర్కొంది. ఇదే సమయంలో బ్యాంకుల రుణవృద్ధి 13-15% మధ్య ఉండొచ్చని అంచనా వేసింది.రిజర్వ్ బ్యాంకు చేపట్టిన స్వాప్ పథకాలు దేశ విదేశీ మారక నిల్వలను పునర్నిర్మించడంలో, రూపాయిపై ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడ్డాయని మూడీస్ తెలిపింది.ఎఫ్‌సిఎన్నార్బీ డిపాజిట్లు పెరగడం వల్ల బ్యాంకుల నిధుల సమీకరణ సామర్థ్యం మెరుగుపడే అవకాశం ఉందని, అయితే దీని ప్రయోజనాలు అన్ని బ్యాంకులకు ఒకే విధంగా ఉండవని పేర్కొంది.ఎఫ్‌సిఎన్నార్బీ డిపాజిట్లు భారీగా వస్తే, బ్యాంకులు అధిక వ్యయంతో కూడిన నిధుల స్థానంలో తక్కువ ఖర్చుతో నిధులను వినియోగించుకునే అవకాశం ఉంటుంది. అలాగే దేశీయ డిపాజిట్ల కోసం బ్యాంకుల మధ్య ఉన్న పోటీ తగ్గవచ్చని మూడీస్ తెలిపింది. ఈ పరిణామం బ్యాంకింగ్ రంగానికి క్రెడిట్ పాజిటివ్గా ఉంటుందని పేర్కొంది.సమీప కాలంలో భారత బ్యాంకుల లిక్విడిటీ కవరేజ్ రేషియో ఎల్‌సిఆర్ 130 శాతానికి పైగా పెరగవచ్చని మూడీస్ అంచనా వేసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.